




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 27, సంచిక: 237 | శనివారం | 15-02-2025 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | ఖమ్మం : 12+8 | కరీంనగర్ : 12+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00


### పాతబస్తీ మీదుగా ఎయిర్‌పోర్టుకు
## ఆర్‌టిసి ఎలక్ట్రిక్ బస్సులు

హైదరాబాద్ పాతబస్తీ మీదుగా శంషాబాద్ ఎయిర్ పోర్టుకు ఆర్‌టిసి కొత్త సర్వీసులను ప్రారంభించింది. పుష్పక్ ఎలక్ట్రిక్ బస్సులను సికింద్రాబాద్ జెబిఎస్ నుంచి ప్రతి గంటకో బస్సు అందుబాటులో ఉంటుందని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, సెక్రటేరియట్, నాంపల్లి, అఫ్జల్ గంజ్, బహదుర్‌పురా, ఆరంఘర్ చౌరస్తా మీదుగా శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుంటుంది.

### కుల గణనను తప్పుబడితే
# శాశ్వత నష్టం





- బలహీనవర్గాల లెక్కలు తేలకుండా మోదీ, కెసిఆర్ కుట్ర
- బిఆర్‌ఎస్ అధినేత కాకిలెక్కలు కట్టారు
- వాటినే ఖురాన్, బైబిల్, భగవద్గీత అని చెబుతున్నారు
- తెలంగాణ కులగణన లెక్కలను బిజెపి నేతలు కోల్డ్‌స్టోరేజీలో పెట్టే యత్నం
- సర్వేలో పాల్గొనేలా కెసిఆర్, కెటిఆర్, హరీశ్ ఇంటిముందు మేలుకొలుపు డప్పు కొట్టాలి
- సర్వేలో పాల్గొనకపోతే కెసిఆర్ కుటుంబానికి సామాజిక బహిష్కరణ
- కులగణన సర్వే, ఎస్‌సి వర్గీకరణపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

''బలహీనవర్గాల సంఘాలు అర్థం చేసుకోవాలి. కులగణన సర్వేను తప్పుబడితే మీరు శాశ్వతంగా నష్టపోతరు. మిమ్మల్ని నష్టపరచాలని ఒక పక్క మోదీ, మరో పక్క కేడీ (కెసిఆర్) ఇద్దరు ప్రయత్నం చేస్తున్నరు.'' అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలో కులగణన లెక్క పక్కాగా తేలితే దేశ వ్యాప్తంగా జనాభా లెక్కల చేపట్టి అన్ని కులాలు, వర్గాల లెక్కలు తీయాలని మోదీ మెడలు వంచి రాహుల్ గాంధీ నిలదీస్తారని బిజెపి నాయకులు భయపడుతున్నారని చెప్పారు. ఇప్పటికే పార్లమెంటు బడ్జెట్ సమావేశాల సందర్భంగా తెలంగాణలో బిసి కులగణన చేశారని, దేశవ్యాప్తంగా ఎప్పుడు చేస్తారని మోదీని రాహుల్‌గాంధీ ప్రశ్నించారని గుర్తు చేశారు. అందుకే బిజెపి నేతలు కుట్ర చేసి తెలంగాణ కులగణన లెక్కలను తప్పుల తడకగా చూపించి కోల్డ్ స్టోరేజ్‌లో పెట్టాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. టిపిసిసి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లోని ప్రకాశంహాల్‌లో 'కులగణన సర్వే'పైన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కమల్లు, ఎస్‌సి వర్గీకరణ పైన మంత్రి దామోదర్ రాజనర్సింహ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. లెక్కలు తేలితే తమ భండారం బైటపడుతుందని కెసిఆర్ కూడా పక్కదోవ పట్టిస్తున్నాడని, మోదీ, కెసిఆర్ ఇద్దరూ ఒకే రకంగా ఆలోచన చేస్తున్నారని సిఎం అన్నారు. కులగణనపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంది కాబటే తప్పుదోవ పట్టించి బలహీనవర్గాలకు శాశ్వతంగా అన్యాయం చేయాలని వీరు ఆలోచన తరువాయి 2లో

## ఏ త్యాగానికైనా సిద్ధం

''రేవంత్ రెడ్డే ఆఖరి రెడ్డి ముఖ్యమంత్రి అని ఒకాయన అప్పుడప్పుడు అంటుంటడు. ఆఖరైనా పర్వాలేదు. మా నాయకుడు ఇచ్చిన మాట నిలబెట్టడం కోసం క్రమశిక్షణ కలిగిన కాంగ్రెస్ కార్యకర్తగా, ముఖ్యమంత్రిగా కులగణన బాధ్యత తీసుకున్న. ముఖ్యమంత్రిగా కులగణన చేసానంటే ఏ త్యాగానికైనా సిద్ధమయ్యే చేశా. పక్కాగా లెక్కలు తేల్చినం. తప్పులు చేయాలంటే మా వాళ్ళను 5 శాతం లోపు ఎందుకు చూపిస్తా, బిసిలను 50 శాతానికి పైగా ఎందుకు చూపిస్త. మా వాళ్ళను 15-20 శాతానికి లెక్కలు చూపిస్తుంటి. ప్రతి మనిషి సమాచారం పక్కాగా ఉంది. నాయకుడికి ఇచ్చిన మాటను నిలబెట్టడమే మా ధర్మం అనుకున్నం. పార్టీ విధానాలు సిద్ధాంతాలను, ఆదేశాలను పాటించిన కాబట్టే ఈ రోజు ఇక్కడి రాగలిగినం.''

– ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

# టారిఫ్‌పై తగ్గని ట్రంప్

- వలసదారులపై పట్టుసడలించని అమెరికా
- మోదీ – ట్రంప్ ద్వైపాక్షిక భేటీ
- అనంతరం ఉమ్మడి మీడియా సమావేశం
- అదానీపై జవాబు దాటేసిన మోదీ
- ఐదేళ్లలో 500 బిలియన్ డాలర్ల వాణిజ్యమే లక్ష్యం
- భారత్‌కు ఎఫ్–35 యుద్ధవిమానాలు
- చైనా సరిహద్దుపై మధ్యవర్తిత్వం చేస్తా : అమెరికా అధ్యక్షుడు



**వాషింగ్టన్ :** అందరూ ఎంతో ఉత్కంఠగా ఎదురుచూసిన మోదీ–ట్రంప్ ద్వైపాక్షిక సమావేశంలో అమెరికా వ్యాపార ప్రయోజనాలే పైచేయి సాధించాయి. భారత్‌తో రక్షణ వ్యాపారాన్ని ట్రంప్ విస్తరించారు. ఉన్నతవిద్యారంగంలో ప్రైవేటు సంస్థల విస్తరణలో సహభాగస్వామ్యానికి వారు అంగీకరించారు. రాబోయే ఐదేళ్ళలో 500 బిలియన్ డాలర్ల మేరకు రెట్టింపు ద్వైపాక్షిక వాణిజ్య వృద్ధి లక్ష్యాన్ని నాయకులిద్దరూ నిర్దేశించుకున్నారు. ముంబై ఉగ్రవాద దాడుల్లో ప్రధాన నిందితుడు తహవ్వుర్ రాణాను భారత్‌కు తరలించేందుకు ట్రంప్ అంగీకరించారు. భారత్‌కు ఇంధన వనరుల ఎగుమతుల పెరుగుదల, రక్షణరంగంలో గంటకు 1200 మైళ్ళ వేగంతో అందరికళ్ళు కప్పి దూసుకుపోయే అత్యాధునికమైన ఎఫ్–35 యుద్ధ విమానాల (స్టెల్త్ కంబాట్ జెట్స్)సరఫరా, సాంకేతికత బదిలీ, కీలక ఆయుధాల సహభాగస్వామ్య ఉత్పత్తి వంటివి వైట్‌హౌస్‌లో ట్రంప్‌తో ద్వైపాక్షిక చర్చల సందర్భంగా ప్రధానాంశాలుగా ముందుకు వచ్చాయి. వీటిపై ఇరు దేశాల నాయకులు ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా మోదీపై ట్రంప్ ప్రశంసలు కురిపించారు. అనేక అంతర్జాతీయ విషయాలపై మోదీ వైఖరిని ఆయన ప్రశంసించారు. ద్వైపాక్షిక సమావేశం అనంతరం ట్రంప్–మోదీ ఇద్దరూ వైట్‌హౌస్‌లో సంయుక్త పత్రికాగోష్ఠిలో మాట్లాడారు. భారత్‌తో కొత్తగా పది సంవత్సరాలపాటు రక్షణ భాగస్వామ్య ప్రణాళికకు ఈ చర్చల్లో తెరలేచింది. సైనికరంగంలో భారత్‌కు ఆయుధ పరికరాల విక్రయాన్ని అమెరికా పెంచుతుంది. భారతకాలమానం ప్రకారం శుక్రవారం నాడు (అమెరికా కాలమానం ప్రకారం గురువారం) మోదీ–ట్రంప్ మధ్య ఓవల్ కార్యాలయంలో ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. ఇండో–పసిఫిక్ సముద్ర తరువాయి 2లో

### రాష్ట్రపతి పాలనను
# ముసుగులా వాడుకోవద్దు

- మణిపూర్‌లో తాజా ఎన్నికలే ఉత్తమం
- సిపిఐ డిమాండ్
- శాసనసభను నిద్రావస్థలో ఉంచడంలో రాజకీయ హేతుబద్ధత లేదని వ్యాఖ్య

**న్యూఢిల్లీ :** మణిపూర్ శాసనసభకు మళ్ళీ తాజాగా ఎన్నికలు నిర్వహించడమే ఉత్తమ మార్గమని భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) అభిప్రాయపడింది. రాష్ట్రపతిపత్తిని దిగజార్చి మానవ హక్కులను ఉల్లంఘించడానికి లేదా ప్రజాస్వామ్య సూత్రాలను కబళించడానికి రాష్ట్రపతి పాలనను ఒక ముసుగుగా ఉపయోగించుకోకూడదని సిపిఐ డిమాండ్ చేసింది. రాష్ట్రపతి పాలన విధించిన తర్వాత మణిపూర్ శాసనసభను నిద్రావస్థలో ఉంచడంలో ఎలాంటి రాజకీయ హేతుబద్ధతాలేదనీ, అలా చేయడం అర్థరహితమనీ, అందువల్ల శాసనసభకు తాజాగా ఎన్నికలు నిర్వహించడమే ఉత్తమం అనీ సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. ''మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించడంతో, 'డబుల్ ఇంజిన్'గా ప్రచారం చేసుకున్న బిజెపి ప్రభుత్వ వైఖరి విఫలమైందని తేలిపోయింది. మణిపూర్‌లో నెలకున్న పరిస్థితిని దుర్వినియోగం చేసినప్పటికీ, నిరాశానిస్పృహలకు గురైన బిజెపి అధికారాన్ని తరువాయి 2లో





# తెలంగాణ ఉద్యమంపై పుస్తకాలు

- సాయుధ పోరాటం, తొలి, మలి దశలో అసువులుబాసిన వీరుల త్యాగాల చరిత్ర లిఖించాలి
- మాజీమంత్రి దేవేందర్‌గౌడ్ రచించిన 'విజయ తెలంగాణ' ఆవిష్కరణ సభలో ముఖ్యమంత్రి

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం మొదలు తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో పాల్గొని, అసువులు బాసిన వీరుల త్యాగాలను చరిత్రలో లిఖించాల్సిన అవసరముందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. మాజీ రాష్ట్ర హోంమంత్రి తూళ్ల దేవేందర్ గౌడ్ రచించిన ''విజయ తెలంగాణ'' అనే గ్రంథాన్ని సిఎం అవిష్కరించారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు తరువాయి 2లో

### రాష్ట్ర తలసరి ఆదాయం
# రూ.3.56 లక్షలు

- రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.15.02 లక్షల కోట్లు
- వృద్ధి రేటు 14.5 శాతం
- అభివృద్ధిపథంలో శరవేగంగా దూసుకెళ్తున్న తెలంగాణ
- నాబార్డు స్టేట్ ఫోకస్ పేపర్ ఆవిష్కరణలో ఉపముఖ్యమంత్రి భట్టి
- అభివృద్ధి అంటే లెక్కలు కావని వ్యాఖ్య



ప్రజాపక్షం/హైదరాబాద్

దేశంలో తెలంగాణ రాష్ట్రం శరవేగంగా అభివృద్ధిపథంలో దూసుకుపోతోందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జిఎస్‌డిపి) రూ. 15.02 లక్షల కోట్లు కాగా, వృద్ధిరేటు 14.5శాతమని తెలిపారు. అంతేకాకుండా రాష్ట్రంలో ప్రతి వ్యక్తి తలసరి ఆదాయం రూ.3.56 లక్షలగా ఉందని వెల్లడించారు. శుక్రవారంహైదరాబాద్‌లో జరిగిన నాబార్డ్ స్టేట్ ఫోకస్ పేపర్ ఆవిష్కరణ సమావేశానికి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ అభివృద్ధి అనేది కేవలం సంఖ్యల రూపంలో కాకుండా రైతులు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలతో పాటు గ్రామీణ ప్రాంతాలను పెద్ద ఎత్తున నిధులను ఖర్చు చేయడం ద్వారా అభివృద్ధి పథంలోకి తీసుకు వెళ్తున్నామని చెప్పారు. ఈ ప్రయాణంలో నాబార్డ్ కీలక భాగస్వామిగా ఉందని రాబోయే రోజుల్లో మరింత ప్రోత్సాహం తరువాయి 2లో

### తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి
# మీనాక్షి నటరాజన్



**న్యూఢిల్లీ :** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్‌ను మార్చారు. ఎన్నికలకు ముందు ఎఐసిసి ఇన్‌ఛార్జ్‌గా వచ్చిన దీపాదాస్ మున్షీ స్థానంలో కొత్తగా మీనాక్షి నటరాజన్‌ను ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం నియమించారు. ఈమేరకు ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ గురువారం ఒక ప్రతికా ప్రకటనను విడుదల చేశారు. ఆమె ను రాహుల్‌గాంధీ టీమ్‌లో కీలక సభ్యురాలు. మీనాక్షి నటరాజన్ గతంలో ఎన్‌ఎస్‌యుఐ జాతీయ అధ్యక్షురాలిగా పనిచేశారు. ఆ తరువాత ఎఐసిసి ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. 2014లో లోక్‌సభ సభ్యురాలిగా పని చేశారు. త్వరలో పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రస్తుత ఇన్‌ఛార్జ్ దీపా దాస్ మున్షీనీ రిలీవ్ చేశారు.

# రైతులతో కేంద్రం చర్చలు

### ఎనిమిది మంది రైతు ప్రతినిధులతో కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి భేటీ
### 22న మరోసారి సమావేశం



**ఛండీగఢ్ :** రైతుల సమస్యలపై కేంద్రం, రైతు నాయకుల మధ్య శుక్రవారం జరిగి సుహృద్భావ వాతావరణంలో జరిగాయి. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి నేతృత్వంలో ఉన్నతాధికారుల బృందం రైతు నాయకులతో భేటీ అయింది. ఏడాది కాలంగా రైతులు ఆందోళ నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ భేటీ ఏర్పాటయింది. సంయుక్త కిసాన్ మోర్చా(నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా రైతు సంఘాలకు చెందిన 28మంది ప్రతినిధుల బృందంతో కేంద్ర బృందం చర్చలు సాగించింది. దాదాపు రెండున్నర గంటలపాటు ఈ చర్చలు సాగాయి. మరో విడత చర్చలు 22వ తేదీని నిర్వహించాలని ఇరుపక్షాలు నిర్ణయించాయి. తదుపరి చర్చలకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ నేతృత్వం వహిస్తారని, తానుకూడా పాల్గొంటానని ప్రహ్లాద్ జోషి తెలిపారు. రైతుల సంక్షేమానికి ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను రైతు ప్రతినిధులకు తెలియజేశామని జోషి అన్నారు. శుక్రవారంనాటి సమావేశంలో కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ కల్పించే విషయమై వివరంగా చర్చించామని రైతు నాయకుడు శర్వణ్ సింగ్ పాంధర్ తెలిపారు. ఈ సమావేశానికి పంజాబ్ వ్యవసాయ మంత్రి తరువాయి 12లో



### మల్లన్నసాగర్
# కాలువకు గండి

- సాగు కోసం వదిలిన జలాలు వృథా
- దుబ్బాక - మల్లయ్యపల్లి గ్రామాల మధ్య నిలిచిన రాకపోకలు

**దుబ్బాక :** సిద్దిపేట జిల్లా దుబ్బాక పురపాలికలోని మల్లయ్య పల్లి శివారులో మల్లన్న సాగర్ జలాశయ 14.5 కిలోమీటర్ల ఉపకాలువ 4 ఎల్ డిస్ట్రిబ్యూటరీ కాలువకు గండి పడింది. కాలువ నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. ఫలితంగా యాసంగి కోసం వదిలిన గోదావరి జలాలు వృథాగా పోతున్నాయి. యాసంగి సీజన్‌లో సాగునీరు అందించడానికి తరువాయి 2లో

### నిబంధనలకు విరుద్ధంగా
# నియామకాలు

- నిర్మల్‌లోని మైనారిటీ వెల్ఫేర్ కళాశాలలో వెలుగుచూసిన వైనం
- అభ్యర్థులకు తెలియకుండానే డెమో, ఎంపిక పూర్తి
- త్రీ మెన్ కమిటీ లేకుండానే అభ్యర్థుల షార్ట్ లిస్ట్





ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి

నిర్మల్ జిల్లాలోని మైనారిటీ వెల్ఫేర్ కళాశాలలో పిజిసిఆర్టి, టిజిటి పోస్టుల భర్తీలో నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు జరిగినట్లు తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అభ్యర్థులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే హైదరాబాద్‌లో డెమో నిర్వహించి నియామకాలు చేపట్టినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న నిరుద్యోగులు సమాచారం ఇవ్వకుండా డెమో ఏవిధంగా నిర్వహిస్తారు అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల ప్రకారం గత నెల 21న టిఎంఆర్‌ఇఐఎస్ సెక్రటరీ మైనారిటీ కళాశాలలో ఖాళీగా ఉన్న లెక్చరర్, టీచర్ పోస్టులను భర్తీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఏజెన్సీ ద్వారా అర్హతగల నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటనలు సైతం చేశారు. కాగా నిరుద్యోగులు ఆయా పోస్టులకు వందల సంఖ్యలో దరఖాస్తులు తరువాయి 12లో

### నిర్దిష్ట రీతిలో చట్టాలు చేయాలని
# కోర్టులు ఆదేశించలేవ్



- సుప్రీంకోర్టు స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** నిర్దిష్ట రీతిలో చట్టాలు చేయాలని కోర్టులు చట్టసభలను ఆదేశించలేవని సుప్రీంకోర్టు శుక్రవారం స్పష్టంచేసింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్.గవాయ్, ఆగస్టిన్ జార్జి మాసిహ్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం 2024 ఫిబ్రవరిలో ఢిల్లీ హైకోర్టు ఈ అంశంపై పిటిషన్‌ను కొట్టివేయడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) విచారణ సందర్భంగా తరువాయి 12లో

# ఉక్రేన్‌కు నాటో సభ్యత్వమే రష్యాకు ప్రధాన అడ్డంకి

## 'మాగా' ప్లాన్‌తో ట్రంప్ మధ్యవర్తిత్వం



**వాషింగ్టన్ :** ఉక్రేన్–రష్యా మధ్య యుద్ధాన్ని ముగించడంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వాణిజ్య ప్రయోజనాలనే ప్రధానంగా ఆశిస్తున్నారని ఉక్రేన్ మీడియా అంచనా వేస్తున్నది. ట్రంప్‌తో ఫోన్ సంభాషణల్లో పుతిన్ చర్చలకు సిద్ధపడటంతో యూరోపియన్ యూనియన్, జెలెన్స్కీ కూడా ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఆయన వ్యూహం ఏమిటా? అని ఆలోచనతో ఉన్నారు. పుతిన్ శాంతి మంత్రాన్ని విశ్వసించవద్దని ట్రంప్‌ను జెలెన్స్కీ హెచ్చరిస్తున్నారు. పుతిన్‌తో గాఢమైన అనుబంధాన్ని క్రమంగా పెంచుకుంటున్న ట్రంప్ రష్యా ప్రయోజనాలు కాపాడుతున్నారని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ భావిస్తున్నారు. ఇటీవలికాలంలో ట్రంప్ ప్రకటనల ద్వారా ఆయనకు ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. అందుకే యూరోపియన్ యూనియన్ కూడా చర్చల్లో ఉండాలని నాటో కోరుకుంటున్నది. నాలుగు ఉక్రేన్ రీజియన్లలో రష్యా ఆక్రమించుకున్న భూభాగాలు పూర్తిస్థాయిలో తిరిగి ఉక్రేన్ స్వాధీనం చేసుకునే అవకాశాలు ట్రంప్ ప్రకటనలలో కనిపించకపోవడంతో ఆయన చెప్పిన ఆంక్షలకు జెలెన్స్కీ తలవొగ్గే పరిస్థితులు వచ్చాయి. ట్రంప్‌కు విలువైన మైనింగ్ భూములు ఇచ్చేందుకు జెలెన్స్కీ సిద్ధపడ్డారు. తద్వారా యుద్ధ విధ్వంసంలో ఉన్న ఉక్రేన్‌లో కొత్త ఉద్యోగాలు పుట్టుకువస్తాయని ఆయన ఆశిస్తున్నారు. ఐతే ట్రంప్ యంత్రాంగంలో జె.డి.వాన్స్, ఎలాన్ మస్క్ ఎవరికి వారే యమునా తీరే అన్న రీతిలో విభిన్న ప్రకటనలు చేయడంతో జెలెన్స్కీ ట్రంప్ మాటలనే ప్రామాణికంగా తీసుకుంటున్నారు. ''మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్'' (మాగా) అనే నినాదాన్నే ఆచరణలోనూ ట్రంప్ అనుసరిస్తుండటంతో జెలెన్స్కీ ఒక్కొక్కమెట్టూ దిగుతున్నట్టు కనిపిస్తున్నది. యూరోపియన్ యూనియన్‌పై ట్రంప్ ప్రత్యేక ప్రేమ చూపించడంలేదు. నాటో కూటమిలో సభ్యత్వం అడిగితే సహించేదిలేదని, నాటో సభ్యత్వం ఉక్రేన్‌కు ఇస్తే యుద్ధం కొనసాగుతుందని రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇప్పటికీ హెచ్చరిస్తున్నారు. ఒకవేళ జో బైడెన్‌కు బదులుగా డోనాల్డ్ ట్రంప్ అధికారంలో ఉండి ఉంటే నాటోలో ఉక్రేన్‌కు సభ్యత్వం ఇచ్చే ప్రతిపాదనే వచ్చి ఉండేదికాదనీ, అలాంటప్పుడు యుద్ధం మొదలయ్యేదే కాదనీ పుతిన్ పదే పదే చెబుతూ వస్తున్నారు. నాటో కూటమిలో సభ్యత్వం తీసుకుని ఆ కూటమిని తన సరిహద్దుల్లో కూర్చోబెడితే ఊరుకునేది లేదని మొదటినుండీ పుతిన్ హెచ్చరిస్తున్నారు. రష్యా దిశగా నాటో యుద్ధోన్మాదాన్ని విస్తరించేందుకు ఉక్రేన్‌ను ఒక పనిముట్టుగా నాటో ఉపయోగించుకుంటే సహించబోమని పుతిన్ చెబుతున్న తరుణంలో దీర్ఘకాలంగా ట్రంప్–పుతిన్ మధ్య కొనసాగుతున్న సానుకూల సంబంధాలు ఇప్పుడు యుద్ధ నివారణకు ఉపయోగపడే పరిస్థితి వచ్చింది. అటు పుతిన్ ద్వారా, ఇటు జెలెన్స్కీ ద్వారా వాణిజ్య ప్రయోజనాలనే ట్రంప్ ఆశిస్తున్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీతో తాజా సమావేశంలో ఆయనకు అపారమైన గౌరవ మర్యాదలు ఇచ్చి, ''భారీ టారిఫ్‌లు మీరు వేస్తే మేమూ వేస్తాం'' అని మోదీని ఆలింగనం చేసుకుని మరీ హెచ్చరించి పంపించడం ట్రంప్ ''మాగా'' ఆచరణాత్మక పథకంలో ఒక తాజా ఉదాహరణగా భావిస్తున్నారు. ఈ పరిస్థితులమధ్య జెలెన్స్కీ ముఖాముఖీ భాగస్వామ్యాన్ని చర్చల్లో పుతిన్ వ్యతిరేకిస్తున్నప్పటికీ చర్చల్లో జెలెన్స్కీ భాగస్వామ్యం వహిస్తారని శుక్రవారంనాటు ట్రంప్ తేల్చిచెప్పారు.

**చెర్నోబైల్ రియాక్టర్‌పై రష్యా డ్రోన్ దాడి**

రాత్రికి రాత్రే రష్యా 133 డ్రోన్లతో కీవ్‌పై దాడి చేసిందని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ప్రకటించారు. ఈ డ్రోన్లు చెర్నోబైల్ అణురియాక్టరును కూడా తాకాయి. ఐతే వీటివల్ల పెద్దగా విధ్వంసమేమీ జరగలేదన్నది ప్రాథమిక సమాచారం. భారీగా నష్టం చేకూర్చే శక్తిమంతమైన డ్రోన్లను రష్యా ప్రయోగించిందని ఆయన చెప్పారు. ఈ డ్రోన్ దాడి వల్ల చెర్నోబైల్ ప్రాంతంలో రేడియేషన్ లెవెల్స్‌లో ఎలాంటి పెరుగుదలా సంభవించలేదని కూడా చెప్పారు. ఐతే రష్యా అధికారులు దీనిపై తక్షణ వ్యాఖ్యలు చేయలేదు. ఐక్యరాజ్యసమితి అణుసంస్థ కూడా దీనిపై స్పందించలేదు. రష్యా అధ్యక్షుడితో తాను సౌదీ అరేబియాలో చర్చలు జరుపుతానని ప్రకటించిన తర్వాత ఈ డ్రోన్ల దాడులు జరిగాయి.




# నాటో సభ్యత్వమే ఉక్రేన్‌కు పూర్తి భరోసా

## మ్యూనిచ్ భేటీకి ముందు జెలెన్స్కీ వ్యాఖ్య



**మ్యూనిచ్ :** నాటో సభ్యత్వం ఇవ్వాలనీ, నాటో సభ్యత్వం ఒక్కటే ఉక్రేన్‌కు పూర్తి భరోసా కలిగిస్తుందని ఆ దేశ అధ్యక్షుడు జెలెన్స్కీ అన్నారు. దక్షిణ జర్మనీ నగరం మ్యూనిచ్‌లో అమెరికా ఉపాధ్యక్షుడు జె. డి.వాన్స్–జెలెన్స్కీ మధ్య శుక్రవారం కీల క సమావేశానికి ముందుగా జెలెన్స్కీ పా త్రికేయులతో పైవిధంగా అన్నారు. సౌదీఅరేబియా రాజు సమక్షంలో త్వరలో పుతిన్–ట్రంప్ మధ్య ముఖాముఖీ చర్చ నేపథ్యంలో, 'ఉక్రేన్ భవిష్యత్తు'' అనేదే ప్రధానాంశంగా వాన్స్–జెలెన్స్కీ మధ్య మ్యూ నిచ్ భద్రతా సదస్సు ప్రారంభం అవుతుం ది. పుతిన్‌తో ఒక ఒప్పందం చేసుకునేందుకు సంబంధించి జెలెన్స్కీ ఆలోచనలను, డిమాండ్లను జె.డి.వా న్స్ ఈ సమావేశంలో తెలుసుకుంటారు. రష్యాపై సైనిక, ఆర్థిక అంక్షలు విధిస్తామని వాన్స్ చెబుతుండగా, ఉక్రేన్ తరపున చర్యల్లో ఒక్క జెలెన్స్కీ మాత్రమే ప్రాతినిధ్యం వహించగలుగుతారని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఒక ప్రకటనలో అన్నా రు. ఈ దశలో విశ్వసనీయమైన, స్థిరమైన కాల్పుల విరమణ ట్రంప్ చేయగలరా? అని ఆయన సందేహం వ్యక్తం చేశారు.

**మ్యూనిచ్‌లో కారు బీభత్సం**



తరుణంలో నగరానికి అక్రమ వలస వచ్చిన ఒక అఫ్ఘానిస్థాన్ యువకులు కారుతో బీభత్సం సృష్టించాడు. ఈ బీభత్సం కారణంగా 30 మంది గాయపడ్డారు. వివిధ రంగాలకు చెందిన ఉద్యోగ కార్మికులు వేతనాలు పెంచాలని కోరుతూ సమ్మె ప్రదర్శన చేస్తుండగా ఈ కారు వారిని ఢీ కొట్టింది. వెంటనే ఆ యువకుణ్ణి అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. మరోవైపు జర్మనీలో ఫెడరల్ ఎన్నికలు జరుగుతూ ఉండటంతో ఈ ఘటన ఎన్నికల అంశంగా మారింది. జర్మనీలోకి ఎలాంటి పత్రాలు లేకుండా అక్రమంగా ప్రవేశిస్తున్న విదేశీయులపట్ల అనుసరిస్తున్న విధానాన్ని పునఃసమీక్షించాలని ట్రంప్ తరహాలో చర్యలు తీసుకోవాలని ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీపార్టీ డిమాండ్ చేసింది. సిడియు పార్టీ కూడా ప్రతి జర్మన్ భద్రతంగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరింది.

# ఎఫ్‌బిఐ డైరెక్టర్ పదవికి గుజరాతీ అమెరిన్ కె.పటేల్



**వాషింగ్టన్ :** అమెరికా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బిఐ) డైరెక్టర్ పదవిలో నియమించేందుకు భారత గుజరాతీ సంతతికి చెందిన అమెరికా నివాసి కశ్యప్ పటేల్ (45) కు అనుకూలంగా సెనేట్ కమిటీ ఓటు వేసింది. సెనేట్ జ్యుడీషియరీ కమిటీలో 12 –10 మెజారిటీతో తీర్మానం ఆమోదం పొందింది. ఈ తీర్మానాన్ని జ్యుడీషియరీ కమిటీ సెనేట్‌కు పంపింది. ప్రస్తుత సెనేట్‌లో పూర్తిగా అధికార రిపబ్లికన్‌పార్టీ సభ్యులే అధికంగా ఉన్నారు. సెనేట్ బహుశా వచ్చేవారంలో కశ్యప్ పటేల్ నామినేషన్‌ను ధృవీకరించే అవకాశం ఉంది. ఆయన పూర్తిపేరు కశ్యప్ ప్రమోద్ వినోద్ పటేల్. అమెరికాలో న్యాయవాది. గతంలో ఫెడరల్ ప్రాసిక్యూటర్‌గా పనిచేశారు. కాన్స్పిరసీ థియరిస్ట్‌గా పనిచేశారు. నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యాలయంలో పనిచేశారు. నేషనల్ ఇంటిలిజెన్స్ డైరెక్టర్‌కు సీనియర్ అడ్వైజర్‌గా పనిచేస్తున్నారు. గడచిన నవంబరులోనే ట్రంప్ ఆయనను ఎఫ్‌బిఐ డైరెక్టర్ పదవికి నామినీగా ఎంపిక చేశారు.

## వాడుకోవద్దు

(మొదటి పేజీ తరువాయి)

పునరుద్ధరించుకోవడానికి దుస్సాహసంతో తీసుకున్న ప్రతిచర్యా విఫలమైనట్లు కనిపిస్తున్నది. పార్లమెంటు సమావేశాలను మార్చి 10వ తేదీ వరకూ వాయిదా వేసిన వెంటనే గురువారం సాయంత్రమే మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధిస్తూ తీసుకున్న నిర్ణయం పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపట్ల బిజెపికి ఉన్న అవిధేయత, అగౌరవం కళ్ళకు కట్టినట్టుగా చెబుతున్నది. వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైన మణిపూర్ వంటి అత్యంత సున్నితమైన రాష్ట్రంలోబిజెపి ప్రభుత్వ దుర్నిర్వహణ, నిర్వాకం, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షా జాతీయ భద్రత గురించి చేసిన శూన్యప్రకటనలను, వైఫల్యాన్ని బహిర్గతం చేసింది. వందలాదిమంది ప్రాణాలు కోల్పోయి, వేలాదిమంది నివాసాలు కోల్పోయిన తర్వాత దాదాపు రెండు సంవత్సరాలపాటు ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం ఎందుకు ఇలా ప్రవర్తించిందని సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం నిలదీసింది. బిజెపి ప్రభుత్వం ఇప్పటికైనా ఈ విషయంలో స్వచ్ఛంగా వ్యవహరించాలని, ఈ సమస్యతో ముడిపడిన అందరితో కలిసి సమష్టిగా కృషిచేసి పరిష్కారం సాధించడానికి, న్యాయబద్ధమైన పద్ధతులలో శాంతిని ప్రోత్సహించి, మణిపూర్‌లో సయోధ్య సాధించడానికి ఇదే సరైన తరుణమని సిపిఐ పేర్కొంది. ఈ సంక్షోభానికి గల మూలకారణాన్ని పరిష్కరించేందుకు బిజెపి ప్రభుత్వం ప్రతిపక్షాలను పరిగణనలోకి తీసుకుని వారితో కలిసి పనిచేయాలని కోరింది.

**రాష్ట్రపతి పాలన పరిష్కారం కాదు సిపిఐ(ఎం) విమర్శ**

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించడం సమస్యకు పరిష్కారం కాదని సిపిఐ(ఎం) విమర్శించింది. కల్లోలిత మణిపూర్ సంక్షోభ పరిష్కారంలో బిజెపి డబుల్ ఇంజిన్ ప్రభుత్వం పూర్తిగా దివాళాతీసి చేతులు ఎత్తేసిందన్న విషయం దీనితో స్పష్టంగా తేటతెల్లమైందని విమర్శించింది. అధికార కూటమిలో ఉన్న అంతర్గత విభేదాలను పరిష్కరించుకోవడానికి ఒక అవకాశంగా ఈ చర్య తీసుకున్నారని విమర్శించింది. మణిపూర్‌లో సాధారణ పరిస్థితులను పునరుద్ధరించడంకోసం అన్ని రాజకీయ పార్టీలను పరిగణనలోకి తీసుకోవాలని, ఈ సమస్యలో వారందరినీ భాగస్వామ్యం చేయాలని డిమాండ్ చేసింది. ఈ విషయంలో ముఖ్యమంత్రి ఎన్.బైరెన్‌సింగే ప్రధాన నేరస్థుడని తప్పుపట్టింది. ఆయనకు ఆర్‌ఎస్‌ఎస్,బిజెపిలు వెనక వత్తాసు పలికాయనీ, మణిపూర్‌లో ఆయన వహించిన పక్షపాత ధోరణికి సంబంధించిన సాక్ష్యాలను పరిశీలించిన న్యాయస్థానం దృష్టిలో ఆయన పాత్ర బయటపడుతుందన్న ఉద్దేశంతో, ఇక మరోమార్గం లేకపోవడంతో రాజీనామా చేయాలని ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలు బైరెన్‌సింగ్‌పై ఒత్తిడి చేశాయని విమర్శించింది.

## ఉద్యమంపై పుస్తకాలు

(మొదటి పేజీ తరువాయి)

డాక్టర్ కె.లక్ష్మ ణ్, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ అనేక మంది అమరుల త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ చరిత్ర అంటే ఒక వ్యక్తి,కుటుంబం, ఒక రాజకీయ పార్టీ నే తెలంగాణ చరిత్ర అని రాసుకునే ప్రయత్నం చేయగా, విజయ తెలంగాణ గ్రంథం రచయిత దేవేందర్‌గౌడ్ తెలంగాణ ఉద్యమ చరిత్ర ను ప్రజల కోణంలో పొందుపర్చారని సిఎం ప్రశంసించారు. వ్యక్తిగతంగా తాను చాలా అభిమానించే నాయకుల్లో దేవేందర్ గౌడ్ అగ్రస్థానంలో ఉంటారని సిఎం పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నాడు టిడిపిలోతా పార్టీ అగ్ర నాయకుడి తర్వాత సరిసమానంగా చలామణి అయిన దేవేందర్ గౌడ్ తెలంగాణ కోసం ఆ నాడు తీసుకున్న నిర్ణయం సాహసోపేతమైందని అన్నారు. గోదావరి జలాలతోనే తెలంగాణ సస్యశ్యామలం అవుతుందని దేవేందర్ గౌడ్ ఆ నాడు చేసిన పాదయాత్ర వల్ల నే ఆ నాటి పాలకులు చేవెళ్లప్రాణహిత ప్రాజెక్టు ను చేపట్టారని సిఎం గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమంలో దేవేందర్ గౌడ్ మొట్ట మొదటి సారిగా టిజి అని గోడలపై రాయించగా, ఈ అక్షరాలను యువకులు తమ బండ్లపైనే కాకుండ తమ గుండెలపై కూడా రాసుకున్నారు. అందుకే ఎన్నో త్యాగాలతో ఆవిర్భవించిన తెలంగాణలో ప్రజల ఆకాంక్ష మేరకుమా ప్రభుత్వం రాగానే టీఎస్ ను టీజీ గా మార్చడంతో పాటు 10 ఏళ్ల పాటు నివ్వురుగప్పిన నిప్పులా ఉన్న ..జయ జయహే తెలంగాణ పాట ను రాష్ట్ర అధికారిక గీతంగాతీసుకువచ్చామని తెలిపారు. ఇవన్నీ రేవంత్‌రెడ్డి ఆలోచనలు కావని, తెలంగాణ ఉద్యమంలో సర్వం త్యాగం చేసిన ప్రజల ఆలోచనలని పేర్కొన్నారు. అందుకే 9 మంది ఉద్యమకారులకు ఇంటి స్థలం, కోటి రూపాయలు ప్రకటించామని తెలిపారు. నేడు రాజకీయాల భ్రష్టు పట్టిపోయ్యాయని, చట్టసభలల్లో వ్యక్తిగత దూషణలకే పరిమితమయ్యాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం నెలకొన్న పోటీలో నిలబడి గెలువాలంటే తనకు ఇష్టం లేకపోయినా, తాను అదే దారిలో నడవాల్సిన పరిస్థితి అని వార్యమైందని తెలిపారు. దేవేందర్‌గౌడ్ లాంటి వారు క్రియాశీలక రాజకీయాల్లో లేకపోవడం తెలంగాణకు తీరని నష్టమన్నారు. ఇప్పటికైనా తెలంగాణ రాజకీయాల్లో విలువలతో కూడిన నాయకులు రావాలని సిఎం ఆకాంక్షించారు. పుస్తక రచయిత దేవేందర్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు ఏది ఉచితంగా రాలేదని, అన్ని పోరాడి సాధించుకున్నవే అని అన్నారు. తాను రాసిన విజయ తెలంగాణ గ్రంథంలోని ప్రతి అక్షరం తెలంగాణలో జరిగిన చరిత్రే అని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ దేవేందర్ గౌడ్ రచించిన విజయ తెలంగాణ పుస్తకం భవిష్యత్ తరాలకు ఎంతగానో ఉపయోగపడనుందన్నారు. ఎంపి లక్ష్మ ణ్ మాట్లాడుతూ తెలంగాణ సాధనలో సూష్మాస్వరాజ్ పాత్ర మరవలేనిదని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిలు వి.హనుమంతరావు, మధుయాష్కీ గౌడ్, ఎంఎల్ఎ గడ్డం వివేక్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.3.56 లక్షలు

(మొదటి పేజీ తరువాయి)

అందించాలని కోరారు. వ్యవసాయ రంగానికి రుణ సహాయం, రైతు ఉత్పత్తిదారుల సంస్థలను బలోపేతం చేయడం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని డిప్యూటి సిఎం ఆదేశించారు. నాబార్డ్ సహకారంతో రాష్ట్రంలో భూగర్భ జలాలు పెరిగి రైతులు అనేక పంటలు పండించే స్థాయికి చేరుకున్నారని, నీటి కొరత ఉన్న జిల్లాలను గుర్తించి నాబార్డ్ తన సహకారాన్ని మరింత విస్తరించాలని కోరారు. నీటిని ఆదా చేసే డ్రిప్పు, స్ప్రింక్లర్ల ద్వారా సాగు చేయడంతో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చే అవకాశం ఉందన్నారు.గ్రీన్ పవర్ ఉత్పత్తికి సహకారం అందించి సుస్థిరమైన అభివృద్ధి సాధనకు నాబార్డ్ ముందుకు రావాలని సూచించారు. రాష్ట్రంలో 29 లక్షల వ్యవసాయ పంపు సెట్లు ప్రస్తుతం ఉచిత విద్యుత్తు పథకం ద్వారా కొనసాగుతున్నాయని, వీటిని క్రమంగా సోలార్ పంపుసెట్లు గా మార్చేందుకు ప్రయత్నం చేయాలని కోరారు. స్వయం సహాయక సంఘాల ద్వారా 1000 మెగావట్ల సోలార్ పవర్ ఉత్పత్తికి ఇంధన శాఖ అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిపారు.

**వ్యవసాయరంగ అభివృద్ధికి బ్యాంకర్లు సహకరించాలి : మంత్రి తుమ్మల**

మంత్రి తుమ్మల నాగేశ్వరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని వ్యవసాయ రంగ అభివృద్ధికి బ్యాంకర్లు మరింత సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు విరివిగా రుణాలు అందించాల్సిన అవసరాన్ని బ్యాంకర్ల దృష్టికి తీసుకెళ్లారు. పశుపోషణ, మత్స్యపరిశ్రమ, కృషి ఆధారిత పరిశ్రమలు వంటి రంగాల్లో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఏర్పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు.రైతుల ఆదాయాన్ని పెంచడం, పోషకాహార భద్రతను మెరుగుపర్చడం కోసం చిరుధాన్యాల సాగు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని మంత్రి తుమ్మల అన్నారు.

## కాలువకు గండి

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం ఇటీవల నీటిని విడుదల చేసింది. ఈ క్రమంలో బలవంతపూర్, చెల్లాపూర్, మల్లయ్యపల్లి, కమ్మర్ పల్లి, పోతారం, అచ్చుమాయపల్లి, గంభీర్ పూర్ గ్రామాల మీదుగా కాలువ ద్వారా సాగునీరు అందుతుంది. కాలువను కొంతమంది దుండగులు కావాలనే ధ్వంసం చేశారని ఆయా గ్రామాలకు రైతులు ఆరోపిస్తున్నారు. మరికొంతమంది రైతులు మాత్రం బలహీనమైన ఆనకట్ట, నీటి ప్రవాహం తాకిడికి కాలువ కొట్టుకుపోయిందని వాదిస్తున్నారు. ఈ విషయమై నీటిపారుదల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపడతామన్నారు. గోదావరి నీళ్లు ఉధృతంగా ప్రవహించడంతో దుబ్బాక మల్లయ్యపల్లి గ్రామాల మీద మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. రాకపోకలను మళ్లించడానికి స్థానిక పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

## శాశ్వత నష్టం

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నారని హెచ్చరించారు. కొన్ని సంఘాలు, కొందరు నాయకులు తన వద్దకు వచ్చి లెక్కల్లో కొన్ని సవరణలు చేయాలని కోరారని, తాము నిజంగానే సరి చేయాలనుకున్నామని, అందుకే జనవజీవన స్రవంతిలో కలవని వాళ్ళ కోసం రెండవ విడత కూడా మళ్ళీ అవకాశం ఇచ్చామని, ఇది తమ ప్రభుత్వ చిత్తశుద్ధి అని అన్నారు. జీవింతలో బిసిల లెక్కలు తేలకుండా కెసిఆర్ కుట్ర చేస్తున్నారని, ఇది అర్థం చేసుకోకుండా కొందరు ఆయనకు కుట్రకు సహకరిస్తున్నారని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో 75 ఏళ్ల తర్వాత కులగణన చేపట్టి పక్కాగ లెక్కలు తీస్తే, ఈ లెక్కలను కూడా తప్పు అని చెబితే, మళ్లీ మొదటికి వస్తుందని, ఇక బిసిల లెక్కలు శాశ్వతంగా బయటకు రావని సిఎం స్పష్టం చేశారు. కెసిఆర్ చెట్లమీద ఇస్తరాకులు కుట్టినట్టుగా ఆయన కాకి లెక్కలు కట్టారని, దీనినే ఖురాన్, బైబిల్,భగవద్గీత అని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. కాకి లెక్కల కెసిఆర్ చేసిన సమగ్ర కుటుంబ సర్వేలో ఎస్‌సి,ఎస్‌సి ఉపకులాల సంఖ్య 82 అని తేల్చారని, దీనికి సంబంధించిన డాక్యుమెంట్స్ కూడా ఉన్నాయని తెలిపారు. గతం నుంచి ఎస్‌సిఎసి ఉప కులాల సంఖ్య 59 అని, అలాంటప్పుడు మిగిలిన కులాలు ఎక్కడి నుంచి వచ్చాయో కెసిఆర్ సమాధానం చెప్పాలని సిఎం డిమాండ్ చేశారు. ఇలాంటి లెక్కలను ఆధారంగా చూపుతూ ప్రస్తుతం చేపట్టిన కులగణణ సర్వే లెక్కలకు పొంతన లేదని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం చేపట్టిన కులగణణ సర్వేను సిఎం వివరించారు. ప్రభుత్వంపైన ఆరోపణలు చేయాలని, చేపట్టిన ప్రక్రియలో లేని అపోహాలను సృష్టించి, తప్పుల తడక అనే అభిప్రాయాన్ని కలిపించేందుకు శత విధాలా ప్రయత్నిస్తున్నారని సిఎం ఆరోపించారు. నిజం నిప్పులాంటిదని ఆ నిజాన్ని ఓళ్లో, జేబులో పెట్టుకున్నా వారికే కాలుతుందన్నారు. సాంకేతికంగా, న్యాయపరంగా, బిహార్,కర్నాటక రాష్ట్రాలలో విఫలమైన విషయాలను కూడా తాము పరిగణలోకి తీసుకున్నామని, అన్ని అంశాలను పరిశీలించిన తర్వాతనే కులగణన చేపట్టామని వివరించారు. మైనార్టీల లెక్కలు లేవని కొందరు చెబుతున్నారని,మైనార్టీల లెక్కలు తియకపత్తదని, బిసి ఇ గ్రూప్ ఈ వర్గాలకు నాలుగు శాతం రిజర్వేషన్ ఉన్నదని తెలిపారు .

**సర్వేలోపాల్గొనకుంటే కెసిఆర్ కుటుంబానికి సామాజిక బహిష్కరణే శిక్షణ :** కులగణన సర్వేలో పాల్గొనేలా కెసిఆర్,కెటిఆర్, హరీశ్‌రావు ఇంటి ముందు మేలుకొలుపు దప్పుకొట్టాలని, వారు సర్వేలో పాల్గొనకుంటే వారికి సామాజిక బహిష్కరణ శిక్ష విధించాలని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. సమగ్ర కుటుంబ సర్వేతో పాటు ప్రస్తుతం చేపట్టిన కులగణన లెక్కల్లో కెసిఆర్, ఆయన కుమారుడు కెటిఆర్ పాల్గొంటే, దీనికి సంబంధించిన లెక్కల గురించి మాట్లాడే అధికారం ఉంటుందన్నారు. సర్వేలో పాల్గొనకపోవడంతో కెసిఆర్‌కు తెలంగాణ సమాజంలో జీవించే హక్కే లేదన్నారు. కులగణన సర్వేలో లెక్కలు చెప్పని సుమారు 16 లక్షల మంది జనాభా జనజీవన స్రవంతిలో లేరని, ఇందులో కొందరు వివిధ కారణాలతో పాల్గొనలేదని, కానీ కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావు, పోచంపల్లి మాత్రం ఉద్దేశపూర్వంగా పాల్గొనలేదన్నారు. బిసిల లెక్కలు బయటికి వస్తే గత మంత్రివర్గంలో కెసిఆర్ కుటుంబం, ఆ సామాజికవర్గం అనుభవించిన పదవులపైన బిసిలు నిలదీస్తారని, అందుకే లెక్క తేలకుండా వారు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. బిసిల లెక్కలు తేల్చకుండా, గందరగోళం చేసి, ఆ లెక్కలను గంగలో కలుపాలని కెసిఆర్ కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. తప్పుల లెక్కల్లో కెసిఆర్ మాయ,మార్పం ఉన్నదని , ఈ లెక్కలు తేలితే కెసిఆర్ కుటుంబానికి ఏమీ ఇవ్వడానికి ఉండబోదని, కనీసం వార్డ్ మెంబర్ కూడా రాదని సిఎం చెప్పారు.

**మోదీ లిగలీ కన్వర్టర్ బిసి :** బిసి లీగలీ కన్వర్టర్ బిసి అని,ఆయన పుట్టకతోనే ఉన్నత సామాజికవర్గానికి చెందినవారని సిఎంరేవంత్ రెడ్డి ఆరోపించారు. గుజరాత్ సిఎం అయిన తర్వాత మోదీ తన కులాన్ని బిసి సామాజికవర్గంలో చట్టప్రకారం విలీనం చేశారని వివరించారు. ఆయనది బిసిల వ్యతిరేక మనస్తత్వం అని అన్నారు. జనాభా లెక్కలలో కులగణన లెక్కలు తేల్చాలని, అప్పుడు తాము చేసిన లెక్కలతో పొల్చిచూపాలని డిమాండ్ చేశారు.

**అన్నింటికి సిద్ధపడే పక్కా లెక్కలు తీశాం:** 'అప్పుడప్పుడు ఒకాయన అంటారని..ఇయన(సిఎం రేవంత్‌రెడ్డి) ఆఖరి..ఇయనే చివరిఅని సిఎం ' అని అం టారని సిఎం ర రేవంత్ రెడ్డి తెలిపారు. తాను ఎటువంటి త్యాగానికైనా సిద్ధమపడే లెక్కలు పక్కాగా తేల్చానని అన్నారు. తాను చివరి సిఎం అయినా పర్వాలేదని, తమ నాయకుడు ఇచ్చిన మాటను నిలబెట్టాలని,ఒక క్రమశిక్షణ గల నాయకునిగా బాధ్యత తీసుకున్నానని, ఇది ని బద్ధత అని అన్నారు. కులగణన లెక్కలు తన కోసం, తన పదవి కోసం లెక్కలు తీయలేదని తెలిపారు. లెక్కలల్లో తప్పుగా తీయాలంటే ఐదు శాతంలోపు తమ వారిని ఎం దుకు చూపిస్తామని, 15 నుంచి 20 శాతం లెక్కలు చూ పించే వాడిని కదా? అని అన్నారు. దొంగ లెక్కలు రాయదల్చుకుంటే ఇలా ఎందుకు రాస్తామని చెప్పారు. ప్రతి మనిషికి పక్కాగా లెక్కలను స్వీకరించామన్నారు. కాంగ్రె స్ నిర్ణయాన్ని, చిత్తశుద్ధి తప్పుదోవ పట్టించి, బిసిలకు శాశ్వితంగా అన్యాయం చేయాలని చూస్తున్నారన్నారు.

## టారిఫ్‌పై తగ్గని ట్రంప్

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతంలో స్థిరత్వ సాధనకు ఇరుదేశాల సైన్యాలను మోహరించేందుకు ప్రతినబూనారు. రవాణా కార్యకలాపాలను, గూఢచర్యకార్యకలాపాలను సంయుక్తంగా మరింతగా పెంచాలని వారు నిర్ణయించారు. అదనంగా మరో ఆరు పి–81 దీర్ఘశ్రేణి సముద్రగస్తీ, జలాంతర్గామి విధ్వంసకాలను సేకరించేందుకు అమెరికాకు ప్రతిపాదన చేసింది. యుద్ధ వాహనాలు, శకట విధ్వంసక గైడెడ్ క్షిపణులు, స్ట్రైకర్లను సహభాగస్వామ్యంలో ఉత్పత్తికి అంగీకరించాయి. చైనా నుండి ప్రమాదం పెరుగుతున్న నేపథ్యంలో భారత్–అమెరికా రక్షణరంగ సంబంధాలను వృద్ధిచేసుకునే దీర్ఘకాలిక ఆలోచనలు ఈ సమావేశంలో పెద్ద ముందడుగు వేశాయి. అదేవిధంగా భారత్‌లో అమెరికా విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లను ప్రారంభించేందుకు మోదీ ఆహ్వానం పలికారు. ఉన్నతవిద్యారంగ సంస్థల్లో సహభాగస్వామ్యం పటిష్టం చేసుకునేందుకు నాయకులు ఇద్దరూ అంగీకరించారు. అమెరికాలో మూడు లక్షలమంది భారత విద్యార్థులు చదువుకుంటున్న విషయం ఈ సందర్భంగా గమనార్హం.

**ధృతరాష్ట్ర కౌగిలి : టారిఫ్ దెబ్బ** వైట్‌హౌస్ ఎదురుగానే ఉన్న అత్యంత విలాసవంతమైన బ్లెయిర్ అతిథిగృహంలో వసతి ఏర్పాటు చేసి నరేంద్రమోదీకి గొప్ప గౌరవం కల్పించిన ట్రంప్ ఆయనకు ఎదురేగి ఆలింగనం చేసుకుని ఆహ్వానం పలికారు. చర్చల్లో మాత్రం ప్రపంచంలో అన్ని దేశాలకంటే చాలా ఎక్కువగా తమ దిగుమతులపై టారిఫ్‌లు వసూలు చేస్తున్న దేశం భారత్ మాత్రమేనని నిర్మొహమాటంగా చెప్పారు. భారతదేశం ఎంతమేరకు టారిఫ్‌లు విధిస్తే అంతమేరకు ఆ స్థాయిలోనే తమ దేశం కూడా భారత్ చేసే ఎగుమతులపై టారిఫ్‌లు వసూలు చేస్తామని ట్రంప్ కుండబద్దలు కొట్టినట్లు స్పష్టం చేశారు. ఐతే ఇటీవల స్టీలు, ఉక్కులపై ట్రంప్ అమలులోకి తెచ్చిన 25 శాతం సుంకాలు భారత్‌పై పెద్దగా ప్రభావం చూపించబోవని ఇప్పటికే భారత్ నుండి ఒక అధికారిక ప్రకటన వెలువడింది. ఐతే ఈ ద్వైపాక్షిక చర్చల్లో పరస్పర టారిఫ్‌ల విధింపు వైఖరిని ట్రంప్ ముందుకు తెచ్చారు. అదేవిధంగా బ్రిక్స్ దేశాలు గనుక అమెరికా డాలరుకు బదులుగా మరేదైనా కరెన్సీనీ ప్రత్యామ్నాయంగా ఎంచుకుంటే గనుక వాటిపై 100కు 100 శాతం సుంకాలను పెంచుతామని ట్రంప్ పునరుద్ఘాటించారు.

**మాగా + మిగా = మెగా:** రెండు అతిపెద్ద ప్రజాస్వామ్యదేశాలైన భారత్ –అమెరికా రెండూ కలిసి భారీస్థాయి భాగస్వామ్యం ద్వారా సౌభాగ్యం, సంపదను సృష్టించగలమని మోదీ అన్నారు. ''డోనాల్డ్ ట్రంప్ ఎప్పుడూ ''మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ (మాగా)'' అని నినదిస్తూ ఉంటారు. మేం కూడా ఎప్పుడూ ''వికసిత్ భారత్'' నినాదంతో ఆ దిశగా కృషి చేస్తూ ఉంటాం. ట్రంప్ చెప్పే అమెరికా సందర్భ నినాదాన్ని భారతీయ భాషలోకి అనువదిస్తే ''మేక్ ఇండియా గ్రేట్ ఎగైన్ (మిగా)'' అవుతుంది. ఈ రెండు దేశాలు ఈ రెండు నినాదాలతో అతిపెద్ద వాణిజ్యభాగస్వామ్యం ద్వారా బ్రహ్మాండమైన సౌభాగ్యాన్ని, సమృద్ధిని సృష్టించవచ్చు'' మాగా+మిగా= మెగా అని నరేంద్రమోదీ అన్నారు.ట్రంప్ ''మాగా'' గురించి మాట్లాడుతున్నట్టే భారతీయులు కూడా తమ వారసత్వ సంస్కృతి అభివృద్ధిపై కూడా దృష్టిపెట్టి ముందుకు వెళతారు, 2047 వ సంవత్సరంలో భారతదేశ స్వాతంత్ర్య స్వర్ణోత్సవాల నాటికి ''వికసిత్ భారత్'' లక్ష్యాన్ని చేరుకునే దిశగా శరవేగంగా భారతీయులు పురోగమిస్తున్నారు'' అని మోదీ చెప్పారు.

**ఐదేళ్ళలో వాణిజ్యలక్ష్యం 500 బిలియన్ డాలర్లు :** భారత్–అమెరికాలమధ్య 2030వ సంవత్సరం నాటికి వాణిజ్యభాగస్వామ్యం భారీస్థాయిలో రెట్టింపు చేయాలని ట్రంప్–మోదీ సమావేశ నిర్ణయించారు. రాబోయే ఐదు సంవత్సరాలలో రెండు దేశాలమధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 500 బిలియన్ డాలర్లుకు వృద్ధి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఉమ్మడి అభివృద్ధి, ఉమ్మడి ఉత్పత్తి, సాంకేతికత బదిలీ కృషిద్వారా ఈ లక్ష్యాన్ని చేరుకోవాలని నాయకులిద్దరూ అభిప్రాయపడ్డారు. భారత్–అమెరికా పరస్పర ప్రయోజనాలను నెరవేర్చేవిధంగా, ఈ ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేసేందుకు వీలుగా అతి త్వరలోనే మా బృందం ఈ ఒప్పందాన్ని ఖరారు చేస్తుందని మోదీ చెప్పారు. అమెరికాతో ప్రపంచవ్యాప్తంగా ''మెగా పార్ట్‌నర్‌షిప్''ను మోదీ ప్రముఖంగా ముందుకు తెచ్చారు. వాణిజ్య సంబంధాలు,సుంకాలు, అంతర్జాతీయ నిందితులను స్వదేశాలకు రప్పించేందుకు ఇచ్చిపుచ్చుకోవడం, ముఖ్యంగా 2008లో ముంబయిపై జరిగిన ఉగ్రవాద దాడిలో ప్రధాన నేరస్థుడైన తహవ్వుర్ రాణాను అమెరికా నుండి భారత్‌కు తరలించే విషయంపై ట్రంప్–మోదీ చర్చించారు.

**ఇంధనరంగంలో ఇక భారీ కొనుగోళ్ళు:** ద్వైపాక్షిక సంబంధాల్లో భారత్ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కొరతలు తీర్చుకునేవిధంగా ఇంధనరంగంలో అమెరికాతో జరిగిన ద్వైపాక్షిక చర్చలు పెద్ద పురోగతి సాధించాయి. సమీప భవిష్యత్తులో మనదేశం దాదాపు 25 బిలియన్ డాలర్ల మేరకు ఇంధనాన్ని అమెరికా నుండి కొనుగోలు చేస్తుంది. ఇంధనరంగంలో భారతదేశానికి అమెరికాయే రాబోయేకాలంలో అతిపెద్ద ఎగుమతిదారుగా ఉంటుందని ట్రంప్ సంయుక్త పత్రికాగోష్ఠిలో చెప్పారు. గత ఏడాది భఋరత్ 15 బిలియన్ డాలర్లు మేరకు అమెరికా ఇంధన ఉత్పత్తులను కొనుగోలు చేసింది. ఇక భవిష్యత్తులో ఈ కొనుగోళ్ళను 25 బిలియన్ డాలర్లకంటే ఎక్కువస్థాయికి పెంచేందుకు ఇదే ఒక మంచి అవకాశమని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఇంధన కొనుగోళ్ళు కూడా ద్వైపాక్షిక వాణిజ్యరంగంలో భారీవృద్ధికి దారితీస్తుందని తెలిపింది. ఈ భారీ కొనుగోళ్ళ ద్వారా ద్వైపాక్షిక వాణిజ్యంలో ఉన్న అంతరాన్ని తగ్గించడానికి వీలు కలుగుతుందనీ, ఇంధన వాణిజ్యం భారీగా విస్తరిస్తుందని మంత్రిత్వశాఖ పేర్కొంది.

**చైనా సరిహద్దు సమస్యపై మధ్యవర్తిత్వం చేస్తా:** భారత్–చైనా సరిహద్దుల్లో ఏర్పడిన వివాద పరిష్కారానికి మధ్యవర్తిత్వం వహించడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుముఖత వ్యక్తం చేశారు. గతంలో రెండు దేశాలమధ్య జరిగిన ఆయుధేతర యుద్ధంలో ఇరువైపులా పలువురు మరణించిన సందర్భంలో కూడా అమెరికా ఇదేవిధంగా మధ్యవర్తిత్వం చేస్తామంటూ ముందుకు వచ్చింది. ఐతే మూడోవ్యక్తి జోక్యం లేకుండా సమస్యలు పరిష్కరించుకోవాలన్న వైఖరినే భారతదేశం మొదటినుండీ అనుసరిస్తూ వస్తోంది. భారత్ సమస్యను చూశాను, సరిహద్దుల్లో జరిగిన కలహాన్ని చూశాను, ఇది చాలా దౌర్జన్యం, వాళ్ళు అదేపనిగా దాన్ని కొనసాగిస్తున్నారని ఊహిస్తున్నా, నేను సహాయం చేయగలిగితే ఎంతో ప్రేమతో నేను ఈ విషయంలో సహాయం చేస్తాను, ఎందుకంటే దానిని అపాల్సిన అవసరం ఉంది'' అని ట్రంప్ అన్నారు.

**భారత్ శాంతిపక్షం రష్యా–ఉక్రేన్‌పై మోదీ స్పందన:** యుద్ధాలద్వారా సమస్యలు పరిష్కారం కాబోవని మోదీ భారత్ వైఖరిని పునరుద్ఘాటించారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారిన పుతిన్–ట్రంప్ రాబోయే చర్చలు, ఉక్రేన్ యుద్ధపరిష్కార చర్యలపై అడిగిన ప్రశ్నలకు మోదీ సమాధానం చెప్పారు. భారత్ ఎప్పుడూ శాంతి పక్షమే వహిస్తుందని అన్నారు. యుద్ధరంగంలో సమస్యలు పరిష్కారం కాబోవనీ, చర్చల ద్వారానే సమస్యలన్నీ పరిష్కారం అవుతాయనీ అన్నారు. అటు ఉక్రేన్, ఇటు రష్యా రెండు దేశాలూ భారత్‌కు మిత్రులేనని, ఈ విషయంలో భారత్ ఎక్కడైనాగానీ శాంతి పక్షమే వహిస్తుందని పూర్వవైఖరిని మోదీ పునరుద్ఘాటించారు.

**అదానీపై జవాబు దాటవేసిన మోదీ :** ట్రంప్‌తో సమావేశం అనంతరం అమెరికా ప్రెస్‌తో మాట్లాడిన మోదీ భారత వ్యాపారవేత్త గౌతమ్ అదానీ అవినీతి కేసుపై అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పకుండా దాటవేశారు. గౌతమ్ అదానీ విషయం కూడా నాయకులిద్దరి చర్చల్లో చోటుచేసుకుందా? అని పాత్రికేయులు ప్రశ్నించగా, రెండు దేశాలకు చెందిన ఇద్దరు ప్రముఖ నాయకులు, వ్యక్తులకు సంబంధించిన సమస్యలపై ఎన్నటికీ చర్చింబోరని మోదీ అన్నారు. ''భారత్ ఒక ప్రజాస్వామ్యదేశం, 'వసుధైవ కుటుంబకం' అనేదే మా సంస్కృతి, ఈ యావత్ ప్రపంచాన్నీ మేం ఒకే కుటుంబంగా పరిగణిస్తాం, 'ప్రతి భారతీయుడూ నావాడే' అని నేను నమ్ముతాను, రెండు ప్రముఖ దేశాలకు చెందిన ఇద్దరు ప్రముఖ నాయకులు ఎప్పుడూ అలాంటి వ్యక్తుల సమస్యల గురించి చర్చించరు'' అని మోదీ అన్నారు.

**మోదీకి ట్రంప్ బహుమతి:** వైట్‌హౌస్‌లో ట్రంప్‌ను కలిసి సందర్భంగా మోదీకి ఆయన ఒక పుస్తకాన్ని బహుమతిగా ఇచ్చారు. ''అవర్ జర్నీ టుగెదర్'' శీర్షికతో ఉన్న ఈ పుస్తకాన్ని మోదీకి ట్రంప్ అందరజేశారు. 'హౌదీ మోదీ', 'నమస్తే ట్రంప్' వంటి సంఘటనకు సంబంధించిన అనేక ఫొటోలను మోదీకి ట్రంప్ చూపించారు. ఈ ఫొటోలన్నీ ఈ పుస్తకంలోని పేజీలలోనే ఉన్నాయి. ట్రంప్ మొదటి విడత అమెరికా అధ్యక్షుడుగా ఉన్నప్పుడు కూడా మోదీ ప్రధానమంత్రిగా ఉన్నారు. వారిద్దరూ గతంలో కరోనాకు ముందు వేలాదిమంది ప్రజల సమక్షంలో భారీ సభలో కూడా పాల్గొన్నారు. భారత్–అమెరికా సంబంధాలను ఈ నాయకులిద్దరి నాయకత్వంలో సుదీర్ఘంగా కొనసాగిస్తున్న గొప్ప క్షణాలకు గుర్తుగా ''గ్రేట్'' అని ఒక సందేశాన్ని కూడా మోదీకి ట్రంప్ షేర్ చేశారు. ఇద్దరూ తమ కలయక సందర్భంగా ప్రేమపూర్వకంగా సుదీర్ఘ కరచాలనం చేసుకున్నారు. ఆలింగనాలు చేసుకున్నారు.



## స్పోర్ట్స్ యూనివర్శిటీ ఏర్పాటుకు సన్నాహాలు

### ముఖ్య అతిథి సిఎస్ శాంతికుమారి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ ప్రమాణాలతో స్పోర్ట్స్ యూనివర్శిటీ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి వెల్లడించారు.. చంచల్‌గూడలోని సీకా పరేడ్ మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహించిన తెలంగాణ జైళ్ల శాఖ 7వ రాష్ట్రస్థాయి 'ప్రిజన్స్ స్పోర్ట్స్‌మీట్ 2025' శుక్రవారం ముగింపు వేడుకలకు జైళ్లశాఖ డాక్టర్ డిజి సౌమ్యా మిశ్రాతో కలిసి శాంతికుమారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ తెలంగాణ జైళ్ల శాఖ చేపడుతున్న సంస్కరణలు దేశంలోనే అగ్రగామిగా నిలిచాయని అన్నారు. పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి అభినందనలు తెలియజేసి మెడల్స్ అందజేశారు. డిజి డాక్టర్ సౌమ్యమిశ్రా మాట్లాడుతూ త్వరలో ఆల్ ఇండియా ప్రిజన్స్ స్పోర్ట్స్ మీట్ తెలంగాణ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఐజిలు వై.రాజేష్, మురబాబు, డిఐజిలు డాక్టర్ శ్రీనివాస్ పంత్, జైలు సూపరింటెండెంట్ నవాబ్ గౌడ్, సీజు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వేడుకల్లో ముగింపు సందర్భంగా యంగా పేలుళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మొగింది కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ పోటీలలో 50 మంది పాల్గొనగా, అందులో 30 ముంది మహిళా జైలు సిబ్బంది పాల్గొన్నారు.

### యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాలను ..

# యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి

### ముఖ్యమంత్రి సమీక్ష



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టెండర్లు పూర్తయిన వెంటనే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వం భావించి చేపడుతున్న ఈ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. నిర్దేశించిన సమయంలో పూర్తిచేయాలని ఆయన స్పష్టం చేశారు. ఐసిసిసిలో విద్యా శాఖ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాలపై ముఖ్యమంత్రి అధికారులను ఆరా తీశారు. కొడంగల్, మధిర, హుజూర్‌నగర్‌లలోని స్కూళ్ల నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయని, మార్చి 20వ తేదీన పనులు ప్రారంభిస్తామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. మిగతా నియోజకవర్గాల్లో భూ సేకరణ, అనుమతుల ప్రక్రియను ఉమ్మడి జిల్లాలకు కేటాయించి, సీనియర్ అధికారులు పర్యవేక్షించాలని సిఎం అన్నారు. 105 నియోజకవర్గాల్లో అన్ని రకాల మౌలిక వసతులతో వందశాతం పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాలకు రాకపోకలు అనువుగా ఉండే ప్రాంతాన్ని యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి ఎంచుకోవాలన్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్లు క్షేత్ర స్థాయి పర్యటనలు చేసి, స్థలాల ఎంపికలో జాగ్రత్త వహించాలన్నారు. భూ సేకరణ, స్థలాల ఎంపిక ప్రతి రెండు రోజులకొకసారి సమీక్షించాలన్నారు. ప్రతిపాదిత స్థలాలు రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు అనువుగా ఉన్నాయో లేదో పరిశీలించాలన్నారు. అనువైన స్థలం లేనిచోట ప్రత్యామ్నాయ స్థలాన్ని సేకరించాలని సూచించారు. 10 రోజుల్లోపే దీనిపై నివేదిక ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని సిఎం ఆదేశించారు. ఇప్పటికే స్థల సేకరణ పూర్తయిన నియోజకవర్గాల్లో యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించాలన్నారు.

**భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు చేపట్టాలి..**

వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయంలో బోధన, బోధనేతర అవసరాల కోసం చేపట్టే నిర్మాణాలు యూనివర్సిటీల స్థాయిలోనే ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఈ విషయంలో ఏమాత్రం రాజీ పడొద్దన్నారు.

భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని గదులు, ల్యాబ్‌లు, ప్లే గ్రౌండ్, ఇతర నిర్మాణాలు చేపట్టాలన్నారు. యూనివర్సిటీ నిర్మాణాలకు సంబంధించి నిధుల వ్యయానికి ప్రభుత్వం వెనుకాడదని సిఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. యూనివర్సిటీ ప్రాంగణంలోని చారిత్రక, పురాతన కట్టడాలను పరిరక్షించాలని సూచించారు. వాటికి అవసరమైన మరమ్మతుల విషయంలో పురావస్తు శాఖ అధికారులతో చర్చించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. నిర్మాణ ఆకృతులకు సంబంధించి పలు మార్పులను ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమీక్షలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాస రాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, ఎంఆర్‌డిసిఎల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పి.గౌతమి, పాఠశాల విద్యా శాఖ కమిషనర్ నరసింహారెడ్డి, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనంజయ్ పాల్గొన్నారు.



## హైదరాబాద్‌లో.. 'బయో ఏషియా-2025' సదస్సు

### కేంద్ర మంత్రితో మంత్రి శ్రీధర్‌బాబు భేటీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** లైఫ్ సైన్సెస్, ఫార్మా, హెల్త్ కేర్ రంగాలకు చెందిన ఇన్నోవేటర్స్, పాలసీ మేకర్స్, ఇండస్ట్రీ లీడర్స్‌ను హైదరాబాద్‌లో ఈనెల 25, 26 తేదీల్లో జరగబోయే 'బయో ఏషియా 2025' సదస్సు ద్వారా ఒకే వేదికపైకి తీసుకొస్తున్నామని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు రాష్ట్ర ఐటి మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన ఈ సదస్సుకు హాజరు కావాలని పీయూష్ గోయల్‌ను శ్రీధర్‌బాబు కోరారు. శుక్రవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేకంగా కలిసి ఆహ్వానించారు. సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందు కొచ్చే పారిశ్రామికవేత్తలకు అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించారు. పారిశ్రామికాభివృద్ధిలో ఇతర రాష్ట్రాలకంటే వేగంగా దూసుకెళ్తున్న తెలంగాణకు కేంద్రం అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

కరీంనగర్ జిల్లా రుక్మాపూర్, జనగాం జిల్లా స్టేషన్ ఘన్పూర్ మెగా లెదర్ పార్కులు, నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఐసిడిసి) జహీరాబాద్ నోడ్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రపంచస్థాయిలో తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేందుకు దోహదపడే ఓసాకా ఎక్స్‌పో 2025 సదస్సులో పాల్గొనేందుకు సంసిద్ధతను వ్యక్తం చేస్తూ అధికారికంగా లేఖను అందజేశారు. బయో ఏషియా సదస్సులో పాల్గొనేందుకు అంగీకరించిన కేంద్ర మంత్రిని మంత్రి శ్రీధర్‌బాబు సన్మానించారు.

## ఆదాయ, ఉపాధి వనరుగా 'టూరిజం'

### పర్యాటక శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ఘన చరిత్రను వర్తమానానికి అనుసంధానిస్తూ.. భవిష్యత్‌కు బాటలు వేసేలా పర్యాటక శాఖను తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. బంజారాహిల్స్‌లోని ఐసిసిసిలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి సిఎం పర్యాటక శాఖపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రానికి ఆదాయం సమకూర్చడమే కాకుండా ఎక్కడికక్కడ యువతకు ఉపాధి కల్పించే వనరుగా పర్యాటక శాఖ ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పర్యాటకులను ఆకర్షించే వనరులు మనకు ఎన్నో ఉన్నా, గతంలో ప్రచారంపైన శ్రద్ధ చూపకపోవడం.. వినూత్న పద్ధతిలో ఆలోచించకపోవడంతో ఈ రంగంలో ఆశించిన ప్రగతి కనిపించలేదన్నారు. సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి ప్రోత్సాహకాలు కల్పించాలని సిఎం తెలిపారు. నాగార్జునసాగర్ బ్యాక్ వాటర్‌లో బోట్ హౌస్ అందుబాటులో ఉంచాలని, డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు తెలంగాణను వేదికగా మార్చాలని సిఎం సూచించారు. ఆలయాలు, పులుల అభయారణ్యాలకు పర్యాటకంలో ప్రత్యేక ప్రాధాన్యం ఉందని... ఆ దిశగా దృష్టిసారించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీలు వి.శేషాద్రి, చంద్రశేఖర్‌రెడ్డి, సిఎం సంయుక్త కార్యదర్శి సంగీత సత్యనారాయణ, పర్యాటక శాఖ కార్యదర్శి స్మితాసబర్వాల్, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండి ప్రకాశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు జ్ఞాపకం ఉంచుకునేలా పనిచేయాలి



### ఆర్‌టిఎ (నాన్ అఫీషియల్) సభ్యుల సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాజకీయాల్లో ఏదైనా బాధ్యత వచ్చినప్పుడు ప్రజలు జ్ఞాపకం ఉంచుకునేలా పనిచేయాలని రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కొత్తగా నియామకమైన వారితో సచివాలయంలోని తన కార్యాలయంలో శుక్రవారం మంత్రి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నూతనంగా నియమితులైన ఆర్‌టిఎ (నాన్ ఆఫీసియల్) సభ్యులకు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం రవాణా శాఖ అమలు చేస్తున్న కార్యక్రమాలు ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాలు తదితర అంశాలను రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్ వివరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 24 మందికి ఆర్‌టిఎ సభ్యులుగా అధికారిక నియామక పత్రాలు వచ్చాయని, మిగిలిన వారికి కూడా త్వరలోనే అధికారిక ఉత్తర్వులు వస్తాయని తెలిపారు. జిల్లాల్లో స్థానిక నాయకత్వం సలహా సూచనల మేరకు నేరుగా మీ వద్దకే నియామక పత్రాలు వచ్చాయని ఆర్‌టిఎ సభ్యులకు మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. కొత్తగా నియామకమైన ఆర్‌టిఎ సభ్యులు రవాణా శాఖ గౌరవాన్ని, అభివృద్ధిని ప్రజల సౌకర్యార్థం రవాణా సేవల్లో వారికి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రవాణా శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని ప్రభుత్వ పాఠశాలల్లో చిల్డ్రన్ రోడ్ సేఫ్టీ అవగాహన పార్కులు ఏర్పాటు చేయాలని సూచించారు. 63 రవాణా శాఖ కార్యాలయాల్లో 31 కార్యాలయాలకు భవనాలు కట్టాల్సి ఉందని, 8 ప్రాంతాల్లో రవాణా శాఖ కార్యాలయాలకు స్థలాలు ఉన్నాయని ఇతర కార్యాలయాల్లో స్థలాల కోసం జిల్లా కలెక్టర్, స్థానిక శాసన సభ్యులతో సమన్వయం చేసుకుంటూ భూ కేటాయింపులు జరిపేలా చొరవ తీసుకోవాలన్నారు. వారానికి రెండు స్కూళ్లలో ట్రాఫిక్‌పై అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని మొదట ఆస్పత్రికి తీసుకెళ్లిన వారికి ఇచ్చే రూ.5వేల పారితోషికం వారికి అందేవిధంగా చొరవ తీసుకోవాలన్నారు. మంచి పేరు తెచ్చుకోవాలని, సంస్థకు, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో జెటిసిలు శివ లింగయ్య, చంద్రశేఖర్ గౌడ్, ఆర్‌టిఎ సభ్యులు పాల్గొన్నారు.

## లేబర్ 4 కోడ్లకు వ్యతిరేకంగా ఆర్‌ఎస్‌ఎస్, బిఎంఎస్ గళం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కార్మికవర్గం అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రలోని బిజెపి ప్రభుత్వం 2020లో 29 కార్మిక చట్టాలను సమూలంగా సవరించి 4 కోడ్లుగా తీసుకొచ్చి దేశంలో పనిచేస్తున్న సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులకు తీరని అన్యాయం చేస్తూ, కార్మికుల హక్కులను ఉక్కుపాదంతో కాలరాస్తున్న నేపథ్యంలో వాటికి వ్యతిరేకంగా ఆర్‌ఎస్‌ఎస్, బిఎంఎస్ న్యాయకత్వాలు స్పందించడం పట్ల ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర కార్మిక సంఘాలు దేశవ్యాపితంగా 4 కోడ్లను రద్దు చేసి యధావిధిగా 44 కార్మిక చట్టాలను అమలు చేయాలని ఇప్పటికే 27సార్లు దేశవ్యాపితంగా సార్వత్రిక సమ్మెలు చేసినా స్పందించని ఆర్‌ఎస్‌ఎస్, బిఎంఎస్‌లు రానున్న ఏప్రిల్ 1వ తేదీ నుంచి దేశవ్యాపితంగా 4 కోడ్లను అమలు చేసేందుకు సమాయత్తమవుతున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఎట్టకేలకు స్పందించడం అభినందనీయమన్నారు. రాజకీయాలకు అతీతంగా కార్మిక సంఘాలు కలిసికట్టుగా నిర్వహిస్తున్న ఉద్యమాల్లో భాగంగా మార్చి 18న దేశ రాజధానిలో అన్ని కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలతో జాతీయ సదస్సు జరగనుందని, బిఎంఎస్, ఆర్‌ఎస్ఎస్ చిత్తశుద్ధితో ఆ 4 కోడ్లను వ్యతిరేకిస్తే జాతీయ సదస్సులో పాల్గొని కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ఖండించాలని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 1 నుండి 4 కోడ్లను అమలు చేస్తే కోట్లాది మంది కార్మికులు కనీస కార్మిక చట్టాలు అమలుకాక నాటి బ్రిటీష్ ప్రభుత్వ హయాంలో పనిగంటలు పెంచి వేతనాలు తగ్గించి, పనిభద్రత లేకుండా చేసిన ప్రభుత్వానికి నేటి కేంద్ర ప్రభుత్వానికి ఏ మాత్రం తేడా ఉండదన్నారు. ఆర్‌ఎస్ఎస్ ఒక స్వచ్ఛంద సంస్థగా ఏ రాజకీయ పార్టీకి అనుబంధం కాకుండా అనేక స్వచ్ఛంద సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు చేస్తున్న సేవాభావం నేడు కోట్లాది మంది కార్మికులు రాజ్యాంగ పరిధిలో చట్టాలను అమలు చేసుకుంటూ, పనులు చేస్తున్న కార్మిక వర్గం మళ్ళీ బానిసలుగా మారే వ్యవస్థను ఆర్‌ఎస్‌ఎస్, బిఎంఎస్ కోరుకుంటుందా అని ఆయన ప్రశ్నించారు.

## బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లకు.. కేంద్రం వెంటనే చర్యలు చేపట్టాలి

### బిసి కమిషన్ చైర్మన్ జి. నిరంజన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లకు మోదీ ప్రభుత్వం చట్ట బద్ధత కల్పించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా చేస్తేనే కుల గణనకు చట్టబద్ధత లభిస్తుందన్నారు. జనాభా గణనతోనే కులగణనను కేంద్ర ప్రభుత్వం చేపట్టాలన్నారు. హైదరాబాద్ బిసి కమిషన్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిసి కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ రావు, జాయింట్ డైరెక్టర్ లక్ష్మీ నారాయణలతో కలిసి నిరంజన్ మాట్లాడారు. బిసి కమిషన్ 50 రోజుల పాటు జరిగిన బిసి కులగణనలో పాల్గొనని వారి సౌకర్యార్థం ఈనెల 16 నుంచి 28వ తేదీ వరకు కులగణన చేసుకోవడానికి అవకాశం ఇవ్వడాన్ని బిసి కమిషన్ స్వాగతిస్తుందన్నారు. అసెంబ్లీ బిల్లులు ప్రవేశపెట్టి, కేంద్రానికి పంపించాలనే నిర్ణయం కూడా హర్షనీయమన్నారు. జిహెచ్ఎంసి ఏరియాలో ఎక్కువ శాతం కుల గణన జరగలేదని అంటున్నారని, కావునా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.

**బిసి కమిషన్ క్షేత్ర స్థాయి పర్యటన..** ప్రజల అవగాహన కల్పించడానికి తమ వంతు బాధ్యతగా హైదరాబాద్ నగరంలో తక్కువ కుల గణన జరిగిన ప్రాంతాల్లో ఈనెల 16వ తేదీ నుంచి 28 వరకు ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు వేర్వేరు ప్రాంతాల్లో పర్యటించి, ప్రజల్లో అవగాహన కల్పించాలని నిర్ణయించామని తెలిపారు. ఆస్తిపన్ను చెల్లించే వినియోగదారుల సమాచారం జిహెచ్ఎంసి వద్ద ఉన్న 16 లక్షల టెలిఫోన్ నెంబర్‌ల ద్వారా కులగణనపై విస్తృత స్థాయిలో ప్రచారం కల్పించాలని చెప్పారు.

**స్థానిక సంస్థల ఎన్నికలలో బిసిలు 70 శాతానికి పైగా గెలిచే అవకాశం..**

గతంలో 2006, 2013, 2019 ఎన్నికలలో రిజర్వేషన్‌ల కేటాయింపులను కలిపి సర్పంచ్ స్థానాలకు 43.5 శాతం బిసిలు గెలిదారన్నారు. వార్డు సభ్యుల స్థానాలు 50.4 శాతం బిసిలు గెలిచారన్నారు. ఎంపిపి ప్రెసిడెంట్‌లు 43.4 శాతం, ఎంపిటిసిలు 46.7 శాతం, జెడ్‌పిటిసి సభ్యులు 39.2 శాతం గెలుపొందరన్నారు. మున్సిపాలిటీలో వార్డు సభ్యులుగా 59 శాతం, ఛైర్ పర్సన్స్‌గా 51 శాతం, మేయర్లుగా 31 శాతం, కార్పొరేటర్స్‌గా 57 శాతం బిసిలు గెలిచిన విషయాన్ని ఆయన వివరించారు. ఈ వివరాలు బట్టి చూస్తే 42 శాతం రిజర్వేషన్లు బిసిలకు అమలు చేస్తే రిజర్వేషన్ స్థానాలను కలిపి, బిసిలు 65 శాతం నుంచి 70 శాతం గెలిచే అవకాశం ఉంటుందన్నారు.

# ఇపిటిఆర్‌ఐని గాడిలో పెట్టాలి

### ఆకస్మిక తనిఖీలో అధికారులను ఆదేశించిన మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర పర్యావరణ పరిరక్షణ శిక్షణ సంస్థ (ఇపిటిఆర్ఐ)ని గాడిలో పెట్టాలని.. ఇందుకు కావల్సిన అవసరాలపై సమగ్ర నివేదిక అందజేయాలని పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఇపిటిఆర్ఐ డైరెక్టర్ జనరల్ అహమద్ నదీంను ఆదేశించారు. కొండా సురేఖ ఇపిటిఆర్‌ఐని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం కారణంగా ప్రపంచంలో గుర్తింపు తెచ్చుకునే ఈ సంస్థ సమస్యల నిలయంగా మారడంపై సురేఖ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సంస్థ ఉద్యోగస్తుల సమస్యలను అడిగి తెలుసుకొని తక్షణ పరిష్కార మార్గాలను అన్వేషించాలని సూచించారు. స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థకి ప్రభుత్వ సంస్థల ద్వారా ప్రైవేట్‌కి ఇచ్చే పనులని ఇపిటిఆర్ఐ కి నామినేషన్ పద్ధతిలో ఇవ్వడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సంస్థని ఆధునీకరించేందుకు ప్రభుత్వం నుండి కావాల్సిన నిధుల కోసం తగిన ప్రతిపాదనలను పంపించాల్సిందిగా మంత్రి సురేఖ స్పష్టం చేశారు. గ్రీన్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా శిక్షణ పొందిన నిరుద్యోగులకు ఈ సందర్భంగా సర్టిఫికెట్లను అందజేశారు. ఇపిటిఆర్ఐ ఏర్పడినప్పటి గత ముప్పయి సంవత్సరాల నుండి ఏ ఒక్కరు సంస్థని పట్టించుకునే వారు లేకుండే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా పాలనలో ఒక మంత్రి తమ సంస్థని తనిఖీ చేసి సమస్యలని అడిగి తేల్చుకొని తగిన పరిష్కారాలు చూపడాన్ని ఉద్యోగులు హర్షిస్తూ మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి సురేఖతో పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీం, పిసిసిఎఫ్ ఆర్ ఎం డోబ్రియల్, ఇపిటిఆర్ఐ సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ స్వరాజ్, డాక్టర్ జి రమేష్, సంస్థ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### అక్కంపల్లి రిజర్వాయర్‌లో..

# బర్డ్‌ఫ్లూతో చనిపోయిన కోళ్లు

*రిజర్వాయర్ ద్వారా జిల్లా, జంట నగరాలకు తాగునీరు

*విచారణకు ఆదేశించిన నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/పెద్దఅడిశర్లపల్లి :** రిజర్వాయర్ నుంచే నల్లగొండ జిల్లాలోని వందలాది గ్రామాలతో పాటు హైదరాబాద్ జంటనగరాలకు నిత్యం తాగునీరు సరఫరా అవుతున్న విషయం విదితమే. రిజర్వాయర్‌లో కోళ్ల కళేబరాలు ఉన్నాయని సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం కావడంతో ఆ నీటిని తాగిన వేలాది మంది ప్రజలు తమకేమైనా అవుతుందేమోనని ఆందోళనకు గురవుతున్నారు. ఎకెబిఆర్ రిజర్వాయర్‌లో మృతి చెందిన కోళ్లను వేసిన ఘటనను అధికారుల ద్వారా తెలుసుకున్న జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అత్యవసర పరిస్థితిగా పరిగణించి సమగ్ర విచారణకు ఆదేశించడంతోపాటు ఈ ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీనితో నల్లగొండ ఎస్‌పి శరత్‌చంద్ర పవర్, దేవరకొండ అడిషనల్ ఎస్‌పి మౌనిక ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఇట్టి వైరస్ సోకి చనిపోయిన కోళ్ల యొక్క అవశేషాలను వేసిన గుర్తుతెలియని వ్యక్తుల గురించి పుట్టంగండి వద్దిపట్ల పడమటి తండా చింతల్ దండలో గల షెడ్లను పరిశీలించి, యజమానులను విచారించి ఇట్టి చనిపోయిన కోళ్లను వేసిన వ్యక్తిని గుర్తించడం జరిగింది. పడమటి తండాకు చెందిన రమావత్ రాయమల్లు 7,000 కోళ్లను పెంచే సామర్థ్యం గల ఒక షెడ్‌లో జనవరి 17న కోడి పిల్లలను వేసుకోవడం జరిగింది. గత నాలుగు రోజుల నుంచి వైరల్ ఇన్ఫెక్షన్ కావడం వల్ల అధిక మొత్తంలో కోళ్లు చనిపోవడంతో చనిపోయిన కోళ్లను తీసుకొని వెళ్లి పుట్టంగండి రిజర్వాయర్ నుండి అక్కంపల్లి రిజర్వాయర్‌కు వెళ్లే లింక్ కెనాల్‌లో పడవేయడం జరిగింది. ఇట్టి రెండు రిజర్వాయర్లు నల్లగొండ, హైదరాబాద్‌కు తాగునీరు అందిస్తున్నాయి. అది తెలిసి కూడా ఇట్టి తాగునీటిని వైరస్‌తో చనిపోయిన కోళ్లను వేయడం వల్ల నీరు విషతుల్యం అవుతుందని తెలిసి కూడా అందులో వేసి మనుషులకు, పశుపక్ష్యాదులకు అనారోగ్యాన్ని కలిగే విధంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం దేవరకొండ కోర్టుకు పంపారు.

**బిసిలకు 42 శాతం అసెంబ్లీలో చట్టబద్ధత చేస్తే కాదు..**

# కేంద్రం నిర్ణయం తీసుకోవాలి



### తలసాని శ్రీనివాస్‌యాదవ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసిలకు 42శాతం రిజర్వేషన్లపై శాసనసభలో చట్టబద్ధత చేస్తే లాభం లేదని, కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. జనాభా తక్కువగా చూపిస్తే కేంద్రం నుంచి నిధులు తక్కువగా వస్తాయని, నియోజకవర్గాల పునర్విభజనలో కూడా రాష్ట్రానికి అన్యాయం జరుగుతుందని, అందుకే శాస్త్రీయంగా సర్వే నిర్వహిస్తే, వాస్తవాలు బయటకు వస్తాయని తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల్లో కులగణన సర్వే సరైన రీతిలో జరగలేదని, 60లక్షల జనాభాను తక్కువ చేసి చూపారని ఆరోపించారు. మేయర్‌పై అవిశ్వాసంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ వైఖరిపైన ఈనెల 17న నిర్ణయం తీసుకుంటామన్నారు. కాంగ్రెస్‌లోకి బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు వెళ్తారనే వార్తలు ఊహాగానాలేనని, ఇలాంటి ఊహాగానాలను పట్టించు కోవాల్సిన అవసరం లేదని తెలిపారు. కెసిఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఈనెల 17న పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తున్నామని, శనివారం ఉదయం కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, కెసిఆర్ జీవిత విశేషాలతో ప్రత్యేక సిడిని విడుదల చేస్తామని తలసాని వివరించారు.

**జిల్లా వైద్య & ఆరోగ్య కార్యాలయం, హైదరాబాద్.**

ఆర్‌సి నెం: 1762/ ఇ2 /డిఎం&హెచ్ఓ/హైదరాబాద్/2016 ఫైనల్ నోటీసు తేదీ: 14-02-2025

**శ్రీ జి.విజయకృష్ణ, తండ్రి: లేట్ జి.శివప్రసాద్,** ఫ్లాట్ నెం. ఎ2, ఇంటి నెంబర్: 8-3-720/1, కోటేశ్వర్‌రావు బిల్డింగ్, యెల్లారెడ్డిగూడ, హైదరాబాద్ -73, జూనియర్ అసిస్టెంట్, పూర్వ డిటిసిఓ, హైదరాబాద్. తేదీ: 06-08-16, 08-08-16 మరియు 18-08-2016 నుంచి ఈ రోజు వరకు ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా ఉద్దేశ్యపూర్వకంగా గైర్హాజరయ్యారు. డిటిసిపి, హైదరాబాద్ మరియు ఈ కార్యాలయం అతడి జాడను కనుగొనేందుకు పలుమార్లు మెమోలు, షోకాజ్ నోటీసులు జారీచేసి, తక్షణమే వెనక్కు వచ్చి ఈ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆర్‌సి.నెం. 1762/ఇ2/డిఎం& హెచ్ఓ/హెచ్‌వైడి/16 ద్వారా తేదీ: 18-12-24న కోరడం జరిగింది. అంతేకాకుండా ఆయనకు ఆర్‌సి.నెం. 1762/ఇ2/డిఎం&హెచ్ఓ/హెచ్‌వైడి/16, తేదీ: 07-01-25న ఛార్జిమెమో రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా పంపించడం జరిగింది. గత 5 సంవత్సరాలుగా ఉద్దేశ్యపూర్వకంగా,అనధికారికంగా గైర్హాజరు కావడం ఆరోపణలపై తన వివరణాత్మక రక్షణను సబ్మిట్ చేయాలని అతనిని కోరడం జరిగింది. జిఓ.ఎంఎస్.నెం. 260 జిఎ (సెర్.సి) డిపార్ట్‌మెంట్, తేదీ: 04-09-03 మరియు జిఓ.ఎం.నెం. 08 ఫిన్ (ఎఫ్ఆర్ఐ) డిపార్ట్‌మెంట్, తేదీ: 08-01-04లలో జారీ చేసి అతడిని ప్రభుత్వ సర్వీసు నుంచి తొలగించడానికి బాధ్యుడిని చేసినప్పటికీ అతడు ఇప్పటి వరకు తిరిగి రాలేదు. ఈ కార్యాలయం ఆర్‌సి.నెం. తేదీ: 23-01-25 ద్వారా విచారణ అధికారిని నియమించి, తేదీ: 30-01-25న శ్రీ.జి.విజయకృష్ణను విచారణకు రావాలని పిలుస్తూ రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా కోరగా అది డెలివరీ కాకుండా తిరిగివచ్చింది. అందువల్ల ప్రభుత్వ ఉత్తర్వులు మరియు ఎఫ్ఆర్.18, రూల్ 5-ఎ ఎపిఎల్ఆర్ 1933 & ఎపిసిఎస్ (సిసిఎ) 1991 రూల్స్ ప్రకారం శ్రీ జి.విజయకృష్ణకు ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా ఆయనపై పెనాల్టీగా సర్వీస్‌ను ముందుకు కొనసాగకుండా నిబంధనల ప్రకారం సర్వీస్ నుండి తొలగిస్తున్నట్లు ఆయనకు వ్యతిరేకంగా జారీ చేసిన ఉత్తర్వులకు ఈ ప్రచురణ జారీ చేసిన 30రోజులలోగా సంతకంతో నివేదించబడిన షోకాజ్ నోటీస్‌ను తప్పనిసరిగా రిపోర్టు చేయాలి.

సం/- జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి హైదరాబాద్ జిల్లా.

DIPR R.O. No. : 10285-PP/CL/ADVT/1/2024-25, Date: 14-02-2025

ప్రజాపక్షం
శనివారం, ఫిబ్రవరి 15

## మణిపూర్‌లో శాంతికి ఏది దారి?

మణిపూర్‌లో ఇంత ఆలస్యంగా రాష్ట్రపతి పాలన విధింపు బిజెపి బుద్ధి పొరపాటు అయినప్పటికీ అది ఆ రాష్ట్ర భౌగోళిక సమగ్రత పరిరక్షణ, భిన్న జాతుల ప్రజల మధ్య శాంతి–సామరస్యం పునరుద్ధరణ మార్గం అన్వేషణకు అవకాశం కల్పిస్తున్నది. మితీ–కుకీ జాతి జనుల మధ్య పెచ్చరిల్లిన వైషమ్యంతో దాదాపు రెండేళ్లుగా రాష్ట్రంలో కార్చిచ్చు రగులుతున్నా, 'రెండు ఇంజిన్‌ల ప్రభుత్వం' గూర్చి గొప్పలు చెప్పుకునే ప్రధాని నరేంద్రమోదీకి ఒక్కసారైనా ఆ రాష్ట్రం సందర్శించి ప్రజలకు ఓదార్పు మాటలు చెప్పేందుకు సమయం దొరకలేదు. రాష్ట్రపతి పాలన విధింపు ఉత్తర్వు సందర్భంలో కూడా ఆయన దేశంలో లేరు. ఆ రాష్ట్ర బాధ్యతలు చూస్తున్న హోంమంత్రి అమిత్ షా కూడా చురుకుగా వ్యవహరించలేదు. బిజెపికి తమ ప్రభుత్వాన్ని కాపాడుకోవటంపైనున్న శ్రద్ధ సమస్యలను చక్కదిద్దటంలో లేకపోవటం విచారకరం. ఇప్పుడు కూడా ఆ పార్టీ వ్యవహరించిన తీరులో దాని స్వార్థచింతనే కనిపిస్తుంది. ముఖ్యమంత్రి బీరెన్‌సింగ్ ఆదివారం తమ రాజీనామా పత్రాన్ని గవర్నర్‌కు అందజేశారు. 13వ తేదీనగాని రాష్ట్రపతి ఉత్తర్వు జారీ కాలేదు. అది కూడా పార్లమెంటు ఉభయ సభలు బడ్జెట్ సమావేశాల తొలిదశ ముగించుకుని మార్చి 10వ తేదీకి వాయిదా పడిన గంట తర్వాత ఆ ఉత్తర్వు విడుదలైంది. ఆర్టికల్ 356 (3) ప్రకారం రాష్ట్రపతి ఉత్తర్వును పార్లమెంటు ఉభయ సభల ముందుంచాలి. ఆ సభలు రెండు నెలలలోపు ఆమోద తీర్మానాలు ఆమోదించకపోతే అది రద్దవుతుంది. అల్లకల్లోలంగా ఉన్న రాష్ట్రంలో అసెంబ్లీని రద్దు చేయకుండా సస్పెన్షన్‌లో ఉంచటంలోనే బిజెపి ఆలోచన విదితమవుతోంది. ముఖ్యమంత్రి రాజీనామా తదుపరి మణిపూర్ వెళ్లిన బిజెపి ఇన్‌ఛార్జి సంబిత్ పాత్రా ప్రత్యామ్నాయ నాయకుని ఎంపిక చేసే పనిలో పడ్డారు. నాయకుని ఎంపిక చేసినా మెజారిటీ కూడగట్టలేని పరిస్థితుల్లో రాష్ట్రపతి పాలన విధించారు. అసెంబ్లీ కాలావధి 2027 తొలి త్రైమాసికం వరకు ఉన్నందున, పరిస్థితులు చక్కబడగానే మళ్లీ అధికారం చేబట్టాలన్న ఆశ బిజెపిలో రెపరెపలాడుతోందనవచ్చు.

> ఈశాన్య ప్రాంతం దేశ సమగ్రతకు చాలా సున్నితమైన ప్రాంతం. గత ప్రభుత్వాలు ఎంతో ప్రయాసతో రాష్ట్రాలను తీర్చిదిద్దారు. కాబట్టి మణిపూర్ భౌగోళిక సమగ్రతకు విఘాతం ఏర్పడితే అది మళ్లీ పాముల పుట్టను కదిలించటమే అవుతుంది.

తక్షణ కర్తవ్యాలు – నిజమైన శాంతి, సామరస్యం సాధించటం. శాంతి–భద్రతల పునరుద్ధరణ, శిబిరాల్లో దుర్భర జీవితం గడుపుతున్న 60 వేలమంది ప్రజలను వారి స్వస్థలాలకు చేర్చి పునరావాసం కల్పించటం. మితీ, కుకీ మిలిటెంట్‌లు పోలీస్ స్టేషన్ నుంచి దోచుకెళ్లిన ఆధునిక తుపాకులను స్వాధీనం చేసుకునే కృషిని ముమ్మరం చేసి ప్రజల్లో భయాన్ని పారద్రోలటం. రెండు జాతుల మధ్యగల సమస్యల మూలాల్లోకి వెళ్లి సామరస్య పరిష్కారాలు సాధించటం. పర్వత ప్రాంత ప్రజలైన కుకీల్లో ఆత్మవిశ్వాసం కలిగించటం, మితీలనుంచి చట్టబద్ధ హామీలు రాబట్టటం. లోయ ప్రాంతాల్లోని మెజారిటీ మితీలు అధికారంలో, పాలనా యంత్రాంగంలో, ఆర్థిక స్థితిగతుల్లో మెరుగైన స్థితిలో ఉండటమేగాక, వారు కూడా ఎస్‌టి ప్రతిపత్తి కోరుతూ తమ భూముల కొనుగోలు తలపెట్టారని కుకి–జో తెగల ఆదివాసీల్లోగల భయం తొలగింపునకు చర్యలు అవసరం. ఇటువంటి భయాలతోనే కుకీ–జో ప్రజలు కేంద్ర పాలిత ప్రాంతం ప్రతిపత్తితో తమ ప్రాంతాల్లో స్వపరిపాలన డిమాండ్ చేస్తున్నారు. ఈశాన్య ప్రాంతం దేశ సమగ్రతకు చాలా సున్నితమైన ప్రాంతం. గత ప్రభుత్వాలు ఎంతో ప్రయాసతో రాష్ట్రాలను తీర్చిదిద్దారు. కాబట్టి మణిపూర్ భౌగోళిక సమగ్రతకు విఘాతం ఏర్పడితే అది మళ్లీ పాములపుట్టను కదిలించటమే అవుతుంది. అందువల్ల బిజెపి రాజకీయ స్వప్రయోజనం పక్కనబెట్టి రాజకీయ, పౌరసమాజం, ప్రజాతంత్ర వాదులను ఐక్యపరిచి మణిపూర్ సమస్యకు శాంతియుత పరిష్కారానికి ఓపికగా కృషిచేయాలి. తాజా ఎన్నికలు, ప్రజల తీర్పుతో కొత్త ప్రభుత్వం ఆ తదుపరి ప్రక్రియ. అందువల్ల అసెంబ్లీని రద్దు చేయటం కూడా విశ్వాస కల్పన చర్యల్లో భాగమవుతుంది.

# ప్రైవేటీకరణ కోసమే ఉన్నత విద్యా కమిషన్ బిల్లు

**డాక్టర్ జ్ఞాన్ పాఠక్**

జాతీయ విద్యా విధానం 2020 కింద భారత ఉన్నత విద్యా కమిషన్ ఏర్పాటుకు ఉద్దేశించి ఉన్నత విద్యా కమిషన్ ముసాయిదా బిల్లు(హెఇసిఐ)ను సంబంధిత మంత్రిత్వ శాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘం వ్యతిరేకించింది. ఇది పలు రకాల నియంత్రణ సంస్థల కారణంగా ఉత్పన్నమయ్యే అనేక సమస్యలకు దారి తీస్తుందని పేర్కొంది. అలాగే ప్రమాణాలలో, పర్యవేక్షణలో అస్థిరతకు కారణమవుతుందని, సంస్థలు సమర్థవంతంగా పనిచేయడాన్ని క్లిష్టతరం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది.

యుజిసిని ఏకైక నియంత్రణ సంస్థగా మార్చడానికి ప్రయత్నిస్తున్న హెచ్‌ఇసిఐ ముసాయిదా బిల్లులో కేంద్ర ప్రభుత్వానికి అధిక ప్రాతినిధ్యం కల్పించడం, రాష్ట్రాలకు సరైన ప్రాతినిధ్యం లేకుండా చేయడంతో అనేక సమస్యలు నిరంతరం కొనసాగేలా చేస్తుందని విద్య, మహిళలు, బాలలు, యువత, క్రీడల శాఖల పార్లమెంటరీ స్థాయీ సంఘం సమర్పించిన నివేదిక పేర్కొంది.

అంతేకాకుండా, 90 శాతం కంటే ఎక్కువ మంది విద్యార్థులకు బోధించే రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, అటు జాతీయ, ఇటు రాష్ట్ర స్థాయి నిబంధనల మధ్య కొట్టుమిట్టాడతాయి. ప్రతిపాదిత హెచ్‌ఇసిఐ బిల్లు విశేష అధికారాల ను కలిగి ఉంటుంది. ఇందులో గ్రాండ్ డిగ్రీ ప్రదానం చేసే అధికారం, సంస్థలను మూసివేయడం వంటి అంశా లు ఉన్నాయి. ఇది రాష్ట్ర నియంత్రణను తొలగించనుంది. మౌలిక సదుపాయాలు లేదా అధ్యాపకుల కొరతతో బాధపడుతున్న గ్రామీణ ప్రాంతాల్లోని సంస్థల మూసివేతకు దారితీస్తుంది. ఇది పరోక్షంగా ప్రైవేటీకరణను, ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేటీకరణకు దారితీస్తుంది.

నియంత్రణ సంస్థల అధికార క్రమాన్ని సరళీకరించడం మరింత ప్రభావవంతంగా ఉంటుందని స్థాయీ సంఘం సిఫార్సు చేసింది. అటువంటి ఏకీకృత నియంత్రణ సంస్థలో అన్ని రాష్ట్రాలకు తగిన ప్రాతినిధ్యం ఉండాలని, అధిక కేంద్రీకరణ ఉండకుండా ఆ డిపార్ట్‌మెంట్ చూసుకోవాలని సూచించింది.

దశాబ్దాలుగా ఉన్నత విద్య నియంత్రణ చాలా కఠినంగా ఉన్నట్లు ఎన్‌ఇపి– 2020 చెబుతోందని, ప్రభుత్వానికి కమిటీకి తెలియజేయబడింది. చాలా తక్కువ ప్రభావంతో చాలా ఎక్కువ నియంత్రించడానికి ప్రయత్నాలు సాగాయి. యాంత్రికమైన , బలహీనపరిచే స్వభావం కలిగిన నియంత్రణ వ్యవస్థ ఫలితంగా కొన్ని సంస్థలలో పెద్ద ఎత్తున అధికార కేంద్రీకరణ జరగడం, ఈ సంస్థల మధ్య పరస్పర ప్రయోజనాల సంఘర్షణ నెలకొనడం,జవాబుదారీతనం లేకపోవడం వంటి కనీస ప్రాథమిక సమస్యలు తలెత్తాయి. ఉన్నత విద్యారంగాన్ని తిరిగి శక్తివంతం చేయడానికి, మరింత అభివృద్ధి చెందడానికి వీలుగా నియంత్రణ వ్యవస్థలో సమూల సమగ్ర మార్పులు అవసరం. ఎన్‌ఇపి– 2020 నేపథ్యంలో ఉన్నత విద్య నియంత్రణ వ్యవస్థ అమలు కోసం భారత ఉన్నత విద్యా కమిషన్ బిల్లు ముసాయిదాను ఉన్నత విద్యా శాఖ సిద్ధం చేసింది. ఈ విషయాన్ని విద్య మంత్రిత్వశాఖ సంబంధిత భాగస్వాములతో సంప్రదింపులు చేస్తోంది.

పరిశ్రమ, వ్యవస్థలతో సంబంధాలు కలిగిన ఉన్నతస్థాయి సమావేశాలు, నాయకత్వ వర్క్‌షాప్‌లు, బిజినెస్ స్కూల్స్‌లోని వ్యాపార నైపుణ్య కేంద్రాలలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు తీసుకుంది. ఈ కార్యక్రమాలు కామర్స్ లేదా సైన్స్ లేదా సాంకేతిక నేపథ్యం ఉన్న విద్యార్థులలో కొంత భాగం మీదనే దృష్టి సారిస్తాయని కమిటీ గమనించింది. మానవ విజ్ఞాన శాస్త్రాలు(హ్యూమానిటీస్) చదివే విద్యార్థులను విస్మరించింది.

సాంకేతిక యేతర, మానవ విజ్ఞాన శాస్త్రాలు , సంబంధిత నేపథ్యాల నుండి వచ్చిన విద్యార్థులపై విద్యా విభాగం ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని కమిటీ సిఫార్సు చేసింది. ఒక రంగంలో స్థిరపడిన వ్యక్తుల నైపుణ్యాన్ని బైటికి తీసుకురావడానికి సంస్థలలో అవకాశాలు ఉండాలి. ఉదాహరణకు స్థిరపడిన రచయితలు, కథకులకు రచనా నైపుణ్యాలనే కెరీర్ ఎంపిక చేసుకునేలా ప్రచారం చేయాలి. పురావస్తు శాస్త్రం, భూగర్భ శాస్త్రం మొదలైన వాటిలో చేరిన విద్యార్థులకు క్షేత్ర సందర్శనలు పెంచాలి. ఈ రంగాలలో మరింత కెరీర్/విద్యా అవకాశాలపై అవగాహన కల్పించడానికి మంత్రిత్వ శాఖ చొరవ తీసుకోవాలి. సంబంధిత అవకాశాలను అందించడానికి ఇతర మంత్రిత్వ శాఖల సహకారం తీసుకోవాలి.

ఎన్‌ఇపి లక్ష్యాలతో అనుసంధానించబడిన సమ్మిళిత, సౌలభ్యమైన, అందుబాటు స్థాయిలో విద్యను నేషనల్ డిజిటల్ యూనివర్సిటీ (ఎన్‌డియు) వాగ్దానం చేస్తున్నట్లుగా కమిటీ పరిశీలించింది. అయితే, దాని పునాదిగా ఉన్న 'స్వయం (SWAYAM)' గణనీయమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. 2017 నుండి నమోదు చేసుకున్న విద్యార్థులలో 4 శాతం కంటే తక్కువ మంది 'స్వయం' కోర్సులను పూర్తి చేశారు. ఫిర్యాదులలో కాలం చెల్లిన పాఠ్యాంశాలు, అందుబాటులో లేని బోధన, సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడం వంటివి ఉన్నాయి. అవసరమైన శిక్షణ లేకపోవడం, తక్కువ పరిహారం, సాంకేతిక అడ్డంకులు, వాటి సామర్థ్యాన్ని దెబ్బతీస్తున్నాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఆన్‌లైన్ మోడ్‌లో 1:15 ఉపాధ్యాయ–విద్యార్థి నిష్పత్తిని విస్మరించడంతో వర్చువల్ తరగతి గదులు రద్దీతో నిండిపోయాయి. దీనికి తోడు ఆక్స్‌ఫామ్ ఇండియా 2022 ప్రకారం, ఎస్‌సి/ఎస్‌టి విద్యార్థులలో 4 శాతం , ఒబిసి విద్యార్థులలో 7 శాతం మంది మాత్రమే ఇంటర్నెట్ సౌకర్యం ఉన్న కంప్యూటర్లను కలిగి ఉన్నారని. ఈ లెక్కలు ఎన్‌డియు సమభాగస్వామ్యం వాదనలను ప్రశ్నిస్తోంది.



సాధ్యమైన చోట ఉద్యోగాలు కల్పించేందుకు ముందస్తు చొరవ తీసుకోవడం లేదా రిక్రూటర్లను విద్యార్థులతో అనుసంధానించేందుకు 'స్వయం'తో అనుబంధంగా ఒక వేదికను ఏర్పాటు చేయడం వంటి చర్యలు ప్రారంభించకపోతే డిజిటల్ చొరవలకు అంతంత మాత్రం స్పందనే ఉంటుందని కమిటీ పేర్కొంది. ఎందుకంటే ప్రధాన ప్రైవేటు ఆన్‌లైన్ వేదికలు దెబ్బతింటున్నాయని, అందుకే అభ్యర్థులు కోర్సులు పూర్తి చేసేలా డిపార్ట్‌మెంట్ చర్యలు తీసుకోవాలని కమిటీ సిఫార్సు చేసింది. సమాజంలోని వెనుకబడిన వర్గాల విద్యార్థులు ఎక్కువగా పాల్గొనేలా చేసేందుకు ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయాలని, వారి నమోదు , పురోగతిని కూడా శ్రద్ధగా పర్యవేక్షించాలని డిపార్ట్‌మెంట్‌కు సూచించింది.

ఐఐఎంలు 100 శాతం పన్ను మినహాయింపు ప్రాతిపదికన విదేశీ, స్వదేశీ నిధులను పొందేందుకు అనుమతించే నిబంధనలను కమిటీ గుర్తించింది. అలాగే కేంద్ర నిధులతో నడిచే సాంకేతిక సంస్థలలో(CRTI)కూడా శాస్త్రీయ పరిశోధన ప్రయోజనాల కోసం ఎండోమెంట్ నిధులను పెంచుకునేందుకు ఐఐటిలు/జాతీయ విశ్వవిద్యాలయాలకు వచ్చే చెల్లింపులకు 100 శాతం పన్ను మినహాయింపు నిబంధనతో కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ప్రోత్సహించడాన్ని కూడా పరిశీలించింది. పరిశోధన ప్రయోజనాల కోసం మాత్రమే పరిమితి కాకుండా అన్ని ప్రయోజనాల కోసం విస్తరించాలని కమిటీ చేసిన మునుపటి సిఫార్సును పునరుద్ఘాటించింది.

ఉన్నత విద్యా సంస్థలు తగినంత ప్రతిభావంతులను సమకూర్చుకునేందుకు, ప్రతిభావంతులైన పూర్వ విద్యార్థులు/సీనియర్ విద్యార్థులు/పిహెచ్‌డి స్కాలర్లను బోధనా సహాయకులుగా నియమించుకోవడంపై కమిటీ తన గత సిఫార్సును మరోసారి గుర్తు చేసింది. ఈ పద్ధతిని ముందు కొన్ని విశ్వవిద్యాలయాలలో ప్రయోగ ప్రాతిపదికన అమలు చేసి మూల్యాంకనం చేసిన తదుపరి జాతీయ స్థాయికి విస్తరించవచ్చు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న అనేక విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్టు విధానంలో పని చేస్తున్నవారు పెద్ద ఎత్తున ఉన్నట్లుగా కమిటీ గుర్తించింది. కేంద్ర విశ్వవిద్యాలయాలలో 4,000 మంది ఉపాధ్యాయులు తాత్కాలిక ప్రాతిపదికన పనిచేస్తున్నారు. శాశ్వత, భద్రత కలిగిన ప్రభుత్వ ఉద్యోగాల నుండి క్యాజువల్, స్వల్పకాలిక కాంట్రాక్టుల వైపునకు ప్రభుత్వం మళ్ళడం ద్వారా ప్రభుత్వం విద్య నుండి తప్పుకోవడం, నయా ఉదారవాద విధానాల ప్రభావం పెరగడం ద్యోతకమవుతుంది. కాంట్రాక్టు ఉద్యోగాలకు ఉద్యోగ భద్రత ఉండదు. జీతాల పెంపు ఉండదు. పదోన్నతులు, పెన్షన్లు లేదా వేతనంతో కూడిన సెలవులు వంటి సామాజిక భద్రతా ప్రయోజనాలు ఉండవు. ఇలాంటి ప్రతికూలతలలో సైతం శాశ్వత ఉద్యోగాల కొరత కారణంగా ముఖ్యంగా సామాజిక శాస్త్రాలు , మానవ విజ్ఞాన శాస్త్రా లు వంటి రంగాలలో ఉద్యోగాలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. పరిశోధన చేయడానికి ప్రయత్నించేటప్పుడు కాంట్రాక్టు అధ్యాపకులు కూడా సంస్థాగత అడ్డంకులను ఎదుర్కొంటారు. వాటిలో పరిశోధన గ్రాంట్లు లభించకపోవడం, తగినంత సంస్థాగత గుర్తింపు లేకపోవడం వంటివి ఉన్నాయి. అందుకే ఉద్యోగులను ప్రేరేపించి సామర్థ్యా న్ని పెంపొందించేందుకు, ఉద్యోగ భద్రతను అందించడానికి, న్యాయమైన పని పరిస్థితులను కల్పించడానికి, వారి ఉద్యోగాల క్రమబద్ధీకరణపై డిపార్ట్‌మెంట్ కృషి చేయాలని, తద్వారా పరిశోధన, బోధనా శాస్త్రాన్ని (పెడగొగి) మెరుగుపరిచే ప్రయత్నాలు జరగాలని కమిటీ బలంగా సిఫార్సు చేస్తుంది.

ప్రశ్నాపత్రం లీకేజి, తప్పుడు ప్రశ్నపత్రాన్ని ఇవ్వడం మొదలైన అంశాలను పరిష్కరించాల్సిన అవసరం ఇంకా ఉందని పేర్కొంది. కాబట్టి నాణ్యత గుర్తింపు ఇచ్చేందుకు ఎన్‌ఎఎసి, ఎన్‌బిఎలలో డాక్టర్ రాధాకృష్ణన్ కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు చేపట్టిన సంస్కరణ ప్రక్రియ వంటి అంశాలపై కూడా డిపార్ట్‌మెంట్ జాగ్రత్త తీసుకోవాల్సిందని కమిటీ అభిప్రాయపడింది. అలాగే సమస్యల పరిష్కారానికి కమిటీ సిఫార్సులను అమలు చేయాలని సూచించింది.

విద్య వ్యాపారీకరణ పెరుగుతున్న నేపథ్యంలో, కోచింగ్ తరగతులు–కళాశాలల మధ్య అపవిత్ర సంబంధాల ద్వారా అభ్యాస ప్రక్రియను ప్రహసనంగా మార్చే కలతపెట్టే ధోరణిని దృష్టిలో పెట్టుకొని కమిటీ గతంలో చేసిన సిఫార్సుపై ప్రభుత్వం చర్య తీసుకోలేదని పేర్కొంది. ఉపాధి అవకాశాలను పెంచడానికి సమకాలీన సిలబస్‌లో కొత్త సాంకేతికతలను చేర్చడానికి ఒక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుపై కూడా ప్రభుత్వం ఇచ్చిన సమాధానం సంతృప్తికరంగా లేదని కమిటీ తెలిపింది. దానిని ఏర్పాటు చేయాలని మరోసారి సిఫార్సు చేసింది.

**(ఐపిఎ సర్వీస్)**

# ధర్మభిక్షం...ఉద్యమం ఆయన ఊపిరి, పోరాటమే ఆయన ప్రాణం

జీవితమంతా ప్రజల సేవకే అంకితం చేసిన ప్రజల మనిషి కామ్రేడ్ బొమ్మగాని ధర్మభిక్షం. సూర్యాపేట పట్టణంలో కల్లుగీత వృత్తిలో జీవనం సాగిస్తు న్న బొమ్మగాని ముత్తి లింగయ్య, గోపమ్మ దంపతులకు ఐదవ సంతానంగా 1922 ఫిబ్రవరి 15వ తేదీన జన్మించారు ధర్మభిక్షం.

హైదరాబాద్ సంస్థానంలో నిజాంపాలన కింది దొరలు దేశముఖ్‌లు. భూస్వాములకు ప్రజలు వెట్టిచాకిరీ చేస్తూ బతుకులీడుస్తున్న రోజులు, మరోవైపు రజాకారుల దమనకాండకు ఎదురుతిరుగలేక చిత్రహింసలను అనుభవిస్తున్న ప్రజలు. విద్యార్థులు మాతృభాషలో విద్యనేర్చుకోజాలని పరిస్థితి. పాలకుల భాషనే బోధనాభాషగా ఉండేది. వీటన్నింటికి కారణం నిజాంల నిరంకుశ విధానాలని అర్థమైపోయింది. అందుకే బాల్యంలోనే ధర్మభిక్షానికి పాలకులపై ఏహ్యభావం ఏర్పడింది.

సూర్యాపేటలో ధర్మభిక్షం మిడిల్‌స్కూల్ విద్యార్థిగా ఉన్న రోజుల్లో ఏడవ నిజాం నవాబు జన్మదిన వేడుకలకనుగుణంగా జరుపుకోవాలని హెడ్మాస్టర్ కరీముల్లాఖాన్ హుకుం జారీచేశారు. హెడ్మాస్టర్ హుకుంను ధిక్కరించి నవాబు జన్మదినోత్సవాలను బహిష్కరించాలని పిలుపునిచ్చాడు ధర్మభిక్షం. ఆయన పిలుపుతో విద్యార్థులు యూనిఫామ్‌తో మాస్ డ్రిల్, పరేడ్ చెయ్యాలన్న హెడ్మాస్టర్ ఆజ్ఞను ధిక్కరించి, తరగతులను బహిష్కరించి పెద్ద ఎత్తున విద్యార్థులు సమ్మె చేశారు. ఈ సమ్మె సంస్థానంలో ప్రకంపనలు సృష్టించింది. సమ్మె గురించి, ధర్మభిక్షం గురించి ప్రజలు ముఖ్యంగా మేధావులు చాలాకాలం చర్చించుకోవడం జరిగింది. హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం లో వందేమాతర ఉద్యమం ప్రారంభమై రాష్ట్రమంతా వ్యాపించింది. వందేమాతర ఉద్యమానికి నల్లగొండలో నాయకత్వం వహించారు ధర్మభిక్షం. ఉద్యమాన్ని కేంద్ర కార్యచరణ సమితి కాంగ్రెస్ నాయకుల సలహామేరకు విరమించినా, నల్లగొండలో విద్యార్థులు సమ్మెను కొనసాగించారు. నల్లగొండ లో పోలీసులు 144 సెక్షన్ విధించినా, విద్యార్థులు దాన్ని ధిక్కరించి పోలీసు లాఠీదెబ్బలు తింటూ ధర్నాలు, పికెటింగులు చేస్తూ 23 రోజులు సమ్మె ను కొనసాగించారు. ఫలితంగా ఉద్యమానికి నాయకత్వం వహించిన ధర్మభిక్షంతో సహా 30మంది విద్యార్థులను పాఠశాలనుంచి తొలగించింది యాజమాన్యం.

వందేమాతర ఉద్యమాలలో చదువును త్యాగంచేసిన ధర్మభిక్షం నిజాం సంస్థానంలో మతమార్పిడి దూరాచారాలు, బాల్యవివాహాలు, అంటరానితనం రుగ్మతలపై పోరాడేందుకు ఒకవేదిక కోసం ఆర్యసమాజ్‌లో చేరి, జీవహింసకు వ్యతిరేకంగా పండుగలు, ఉత్సవాలలో జంతుబలులకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహించారు. ధర్మభిక్షం దూరభారం వల్ల ఆర్థిక పరిస్థితులవల్ల విద్యను అందుకోలేని పట్టణ మరియు గ్రామీణ పిల్లల కోసం సూర్యాపేటలో హాస్టలు నెలకొల్పి విద్యార్థులకు రాజకీయ చైతన్యం కోసం డిబేట్స్ ఉపన్యాసాలు ఇప్పించడం ద్వారా వారిని దేశభక్తులుగా తీర్చిదిద్దారు ధర్మభిక్షం. మహాత్మా గాంధీ స్ఫూర్తితో స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా ఖాదీ ఉద్యమాలను గ్రంథాలయోద్యమాలను, అస్పృశ్యత అంటరానితనాలకు వ్యతిరేకంగా హరిజనవాడల్లో సహ పంక్తిభోజనాలు, వయోజన విద్యాకేంద్రాలు నడిపించిన సంఘసేవకులు ధర్మభిక్షం.



బొమ్మగాని ధర్మభిక్షంగారి 103వ జయంతి

దేశంలోపల స్వాతంత్ర్యోద్యమ పోరాటాలు, దేశం వెలుపల రష్యావిప్లవ పరిస్థితులు ఆయనను ప్రభావితం చేశాయి. చేస్తున్న అదే తరుణంలో మక్సీమ్ గోర్కీ రచించిన 'అమ్మ' నవల చదివి దాని స్ఫూర్తితో తాను కమ్యూనిస్టుగా మారాను అంటాడు ధర్మభిక్షం. మరొకవైపు డా. రాజబహద్దూర్ గౌర్, మఖ్దూం, రావినారాయణరెడ్డి వంటి నాయకుల ప్రోత్సాహంతో 1941లో ఏర్పడిన 'ఆల్ హైదరాబాద్ స్టూడెంట్స్ యూనియన్' విద్యార్థి లోకాన్ని కదిలించింది. వామపక్ష స్రవంతిలోకి విద్యార్థులను తీసుకవచ్చింది.

ధర్మభిక్షం ఆహ్వానం మేరకు సూర్యాపేట హాస్టల్ వార్షికోత్సవాలకు హాజరయ్యారు నాటి హైదరాబాద్ నగర కొత్వాల్ రాజబహదూర్ వెంకట్రామిరెడ్డి. అప్పటికే ధర్మభిక్షం సేవలను ఆ నోటా, ఈ నోటా విన్న కొత్వాల్ సూర్యాపేటలో పండుగ వాతావరణంలో హాస్టల్ వార్షికోత్సవ సభలో ప్రసంగించారు. "ఏక్ హాత్ సే భిక్షామాంగ్ కర్, దూస్‌రే హాత్‌సే దర్మ్ కర్‌నే వాలా సిర్ఫ్ భిక్షం నహీ, ఓ ధర్మభిక్షం హై". ఒకచేత్తో దానమడుగుతూ, రెండోచేత్తో ధర్మం చేస్తున్న వ్యక్తి కేవలం భిక్షం కాదు.... ఆయన ధర్మభిక్షం అవుతాడని అన్నారు. భిక్షంగారికి 'ధర్మ' బిరుదునిస్తూ కొత్వాల్ వెంకట్రామిరెడ్డిగారు ప్రకటించిన నాటినుండి తల్లిదండ్రులు పెట్టిన పేరు భిక్షం కాస్తా కొత్వాల్ గారిచ్చిన బిరుదుతో ధర్మభిక్షంగా పిలువబడింది.

విద్యారంగానికి ధర్మభిక్షం చేసిన సేవలకు ఇది నిదర్శనం. ఆయన ఏ పదవిలో ఉన్న లేకున్నా చదువుకోని పిల్లలను, చదువుమానివేసిన విద్యార్థులను ఎందరినో ప్రోత్సహించి చదివించారు, వారి ఉన్నతస్థితికి కారకులైనారు ధర్మభిక్షం. ఆయన నేర్పిన క్రమశిక్షణ, రాజకీయ చైతన్యంతో హాస్టల్‌లో చదువుకున్న విద్యార్థులు అనేకమంది స్వాతంత్ర్యోద్యమంలోను, తెలంగాణ సాయుధ పోరాటంలోను అగ్రభాగాన నిలిచారు. ధర్మభిక్షం తెలంగాణ సాయుధ పోరాటంలోను, వందేమాతర ఉద్యమంలోను, గ్రంథాలయ ఉద్యమంలోను, ఖాదీ ఉద్యమంలోను కీలక భూమిక పోషించారు. తెలంగాణ సాయిధ పోరాటకాలంలో పోరాటదళాలకు మార్గనిర్దేశన చేస్తూ రహస్యజీవనం సాగిస్తున్న తరుణంలో సూర్యాపేట్ సమీపంలో కుప్పిరెడ్డిగూడెంలో పోలీసులకు చిక్కినా ప్రజలమద్దతుతో చావునుండి తప్పించుకొనగలిగారు.

ధర్మభిక్షం జైలునుండి తప్పించుకున్న ప్రమాదకర ఖైదీగా నల్లగొండ, చెంచల్‌గూడ, ఔరంగబాద్ జైళ్ళలో చిత్రహింసలు అనుభవించారు. చీకటి జైలు గదుల్లో నెలలతరబడి నిర్బంధించారు. ఐదున్నర సంవత్సరాలు కఠిన కారాగార శిక్షలు అనుభవిస్తూనే జైలు వెలుపల సాయుధపోరాటాలకు మద్దతుగా, జైలులో పల రాజకీయ ఖైదీల హక్కుల కోసం జరిగిన పోరాటాలకు న్యాయకత్వం వహించారు. 1952, 1957, 1962 సం.లలో అసెంబ్లీ ఎన్నికల్లో సూర్యాపేట నా.., నకిరెకల్లా లేక నల్లగొండ అని ప్రజలు చూడలేదు. ధర్మభిక్షం ఎక్కడనుండి నిలబడిన అక్కడినుండే ప్రజలు గెలిపించుకొన్నారు. ఇక పార్లమెంట్ ఎన్నికల్లో 1990, 1995 సం.లలో నల్లగొండ నియోజకవర్గంనుంచి రెండు పర్యాయాలు భారీ మెజారిటీతో ప్రజలు ధర్మభిక్షంను గెలిపించుకున్నారు. రెండవసారి ఎన్నికల్లో 480 మంది అభ్యర్థులు నిలబడగా ధర్మభిక్షం గుర్తు కంకి–కొడవలి, న్యూస్ పేపర్ లాంటి బ్యాలెట్ పేపర్లో గుర్తించి వోటువేసి 76వేల మెజారిటీతో గెలిపించడం భారత ఎన్నికల చరిత్రలోనే అపూర్వమైన సంఘటన. ధర్మభిక్షం కార్మిక, కర్షక, నేత, గీత, హమాలి, రిక్షా, మెడికల్, లారీ వర్కర్స్, హోటల్ వర్కర్స్, నాగార్జునసాగర్ డ్యామ్ నిర్మాణ కార్మికుల సంఘం, సిమెంట్ వర్కర్స్ ఇలా, ఎన్నెన్నో సంఘాలు స్థాపించి వారిహక్కుల సాధనకు కృషిచేసిన కార్మికనాయకుడే కాదు ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు కూడ. ప్రముఖ సినీగేయ రచయిత సుద్దాల అశోక్ తేజ ధర్మభిక్షం గారిని 'నేలమీద నడుస్తున్న ఆరడుగు ఎర్రజెండా' అని పోల్చడం ధర్మభిక్షం గారి పోరాటపటిమకు నిదర్శనం. ధర్మభిక్షం ఎల్లప్పుడు ప్రజలసమస్యల ప్రాతినిధ్యం కోసమే మంత్రులు, ముఖ్య మంత్రులు, ప్రధానమంత్రులను కలిసేవారు తప్ప తన కోసం ఏనాడు సిఫారసు చేసుకోని 'నిస్వార్థ ప్రజాసేవకుడని' నాటి భారత ప్రధాని మన తెలుగుతేజం శ్రీ.పి.వి. నరసింహారావు ధర్మభిక్షంగారిని గూర్చిఅన్న మాటలు అక్షరసత్యాలు. 'జీవితం మాత్రము తనది బ్రతుకంతా ప్రజలది'



బి.నాగభూషణం
ఉపాధ్యక్షులు, తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం,
9849622633

# ఉచితాల్లో పోటీ అనర్థదాయకం



ఉజ్జిని రత్నాకరరావు
9490952646

పార్లమెంటు, శాసనసభ ఎన్నికల ముందు రాజకీయ పార్టీలు పోటీపడి ఉచిత వరాలను ప్రకటిస్తున్నాయి. సామాజిక సంక్షేమం పేరిట రకరకాల పథకాలు ఇతర ఉచితాలకు సంబంధించి భారీగా హామీలు గుప్పిస్తున్నాయి. రాజకీయ పార్టీలు ప్రకటిస్తున్న ఉచిత పథకాలపై సుప్రీంకోర్టు మొన్న కీలక వ్యాఖ్యలు చేసింది. పట్టణ ప్రాంతాల్లోని నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాలని దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ బిఆర్ గయాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్ తో కూడిన బెంచ్ విచారణ చేపట్టిన సందర్భంగా.. ఉచిత పథకాలను ప్రస్తావిస్తూ.. వాటివల్ల జరిగే అనర్థాలపై ఆందోళన వ్యక్తం చేసింది. 'ఉచిత పథకాల కారణంగా ప్రజ లు పనిచేసేందుకు ఇష్టపడరు. దేశాభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేయాల్సింది పోయి.. మనమే వాళ్లను సోమరిపోతులుగా తయారు చేస్తున్నామా'? అని ప్రశ్నించింది. ప్రజలు ఎలాంటి పని చేయకున్నా.. వాళ్లకు ఫ్రీగా రేషన్, డబ్బులు అందుతున్నాయని పేర్కొంది. ఫ్రీగా రేషన్, డబ్బు లు వస్తున్నప్పుడు.. వాళ్లు ఇక పని ఎందుకు చేస్తారని ప్రశ్నించింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వచ్చిన ఫలితాలపై విశ్లేషిస్తే సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు సరైనవే అనిపిస్తుంది. సుప్రీం న్యాయస్థానం ఉచితాలపై చేసిన సూచనల దృష్ట్యా ప్రజా ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా సామాజిక అభివృద్ధి కొరకు ప్రణాళికలతోముందుకు సాగవలసిన అవసరం ఉన్నది.

2023 ఆఖరిలో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో, 2024 లోకసభ, మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లోనూ, తాజాగా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లోను గెలవడం కోసం సంక్షేమం పేరుతో పార్టీలు పోటాపోటీగా ఉచితాలు ఇస్తామని ప్రకటించటం..ఈ ధోరణి స్పష్టంగా కనిపించింది. ఎన్నికల్లో గెలవ డం కోసం దేశ ఆర్థిక భవిష్యత్తును ఫణంగా పెట్టి మరీ ఎడాపెడా ఉచితాలు ఇవ్వడానికి రాజకీయ పార్టీలు హడావుడి పడుతున్నాయి. నగదు చెల్లింపు లు, మిక్సీలు, గ్రైండర్లు, ఫ్యాన్లు, లాప్‌టాప్ లు, ఆడపిల్లకు సైకిళ్ళు, స్కూటీలు, మహిళలకు నెలకు రూ.2500లు, తదితర వరాలతో ఓట్లు దండుకోవాలని ఆరాటపడుతున్నాయి.

మహారాష్ట్ర, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల్లో అన్ని పార్టీలు ఉచిత రేషన్‌తో పాటు రుణమాఫీలు, సబ్సిడీపై గ్యాస్ సిలిండర్లు, మహిళలకు నేరుగా నగదు చెల్లింపు వంటి జనాకర్షణ పథకాలను ఇష్టానురీతిగా ప్రకటించేసాయి. ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో మహిళల కు ఉచిత బస్సు ప్రయాణాలు, నిత్యావసర సరుకులపై సబ్సిడీల పెంపు వంటి వాగ్దానాలను గుప్పించాయి. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాలు వంటివి ప్రయోజనకరమైనవే. ఆర్థిక కార్యకలాపాలలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచే పథకాలు అవసరమే. కానీ రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులు దృష్టి లో పెట్టుకొని పాలకులు సంక్షేమం – అభివృద్ధి సమపాళ్ళలో చేపట్టాల్సిన అవసరం ఉంది..

**దీర్ఘకాలిక ప్రయోజనాలకు ముప్పు :** సామాజిక సమానత్వ సాధనకు సంక్షేమ పథకాలు ఉపకరించే మాట నిజమే. అయితే, ఆ పథకాలు అందని వారిలో నిరసన రేకెత్తుతుంది. అంటే సమాజంలో కొత్త సంక్షోభం తలెత్తుతుందన్నమాట. పేదరికం నిర్మూలించి దేశాన్ని స్థిరమైన వృద్ధి పథంలో పరుగులు తీయించడానికి పటిష్టమైన విధానాలను అమలు చేయాలి. అలా కాకుం డా, ఎన్నికల్లో గెలుపుకోసం ఉచితాలను ప్రకటించడం దీర్ఘకాలంలో నష్టమే కలిగిస్తుంది. తాత్కాలికంగా ప్రజలకు ఊరట కలిగిస్తాయి, కానీ, స్థిరమైన ఆదాయ వనరుగా ఉపయోగపడవు.

**కేంద్రం –రాష్ట్రాలు పోటీపడటం :** మూడేళ్ల క్రితం ప్రధాని మోదీ ఇలాంటి సంస్కృతిని విమర్శించారు. ఇప్పుడు భాజపా కూడా ఉచిత వరాలను గుప్పిస్తుంది. ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో సబ్సిడీలు, నగదు చెల్లింపు వాగ్దానాల్లో ఇతర పార్టీలతో పోటీ పడింది. ఉచితాలు ఆర్థికం గా చేటు చేస్తాయని తెలిసినా..ఎన్నికల్లో విజయం కోసం అన్ని రాజకీయ పక్షాలు అధికారం కోసం అవధులు దాటి ప్రకటిస్తున్నాయి.

ఉచిత పథకాలను దండిగా అమలు చేస్తున్న రాష్ట్రాలు తీవ్ర ద్రవ్య లోటును ఎదుర్కొంటున్నాయి. గడచిన దశాబ్ద కాలంలో ఏ పార్టీ అధికారంలో ఉన్న, ఈ ఆర్థిక లోటు పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. నీతి అయోగ్ ఆర్థిక ఆరోగ్య నివేదిక ఈ అంశాన్ని చాటిచెబుతుంది. పలు రాష్ట్రాలు అప్పుల భారంతో కృంగిపోతున్నాయని, అభివృద్ధికి మూలమైన ఆస్తుల సృష్టిలో వెనుకబడి పోతున్నాయని హెచ్చరించింది. స్వల్ప కాలిక లబ్ధి కోసం దీర్ఘకాలిక ప్రయోజనాలను ఫణంగా పెడుతున్నాయని ఓటర్లు కూడా గ్రహించడం లేదు. జనాకర్షక పథకాలు వారి జీవితాలను ఉద్ధరించకపోగా, మార్కెట్ ను అస్తవ్యస్తం చేస్తాయి. వస్తు సేవలు ఉచితంగా దొరుకుతున్నప్పుడు మార్కెట్లో వాటి సరఫరా గిరాకీల మధ్య అసమతుల్యత ఏర్పడుతుంది. కొత్తగా పెట్టుబడులు పెట్టడానికి ప్రైవేట్ రంగం ముందు కు రాదు. కీలక రంగాల్లో పోటీ వాతావరణం, నవీకరణ దెబ్బతిని ఎదుగు పొదుగులేని స్థితి ఏర్పడుతుంది. కార్మికుల్లోనూ ఉత్పాదక క్షీణిస్తుంది. పథకాల అమలులోను అవినీతి, ఆశ్రిత పక్షపాతం చోటు చేసుకుని కొన్ని వర్గాల్లో ఆగ్రహ నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

**అప్పులతో తాయిలాలు..వాటికొరకు అప్పులు:** ఇటీవల కాలంలో ఉచితాలతో వివిధ రాష్ట్రాలలో అధికారంలోనికి వచ్చిన ప్రభుత్వాలు వాటి అమలు కోసం పడుతున్న పాట్లు చూస్తుంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏమాత్రం బాగాలేకున్నా అప్పులు చేస్తూ.. ఇచ్చిన వాగ్దానాలు అమలు చేస్తామని హామీలు గుప్పిస్తున్నారు. తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రా, తెలంగాణలో కూడా తలకు మించిన అప్పులు చేసి అధికారాన్ని కోల్పోయినాయి.. ప్రస్తుతం వచ్చిన ప్రభుత్వాలు రాష్ట్ర వార్షిక ఆదాయంలో మూడవ వంతు అప్పులకు కిస్తులు వడ్డీలు చెల్లించలేక తిరిగి అప్పులు మరిన్ని అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

**నైపుణ్యాలు పెంచి అభివృద్ధికి పాటుపడాలి :** ఉచిత పంపిణీకి పోటీపడే రాజకీయ సంస్కృతిని అదుపు చేయాలని, అందుకు ఒక ప్రవర్తన నియమావళిని అనుసరించాలని రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ డి సుబ్బారావు ఇటీవల సూచించారు.

ప్రభుత్వ ఆర్థిక పరిస్థితికి తగ్గట్టు హామీలు ఇవ్వాలే తప్ప దివాలా తీసేలా వాగ్దానాలు చేయకుండా రాజకీయ పార్టీలు సంయమనం పాటించాలని సూచించారు.'ఆకలితో ఉన్నవాడికి ఒక చేప ఇస్తే ఒక పూట గడుస్తుంది. అది చేపలు పట్టే వల ఇస్తే జీవితం చక్కగా గడిచిపోతుంది' అని ప్రాచీన చైనా తత్వవేత్త లావోజు సూక్తిని అన్ని పార్టీలు, ప్రభుత్వాలు గుర్తించుకోవాలి. ప్రజల జీవనాధారా నికి కావాల్సిన నైపుణ్యాలు నేర్చుకోవడంతోపాటు వ్యాపార, ఉపాధి అవకాశాలను విస్తరించాలి. దీర్ఘకాలిక సాధికారత, స్వావలంబనను సమకూర్చాలి. ఈ వాస్తవాన్ని ప్రజలు, పార్టీలు, ప్రభుత్వాలు గుర్తించి మెలగాలి.

## బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్

బంజారా జాతిలో భగవత్ స్వరూపునిగా, అవతారపురుషునిగా సామాజిక క్రాంతి వీరుడిగా పూజింపబడుతున్న ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్. లిపిలేని బంజారా భాషను ఒక క్రమ పద్ధతిగా మార్చిన అక్షర ధీరశాలి. పదికోట్ల బంజారా జాతి ధిక్కార స్వరం. లంబాడి ప్రజలకు దశ దిశను చూపి హైందవ ధర్మం గొప్పతనం విశిష్టతలను తెలియజేసి బంజారా జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటేలా అహింస సిద్ధాంతానికి పునాది వేసిన మహోన్నత వ్యక్తి లంబాడి ప్రజల ఆరాధ్య దైవం ఆదర్శమూర్తి సంత్ సేవాలాల్ మహారాజ్. బంజారాలు తమ ఉనికి కాపాడుకోవడానికి శత్రువుల కంట పడకుండా దక్షిణాది బాటపట్టా రు. రాంజీనాయక్‌కు ముగ్గురు కుమారులు కాగా పెద్ద కుమారుడు భీమానాయక్‌కు కర్ణాటకలోని ధర్మిణిబాయితో వివాహం జరిగింది.1739 ఫిబ్రవరి 15న రమావత్ సంత్ సేవాలాల్ మహారాజ్ జన్మించారు. మధ్యయుగంలో మహమ్మద్ గోరికి వ్యతిరేకంగా పృథ్వీరాజ్ చౌహాన్ పక్షాన పోరాడిన వీరోచిత చరిత్ర బంజారాల సొంతం. బంజారాలు ఎవరికీ హాని తలపెట్టేవారు కాదని సహాయ గుణం కలవారని, ధైర్యసాహసాలకు ప్రతీకలని చరిత్ర ద్వారా తెలుస్తుంది. జాతి వివక్షకు గురవుతూ ఆర్థిక సామాజిక రాజకీయ సాంఘిక అభివృద్ధిలో వెనుకబడి లంబాడీలను అభివృద్ధి చేయవలసిన బాధ్యత నేటి సమాజంలో ఉన్న ప్రభుత్వాలకు అవసరం ఉన్నది.



# టోకు ధరల ద్రవ్యోల్బణం తగ్గుదల



**న్యూఢిల్లీ :** ఆహార ఉత్పత్తులు, కూరగాయల ధరలు తగ్గడంలో జనవరిలో టోకు ధరల ద్రవ్యోల్బణం స్వల్పంగా తగ్గినట్టు, అది 2.31 శాతంగా ఉన్నట్టు ప్రభుత్వం శుక్రవారం సమాచారం అందించింది. టోకు ధరల సూచి ఆధారిత ద్రవ్యోల్బణం 2024 డిసెంబర్‌లో 2.37గా నమోదైంది. 2024 జనవరిలో అది కేవలం 0.33 శాతం మాత్రమే. ప్రభుత్వ సమాచారం ప్రకారం ఆహార ఉత్పత్తుల ద్రవ్యోల్బణం జనవరిలో 5.88 శాతంకు తగ్గింది. 2024 డిసెంబర్‌లో అది 8.47గా నమోదైంది. కూరగాయల విషయంలో ద్రవ్యోల్బణం 2024 డిసెంబర్‌లో 28.65నుంచి ప్రస్తుతం 8.35కు తగ్గింది. గుడ్లు, మాంసం, చేపల విషయంలో గత నెలలో 5.43నుంచి ప్రస్తుతం 3.56కు తగ్గింది. టొమాటొ ధరలు 18.9 శాతం పడిపోగా, జనవరిలో ఆలుగడ్డల ద్రవ్యోల్బణం 74.28 శాతం, ఉల్లిపాయల విషయంలో 28.33 శాతం పెరిగింది. ఇంధనం, విద్యుత్ సంబంధిత ద్రవ్యోల్బణం డిసెంబర్‌లో 3.79 శాతం ఉండగా, జనవరిలో అది 2.78కి తగ్గింది. పారిశ్రామిక ఉత్పత్తులలో డిసెంబర్‌లో 2.14 ఉండగా, జనవరిలో అది స్వల్ప పెరుగుదలతో 2.51కి చేరింది. బుధవారం విడుదల చేసిన వినియోగదారుల ధరల సూచి ప్రకారం రిటైల్ ద్రవ్యోల్బణం అయిదు నెలల కాలంలో అత్యల్ప స్థాయికి(4.31శాతం) చేరుకుంది. 2025లో టోకు ధరల సూచి 2.4గా ఉంటుందని, 2026లో అది 3 శాతానికి చేరుకునే అవకాశముందని ఐసిఆర్ఎ(ఇన్వెస్టిమెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ) ఆర్థికవేత్త రాహుల్ అగర్వాల్ తెలిపారు. రానున్న కొద్ది నెలల్లో ఆహార ఉత్పత్తుల ధరలు తగ్గే అవకాశం ఉందని కేర్ రేటింగ్ ఆర్థికవేత్త రజని సిన్హా తెలిపారు. అయితే అమెరికా ఆర్థిక విధానాలవల్ల ఆహారేతర ఉత్పత్తుల ధరలు పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో రూపాయి పతనం 4 శాతానికి చేరుతుండడంతో దిగుమతులపై ద్రవ్యోల్బణం పెరిగే అవకాశముంది. గత నెలలో ఆర్బీఐ 25 పాయింట్ల ఆధారంగా రెపో రేట్‌ను 6.25కు తగ్గించిన విషయం తెలిసిందే. కాగా ఆర్థిక లావాదేవీలు, నగదు లభ్యత వంటి అంశాల ఆధారంగా ద్రవ్య విధానం అమలులో ఉంటుందని సీనియర్ ఆర్థిక వేత్త పరాస్ జస్రాయ్ తెలిపారు.

# విద్యార్థులపై బహిష్కరణ వేటు



**కొట్టాయం:** ర్యాగింగ్ పేరిట జూనియర్ విద్యార్థుల్ని దారుణంగా హింసించిన సీనియర్లపై కేరళలోని కొట్టాయం ప్రభుత్వ నర్సింగ్ కళాశాల కఠిన చర్యలకు సిద్ధమైంది. ఈ వ్యవహారంలో ఇప్పటికే కాలేజీ నుంచి సస్పెండై, అరెస్టయిన ఐదుగురు విద్యార్థులను కాలేజీ నుంచి బహిష్కరించనున్నట్లు సమాచారం. మరోవైపు, ఈ ఘటనలో చేపట్టిన చర్యలపై పది రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సి) ఆదేశించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే దర్యాప్తునకు ఆదేశించింది. కొట్టాయం నర్సింగ్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులను మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు దారుణంగా హింసించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. దీంట్లో ఐదుగురు నిందితులను గుర్తించిన పోలీసులు వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణలో భాగంగా వీడియోను స్వాధీనం చేసుకున్న పోలీసులు అందులోని దృశ్యాలు చూసి షాకయ్యారు. బాధితుడిని మంచానికి కట్టేసి కంపాస్ సూదులతో గుచ్చుతున్నట్లుగా ఆ వీడియోలో రికార్డయింది. అంతేకాకుండా, విద్యార్థులను అర్ధ నగ్నంగా చేసి ప్రైవేటు భాగాలపై డంబెల్స్ పెట్టడంతోపాటు మంచానికి కట్టేసి నోట్లో ఫేషియల్ క్రీమ్ పోసినట్లుగా వీడియోలో ఉంది. ఈ ర్యాగింగ్ ఘటన దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.



## మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన నేపథ్యంలో..

# అందరి చూపు కేంద్ర నాయకత్వం వైపు

**ఇంఫాల్ :** కలహాలతో రగులుతున్న మణిపూర్‌లో బిజెపి కేంద్ర నాయకత్వం తదుపరి చర్యపై అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది. రాష్ట్రపతి పాలన విధించడంతో అసెంబ్లీ అచేతనావస్థకు చేరుకుంది. రాష్ట్రవ్యాప్తంగా భద్రతను పెంచినట్టు అధికారులు తెలియజేశారు. ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ తన పదవికి రాజీనామా చేయడంతో రాష్ట్రలంలో రాజకీయ అనిశ్చితి నెలకొన్నది. దీనితో అసెంబ్లీని రద్దుచేసి గురువారం రాష్ట్రపతి పాలన విధించారు. ఈశాన్య రాష్ట్రాల ఇన్‌చార్జి సంబిత్ పాత్ర, శాసనసభ్యుల మధ్య ముఖ్యమంత్రి అభ్యర్థిత్వంపై పలుదఫాలుగా జరిగిన చర్చలు విఫలమవడంతో రాష్ట్రపతి పాలన విధించాలని నిర్ణయం తీసుకున్నారు. 21 నెలలుగా రాష్ట్రంలో కొనసాగుతున్న జాతీ విద్వేషాలలో 250మందికిపైగా మృతి చెందడంతో సిఎం బీరేన్‌సింగ్ రాజీనామా చేశారు. 2027వరకు అసెంబ్లీ కాలపరిమితి ఉంది. రాష్ట్రపతి పాలన నేపథ్యంలో రాష్ట్ర రాజధాని ఇంఫాల్‌లో.. ముఖ్యంగా రాజ్ భవన్, సచివాలయం వద్ద భద్రతను పెంచినట్టు అధికారులు తెలిపారు. మణిపూర్ పోలీసులు ఇంఫాల్‌లోని కంగ్లా గేట్, సంజెన్‌థాంగ్, మొయిరాంగ్‌ఖోమ్, కీసంపత్, కొనంగ్ మమాంగ్ ప్రాంతాలలో పెద్దయెత్తున్న సిబ్బందిని ఏర్పాటు చేశారని వెల్లడించారు. జరుగుతున్న రాజకీయ పరిణామాలను ఆసరాగా చేసుకుని విధ్వంసకారులు ఎలాంటి దుశ్చర్యలకు పాల్పడకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్టు అధికారులు తెలిపారు. రాష్ట్రపతి పాలన విధించగానే రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు ఎ.శారద విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగ నిబంధనల ప్రకారం అసెంబ్లీని అచేతనావస్థలో ఉంచారని, అయితే రద్దు చేయలేదని తెలిపారు. పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకోగానే అసెంబ్లీ తిరిగి సమావేశమౌతుందన్నారు. రాష్ట్రంలో పరిణామాలపై కాంగ్రెస్‌నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ రాష్ట్రాన్ని పాలించడంలో బిజెపి విఫలమైందని, దానిని బిజెపి ఆలస్యంగా అంగీకరించిందని వ్యాఖ్యానించారు. మణిపూర్ పరిణామాలపై ప్రధాని మోదీ ఇక తన వైఫల్యాన్ని అంగీకరించక తప్పదన్నారు. రాష్ట్రంలో శాంతి, సాధారణ పరిస్థితులు నెలకొనేందుకు తీసుకోనున్న చర్యలను ప్రజలకు వివరిస్తారా? అని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ సమాచార విభాగం ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ, రాష్ట్రపతి పాలన విధించాలని 20 నెలలుగా కాంగ్రెస్ పార్టీ కోరుతున్న డిమాండ్ ఇప్పటికి నెరవేరిందన్నారు. ఇన్‌డిజినస్ ట్రైబల్ లీడర్స్ ఫోరం(ఐటిఎల్ఎఫ్) నాయుడు గింజా వాల్జంగ్ మాట్లాడుతూ, రాష్ట్రపతి పాలన కుకి జొ సమాజానికి ఊరట ఇచ్చిందని, మీటీ సమాజానికి చెందిన ముఖ్యమంత్రి ఏర్పడే అవకాశం ఇప్పట్లో లేదని వ్యాఖ్యానించారు. తాజా పరిణామంతో తమ రాజకీయ సమస్యకు ఒక అడుగు ముందుకు పడినట్టయిందన్నారు.

**ప్రధాని క్షమాపణ చెప్పాలి : ఖర్గె**

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించడం కేంద్రంలో, రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని, ఇందుకు బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గె ఎక్స్ వేదికగా స్పందిస్తూ మణిపూర్‌లో రాజకీయ సంక్షోభం రాష్ట్రపతి పాలన విధించారన్నారు. 'మోదీ జీ! కేంద్రంలో తమ పార్టీ 11 యేళ్లుగా పాలిస్తున్నది. మీ పార్టీనే మణిపూర్‌లో 8 సంవత్సరాలుగా పాలనలో ఉంది. రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడాల్సిన బాధ్యత మీపైనే ఉంది. దేశ భద్రత, సరిహద్దు గస్తీ బాధ్యతకూడా మీ ప్రభుత్వ బాధ్యతే. అధికారంలో ఉన్న మీ పార్టీని రద్దుచేసి, రాష్ట్రపతి పాలన విధించడం మీ వైఫల్యాన్ని అంగీకరించడమే' అన్నారు. రాష్ట్రపతి పాలన మీరు కోరుకున్నది కాదని, రాజ్యాంగ ప్రతిష్టంభన ఏర్పడడం వల్లనే ఈ పరిణామమన్నారు. బిజెపి అసమర్థతను ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు భరించలేకపోవడంతోనే రాష్ట్రపతి పాలన విధించారని వ్యాఖ్యానించారు. 'మీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం మణిపూర్ ప్రజల ఆశలను తొక్కివేసింది. మణిపూర్ సందర్శించి ప్రజల బాధ, ఘోష ఆలకించి వారికి క్షమాపణ చెప్పగలరా? అంతటి ధైర్యం మీకు ఉన్నదా?' అని ఖర్గె ప్రశ్నించారు.

**'నాయకత్వ సంక్షోభమే కారణం'**

రాష్ట్ర బిజెపిలో నాయకత్వ సంక్షోభమే రాష్ట్రపతి పాలనకు కారణమని మణిపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కీషమ్ మేఘచంద్ర వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి ఎంపికపై జరిగిన చర్చలు విఫలమవడంతో రాష్ట్రపతి పాలన విధించారన్నారు. ఎట్టకేలకు బిజెపి కేంద్ర నాయకులు కూడా వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుంటున్నారన్నారు. కొత్త ముఖ్యమంత్రి ఎవరన్నది ఎంపిక చేసుకోవడలో రాష్ట్ర బిజెపిలో విభేదాలు పొడచూపడంతో రాష్ట్రపతి పాలనకు దారితీసిందన్నారు. ఇక ప్రధాని మోదీనే మొత్తం బాధ్యత వహించాలని, రాష్ట్ర బిజెపిలో సంక్షోభాన్ని తొలగించి తిరిగి సాధారణ పరిస్థితులు నెలకొల్పాల్సిన బాధ్యత ఆయనదే అని మేఘచంద్ర అన్నారు. పాలన, ప్రాదేశిక సమగ్రత బాధ్యత ఇక కేంద్రానిదే అన్నారు.

# 19న ఢిల్లీ సిఎం ప్రమాణం?



**న్యూఢిల్లీ :** అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బిజెపి ఘనవిజయం సాధించిన వారం రోజులైనా ఢిల్లీ కొత్త ముఖ్యమంత్రి ఎవరు? కొత్త మంత్రి వర్గ ప్రమాణస్వీకారం ఏప్పుడనే దానిపై సస్పెన్ కొనసాగుతోంది. 27 ఏండ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ దేశ రాజధాని ఢిల్లీలో బిజెపి అత్యధిక సీట్లు గెలిచి అధికారాన్ని కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. 70 అసెంబ్లీ స్థానాలకు గానూ ఇటీవలే జరిగిన ఎన్నికల్లో కాషాయ పార్టీ ఏకంగా 48 స్థానాల్లో గెలిచింది. ఇక ఆమ్ ఆద్మీ పార్టీ కేవలం 22 స్థానాలతోనే సరిపెట్టుకుంది. ఈ నేపథ్యంలో హస్తినలో ప్రభుత్వ ఏర్పాటుకు కమలం పార్టీ సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించిన సన్నాహకాలు కూడా మొదలు పెట్టింది. అయితే, సీఎం అభ్యర్థి ఎవరన్నదానిపై మాత్రం ఇప్పటి వరకూ క్లారిటీ లేదు. రేసులో పలువురు ముఖ్య నేతల పేర్లు వినిస్తున్నాయి. ఈ క్రమంలో ఢిల్లీలో ప్రభుత్వ ఏర్పాటుకు బిజెపి హైకమాండ్ ముహూర్తం పెట్టినట్లు తెలిసింది. ఇందుకోసం 48 మందిలో 15 మంది ఎమ్మెల్యేలతో కూడిన జాబితా సిద్ధం చేసినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. వీరిలో తొమ్మిది మందిని షార్ట్ లిస్ట్ చేసి.. సిఎం, డిప్యూటీ సిఎం, మంత్రులు, స్పీకర్‌ను ఖరారు చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమెరికా పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. ఈ పర్యటన ముగించుకొని శుక్రవారం రాత్రి లేదా శనివారం ఉదయానికి ఢిల్లీ చేరుకునే అవకాశం ఉంది. మోదీ ఢిల్లీ వచ్చిన వెంటనే ప్రధానితో అమిత్ షా, జెపి నడ్డా సహా బిజెపి ముఖ్య నేతలు భేటీ కానున్నట్లు సమాచారం. మోదీతో చర్చలు జరిపి ఓ అంచనాకు రానున్నట్లు తెలిసింది. ఇక ఈ నెల 17, 18 తేదీల్లో శాసనసభా పక్ష సమావేశం ఏర్పాటు చేసి సిఎం అభ్యర్థిని ఎన్నుకోనున్నారు. 19, 20 తేదీల్లో సిఎం ప్రమాణ స్వీకారం ఉంటుందని ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంది. కమలం పార్టీ అధికారికంగా సిఎం పేరు ప్రకటించనప్పటికీ, ఈ రేసులో ముందంజలో ఉన్న పలువురి పేర్లు ఇప్పటికే రాజకీయ వర్గాల్లో చక్కర్లు కొడుతున్నాయి. అందులో ఆప్ చీఫ్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఓడించిన పర్వేశ్ వర్మ ముందంజలో ఉన్నారు.

**పర్వేశ్ వర్మ:** ఈయన ఢిల్లీ మాజీ సిఎం సాహిబ్ సింగ్ వర్మ కుమారుడు. అత్యంత ప్రతిష్టాత్మకమైన న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గంలో మాజీ సిఎం, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌పై వర్మ గెలుపొందడం విశేషం. ఇది ఆయనకు కలిసొచ్చే అంశం.

**రమేశ్ బిధూరి:** ఈయన మాజీ ఎంపీ. గుజ్జర్ సామాజికవర్గానికి చెందిన ముఖ్య నాయకుడు. ఢిల్లీ సిఎం ఆతిశీపై పోటీ చేశారు. రమేశ్ ఢిల్లీ బిజెపిలో కీలక నాయకుడిగా కొనసాగుతున్నారు.

**బన్సూరి స్వరాజ్:** విదేశీ వ్యవహారాల మాజీ మంత్రి, దివంగత సుష్మా స్వరాజ్ కుమార్తె బన్సూరి స్వరాజ్. న్యూఢిల్లీ నుంచి మొదటి సారి ఎంపిగా ఎన్నికయ్యారు. అతి తక్కువ కాలంలోనే ఢిల్లీ బిజెపిలో గుర్తింపు పొందారు.

**స్మృతి ఇరానీ:** ఒకప్పటి బిజెపి ముఖ్య లీడర్లలో స్మృతి ఇరానీ ఒకరు. కానీ, గత లోక్‌సభ ఎన్నికల్లో ఓడిన తర్వాత ఆమె తెరమరుగయ్యారు. ఇప్పుడు సిఎం రేసులో ఆమె కూడా ఉన్నట్టు సమాచారం.

# మమతా కులకర్ణి రాజీనామా తిరస్కరణ



**ప్రయాగ్‌రాజ్:** కిన్నార్ అఖాడా మహామండలేశ్వర్ పదవికి బాలీవుడ్ నటి మమతా కులకర్ణి చేసిన రాజీనామా తిరస్కరణకు గురైంది. ఇటీవల ఒక వీడియోలో తన రాజీనామాను ఆమె ప్రకటించగా, తాజాగా తన రాజీనామా తిరస్కరణకు గురైనట్టు శుక్రవారంనాడు మరో వీడియోను ఆమె షేర్ చేశారు. ఆచార్య మహామండలేశ్వర్ లక్ష్మీ నారాయణ్ త్రిపాఠీ తన రాజీనామాను అంగీకరించ లేదని అందులో తెలిపారు. అఖాడాలో కీలక స్థానమైన మహామండలేశ్వర్ హోదాను 52 ఏళ్ల మమతా కులకర్ణి పొందడంతో సభ్యుల మధ్య వివాదాలు చెలరేగాయి. దీంతో ఆమెపై బహిష్కరణకు వేటు పడింది. ఈ నేపథ్యంలో తాను రాజీనామా చేసినట్టు ఫిబ్రవరి 10న మమతా కులకర్ణి ప్రకటించారు. సన్యాసినిగానే కొనసాగుతానని చెప్పారు. తొలుత భావోద్వేగంతో తన హోదాకు రాజీనామా చేశానని, అయితే ఆ తర్వాత గురువుల మార్గదర్శకంలో సనాతన ధర్మానికి సేవలు కొనసాగించేందుకు నిశ్చయించుకున్నానని మమత కులకర్ణి చెప్పారు. 'రెండ్రోజుల క్రితం కొందరు మా గురువు డాక్టర్ ఆచార్య లక్ష్మీ నారాయణ్ త్రిపాఠిపై తప్పుడు ఆరోపణలు చేశారు. అందుకు ప్రతిగా నేను రాజీనామా చేశాను. అయితే, ఆయన నా రాజీనామాను అంగీకరించలేదు. పదవిలోనే ఉంచినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. అఖాడాకు, సనాతన ధర్మ పరిరక్షణకు పునరంకితం అవుతున్నాను'' అని ఆమె చెప్పారు.

# గత లోక్‌సభ ఎన్నికల్లో నోటాకు అత్యల్ప ఓట్లు

**న్యూఢిల్లీ :** గత ఏడాది (2024)లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఇవిఎంలలో నిక్షిప్తం చేసిన 'నోటా'కు అత్యల్ప శాతం ఓట్లు వచ్చాయి. 2013లో నోటాను పరిచయం చేసినప్పటి నుంచి అత్యల్పంగా ఓట్లు రావడం ఇదే తొలిసారి. ఈ మేరకు ఎన్నికల కమిషన్ గణాంకాలను వెల్లడించింది. నోటా ఆప్షన్‌ను మొదటిసారి 2014 లోక్‌సభలో జరిగిన ఎన్నికల్లో అమల్లోకి తీసుకువచ్చారు. ఎన్నికల ప్యానల్‌కు చెందిన 2024 అట్లాస్ ప్రకారం గతంలో జరిగిన మూడు లోక్‌సభ ఎన్నికల్లో నోటా ఓట్లు క్రమంగా తగ్గుతూ వచ్చాయి. 2014లో నోటాకు 1.08 శాతం ఓట్లు రాగా, 2024లో 0.99 శాతం ఓట్లు పోలయ్యాయి. ఈ శాతం తక్కువగా అనిపించినప్పటికీ, మొత్తం నోటా ఓట్ల సంఖ్య ఇప్పటికీ గణనీయంగా ఉండవచ్చు. ముఖ్యంగా తక్కువ గెలుపు మార్జిన్లు ఉన్న సీట్లలో, నోటా ఓట్లు కొన్ని నియోజకవర్గాలలో ఫలితాలను ప్రభావితం చేసి అవకాశం ఉంది. రాష్ట్రాలలో నోటా ఓట్ల పంపిణీ గణనీయమైన వైవిధ్యాన్ని ప్రదర్శిస్తుంది. ఇది ప్రాంతీయ రాజకీయ గతిశీలత, ఓటరు ప్రాధాన్యతలు, రాజకీయ ప్రమేయం స్థాయిలను ప్రతిబింబిస్తుంది. కాగా, బిహార్‌లో నోటాకు అత్యధికంగా 2.07 శాతం ఓట్లు వచ్చాయి. ఆ తరువాత దాద్రా అండ్ నగర్ హవేలీ, డామన్ అండ్ డియూలో 2.06 శాతం, గుజరాత్‌లో 1.58 శాతం ఓట్లు పోలయ్యాయి. అయితే నాగాలాండ్‌లో నోటా ఓట్ల వాటా అత్యల్పంగా 0.21 శాతం మాత్రమే ఉంది,. ఇది రాష్ట్రంలో పోటీ చేసే అభ్యర్థులకు బలమైన అమరిక లేదా ప్రాధాన్యతను సూచిస్తుంది. రాష్ట్రాల్లో ఇటువంటి వైవిధ్యమైన ధోరణులు రాజకీయ పోటీ, ప్రాంతీయ పార్టీల ప్రాముఖ్యత, ఓటర్ల విద్య, ప్రతి ప్రాంతంలోని మొత్తం ఎన్నికల దృశ్యం వంటి అంశాల ద్వారా ప్రభావితమవుతాయి. 2013లో ప్రవేశపెట్టబడిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై (ఇవిఎంలు) నోటా ఎంపికకు సొంత చిహ్నం ఉంది. దానిపై నల్లటి శిలువ ఉన్న బ్యాలెట్ పేపర్. సెప్టెంబర్ 2013 సుప్రీం కోర్టు ఆదేశం తర్వాత ఇసి ఓటింగ్ ప్యానెల్‌లో చివరి ఎంపికగా ఇవిఎంలపై నోటా బటన్‌ను చేర్చింది. అత్యున్నత న్యాయస్థానం ఆదేశానికి ముందు, ఏ అభ్యర్థికి ఓటు వేయడానికి ఇష్టపడని వారు ఫారమ్ 49–ఒ ను పూరించే అవకాశం ఉండేది. కానీ 1961 ఎన్నికల నిర్వహణ నియమాలలోని నిబంధన 49–ఒ కింద పోలింగ్ స్టేషన్‌లో ఫారమ్ నింపడం వల్ల ఓటరు గోప్యతకు భంగం వాటిల్లింది. అయితే, మెజారిటీ ఓటర్లు ఓటు వేసేటప్పుడు నోటా ఆప్షన్‌ను ఉపయోగించినట్లయితే, కొత్తగా ఎన్నికలు నిర్వహించాలని ఇసిని ఆదేశించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది.

# కొత్త సిఇసి ఎంపికకు కసరత్తు

## 17న ప్రధాని అధ్యక్షతన సెలక్షన్ కమిటీ భేటీ

**న్యూఢిల్లీ :** నూతన ఎన్నికల ముఖ్య కమిషనర్ (సిఇసి) పేరును ఖరారు చేసేందుకు ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన సెలక్షన్ కమిటీ వచ్చే ఈనెల 17వ తేదీన భేటీ కానుందని శుక్రవారం వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఉన్న సిఇసి రాజీవ్ కుమార్ ఈనెల 18వ తేదీన పదవీ విరమణ పొందనున్నారు. అందకు ముందే సోమవారం ప్యానల్ సమావేశమయ్యే అవకాశముంది. ప్రధాని నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల సెలెక్షన్ కమిటీలో ప్రధానితోపాటు కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సభ్యులుగా ఉంటారు. సెర్చ్ కమిటీ సూచించిన అభ్యర్థుల పేర్లను పరిశీలించి అందులో నుంచి ఒకరిని సిఫార్సు చేయనుంది. రాజీవ్ కుమార్ తరువాత అత్యంత సీనియర్ ఎలక్షన్ కమిషనర్‌గా జ్ఞానేష్ కుమార్ ఉన్నారు. ఆయన పదవీ కాలం జనవరి 26, 2029 వరకు ఉంది. సుఖీర్ సింఘ్ సంధు కూడా ఎన్నికల కమిషనర్‌గా ఉన్నారు. అయితే ఇప్పటి వరకు ప్రస్తుతం సిఇసి పదవీ విరమణ తరువాత సీనియర్ అయిన ఎలక్షన్ కమిషనర్‌కు పదోన్నతి కల్పిస్తూ వస్తున్నారు. కాగా, గత ఏడాది ఇసిసి, ఇసిల నియామకానికి సంబంధించిన కొత్త చట్టం అమల్లోకి వచ్చిన తరువాత ఒక సెర్చ్ కమిటీ ఐదుగురు కార్యదర్శి స్థాయి అధికారుల పేర్లను ప్రధానమంత్రి నేతృత్వంలోని ప్యానెల్ పరిశీలన కోసం షార్ట్‌లిస్ట్ చేసింది. సిఇసితో పాటు రాజీవ్‌కుమార్ పదవీ విరమణ తరువాత ఖాళీ కానున్న స్థానంలో కొత్త ఇసిని కూడా నియమించనున్నారు. 'ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్లు (నియామకం, సేవా నిబంధనలు మరియు పదవీకాలం) చట్టం, 2023 లోని నిబంధనలను మొదటిసారిగా సిఇసి నియామకానికి వర్తింపజేస్తున్నప్పటికీ, గత సంవత్సరం అనుప్ చంద్ర పాండే పదవీ విరమణ, అరుణ్ గోయెల్ రాజీనామా కారణంగా ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయడానికి ఇసిలు జ్ఞానేష్ కుమార్, సంధులను నియమించడానికి దీనిని ఉపయోగించారు.




చట్టం ప్రకారం, ప్రధానమంత్రి నేతృత్వంలోని, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, ప్రధానమంత్రి నామినేట్ చేసే కేంద్ర క్యాబినెట్ మంత్రితో కూడిన ఎంపిక కమిటీ సిఫార్సుపై సిఇసి , ఇసిలను రాష్ట్రపతి నియమిస్తారు. కొత్త ఇసిని నియమించడానికి కూడా అదే అభ్యర్థుల సమితిని ఉపయోగించవచ్చని వర్గాలు తెలిపాయి. చట్టం ప్రకారం సిఇసి, ఇతర ఇసిలు భారత ప్రభుత్వ కార్యదర్శి స్థాయికి సమానమైన పదవిని కలిగి ఉన్న వ్యక్తుల నుండి నియమిస్తారు. మరో మాటలో చెప్పాలంటే, ప్రస్తుతం పనిచేస్తున్న, పదవీ విరమణ చేసిన కార్యదర్శి స్థాయి అధికారులను సిఇసి, ఇసిలుగా నియమించవచ్చు.

# పుల్వామా దాడికి ఆరేండ్లు..

## వీర జవాన్లకు నివాళులు..!



**న్యూఢిల్లీ :** జమ్ముకశ్మీర్‌లోని పుల్వామాలో జరిగిన ఉగ్రదాడిలో 40 మంది భారత జవాన్లు అమరులై నేటికి ఆరేండ్లు అయ్యింది. 2019 ఫిబ్రవరి 14వతేదీన జమ్ము కశ్మీర్‌లోని పుల్వామా ప్రాంతంలో సీఆర్పీఎఫ్ (రిజర్వ్ పోలీస్ ఫోర్స్) జవాన్లపై ఉగ్రవాదులు భీకర దాడికి తెగబడ్డారు. ఆ ఘటనలో 40 మంది సైనికులు అమరులైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పుల్వామా దాడిలో ప్రాణాలు కోల్పోయిన జవాన్లకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా సహా పలువురు నివాళులు అర్పించారు. '2019లో పుల్వామా దాడిలో అమరులైన జవాన్లకు నివాళులు. మీ త్యాగం, దేశం పట్ల మీ అచంచలమైన అంకితభావాన్ని ప్రజలు ఎప్పటికీ మరిచిపోరు' అని మోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు. అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ సైతం పుల్వామా దాడిలో ప్రాణాలు కోల్పోయిన జవాన్లకు నివాళులర్పించారు. మరోవైపు పుల్వామా దాడిలో అమరులైన జవాన్లకు ఒడిశాకు చెందిన ప్రముఖ సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ నివాళులర్పించారు. పూరీలోని ఒడిశా తీరంలో సైకత శిల్పం తీర్చిదిద్ది.. జవాన్లకు నివాళులర్పించారు.

# సత్యేంద్ర జైన్ ప్రాసిక్యూషన్‌ను రాష్ట్రపతి అనుమతి కోరిన హోం శాఖ

**న్యూఢిల్లీ :** ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేత, మాజీ మంత్రి సత్యేంద్ర జైన్ మరింత చిక్కుల్లో పడ్డారు. ఆయనపై ప్రాసిక్యూషన్‌కు అనుమతి మంజూరు చేయాలంటూ రాష్ట్రపతిని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కోరింది. భారతీయ నాగరిక్ సురక్ష సంహిత సెక్షన్ 218 కింద అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. ఇడి విచారణలో తగినన్ని సాక్ష్యాలు లభించినట్టు తెలిపింది. హవాలా లావాదేవీల ఆరోపణలపై మనీ లాండరింగ్ కేసు కింద జైన్‌ను 2022 మే మాసంలో ఇడి అరెస్టు చేసింది. ప్రస్తుతం బెయిలుపై ఉన్న ఆయనపై ఇడి ఛార్జిషీటు దాఖలు చేసింది. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణపై జైన్ తదితరులపై సిబిఐ 2017 ఆగస్టులో ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. 2018 డిసెంబర్‌లో ఛార్జిషీటు దాఖలు చేసింది. 2015–17 మంది ఆయన ఆదాయ మార్గాల కంటే 217 శాతం హెచ్చుగా ఆదాయం కలిగి ఉన్నారని, రూ.1.47 కోట్ల అక్రమాస్తులు ఉన్నాయని సిబిఐ ఆ ఛార్జిషీటులో పేర్కొంది. మనీలాండరింగ్ కేసులో సుదీర్ఘ కాలం జైలులో ఉండటంతో సత్యేంద్ర జైన్‌కు సిటీ కోర్టు బెయిలు మంజూరు చేసింది. దీంతో గత ఏడాది అక్టోబర్ 18 ఆయన తీహార్ జైలు నుంచి విడుదలయ్యారు. రూ.50,000 వ్యక్తిగత పూచీకత్తు సమర్పించారు. 2022 మేలో జైన్ అరెస్టు కాగా, 2023 మే 26, 2024 మార్చి 18 మధ్య 10 నెలలు మెడికల్ బెయిల్ మినహా తక్కిన కాలమంతా ఆయన జైలులోనే ఉన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన సత్యేంద్ర జైన్ బిజెపి అభ్యర్థి క్నల్ సింగ్ చేతిలో 21,000 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు.

# కుంభమేళాకు 50 కోట్ల మంది



**ప్రయాగ్‌రాజ్ :** ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో కొనసాగుతోన్న కుంభమేళాకు ఊహించని స్థాయిలో భక్తులు వస్తున్నారు. శుక్రవారం సాయంత్రానికి 50 కోట్లకు పైగా భక్తులు త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించినట్లు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం వెల్లడించింది. మానవ చరిత్రలో ఏ మతపరమైన, సాంస్కృతిక లేదా సామాజిక కార్యక్రమంలో ఈ స్థాయిలో జనం పాల్గొనలేదని తెలిపింది. శుక్రవారం ఒక్కరోజే సాయంత్రం 6 గంటల వరకు 92 లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారని, దీంతో ఇప్పటివరకు వచ్చినవారి సంఖ్య 50 కోట్లు దాటిందని యూపీ ప్రభుత్వం వెల్లడించింది. భారత్, చైనా మినహా అన్ని దేశాల జనాభాను ఈ సంఖ్య దాటేసిందని పేర్కొంది. ఇక్కడ స్నానాలు చేసిన వారి సంఖ్య అమెరికా, రష్యా, ఇండోనేసియా, బ్రెజిల్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ దేశాల జనాభా కంటే ఎక్కువని తెలిపింది. ప్రతి 12 ఏళ్లకు ఓసారి నిర్వహించే ఈ మహా కుంభమేళా జనవరి 13న మొదలు కాగా.. ఫిబ్రవరి 26 వరకు కొనసాగనుంది. మొత్తం 40 నుంచి 45 కోట్ల మంది రావచ్చని తొలుత అంచనా వేశారు. కానీ, అంచనాలకు మించి భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు వస్తున్నారు. ప్రపంచం నలుమూలల నుంచి నిత్యం సరాసరి కోటిన్నర మంది వస్తుండటం గమనార్హం. జనవరి 29న మౌని అమావాస్య రోజే దాదాపు 8 కోట్ల మంది ప్రయాగ్‌రాజ్‌కు వచ్చినట్లు యూపీ ప్రభుత్వం పేర్కొంది. అదే రోజు తెల్లవారుజామున జరిగిన తొక్కిసలాటలో 30 మంది ప్రాణాలు కోల్పోగా మరో 60 మంది గాయపడిన సంగతి తెలిసిందే. మరో 12 రోజులపాటు కొనసాగనుండటంతో భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కుంభమేళాకు సంబంధించి సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలకు పాల్పడుతున్న వారిపై యుపి అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. గడిచిన నెలరోజుల్లో 53 సోషల్ మీడియా అకౌంట్లపై చట్టపరమైన చర్యలకు ఉపక్రమించినట్లు యుపి పోలీసులు వెల్లడించారు. అసత్య సమాచారం, తప్పుదోవ పట్టించే వీడియోలు వ్యాప్తి చేస్తున్న వారిని ఎప్పటికప్పుడు గుర్తించి, వారిపై చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

# టైగర్ రిజర్వ్‌నుంచి స్వచ్ఛందంగా వైదొలగాలి




**ఛండీగఢ్ :** టైగర్ రిజర్వ్ ప్రాంతాలనుంచి గ్రామాలు స్వచ్ఛందంగా వైదొలగేలా చర్యలు చేపట్టాలని ఎన్‌టిసిఎ(నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటి) సూచించింది. దీనితోపాటు ఆ ప్రాంత ప్రజల అభివృద్ధికి, వారిని ప్రధాన స్రవంతిలోకి వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరింది. ప్రస్తుతం అమలు చేస్తున్న స్వచ్ఛంద గ్రామ పునరావాస ప్యాకేజీ ఆకర్షణీయంగా లేనందున కొన్ని ప్రాంతాల ప్రజలు తమ ప్రాంతాన్ని విడిచి వెళ్లేందుకు అంగీకరించడం లేదని అథారిటీ సభ్యులు కొందరు అభిప్రాయం వ్యక్తంచేశారు. వన్యప్రాణి సంరక్షణకు ప్రాధ్యాన్యం ఇవ్వనున్నట్టు కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ వెల్లడించారు. పరస్పర ప్రయోజనం కలిగించే విధంగా టైగర్ రిజర్వ్ ప్రాంత గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించడంపై దృష్టి సారించినట్టు మంత్రి తెలిపారు. గత యేడాది 54 టైగర్ రిజర్వ్ ప్రాంతాలనుంచి 64వేలమందికి పైగా పునరావాసం కల్పించేందుకు ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలను పలు గిరిజన సంఘాలు అభ్యంతరం వ్యక్తంచేశాయి. గిరిజన పునరావాస కార్యక్రమం పూర్తిగా స్వచ్ఛందమని, పరిహారాన్ని రూ.10 లక్షలనుంచి 15 లక్షలకు పెంచామని ఎన్‌టిసిఎ సభ్య కార్యదర్శి గోబింద్ సాగర్ భరద్వాజ్ తెలిపారు. అయితే కాలానుగుణంగా ఈ పరిహారాన్ని సవరించాల్సి ఉంటుందన్నారు. సహజంగా గిరిజనులు తమ నివాస ప్రాంతాలనుంచి వైదొలగేందుకు అంగీకరించరని, అయితే వారి నైపుణ్యాలను పెంచడం ద్వారా పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లేందుకు ప్రోత్సహించాలన్నారు. కాగా పునరావాస బాధ్యతలను రాష్ట్రాలకు అప్పగించాలని పలు సంస్థలనుంచి అభ్యర్థలను వచ్చినట్టు ఎన్‌టిసిఎ అధికారి ఒకరు తెలిపారు. టైగర్ రిజర్వ్ ప్రాంతాలలో ఎన్ని గ్రామాలు ఉన్నాయి. సమీపంలో ఎన్ని గ్రామాలు ఉన్నాయో సమాచారం అందించాలని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ గత నెలలో రాష్ట్రాలను కోరింది. కాగా తాము పర్యావరణంతో మమేకమై జీవిస్తున్నామని, అక్కడనుంచి వైదొలగడం ఎంతమాత్రం ఇష్టంలేదని పలు రిజర్వ్ ప్రాంతాల ప్రజలుతెలిపారు.


SHRIRAM Finance వాహనముల బహిరంగ వేలం ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | AP21TU 0300 | KUMAR MALLA | TATA ACE | 2009 |
| 2 | AP20TB 9342 | MOHAMMED AFROZ | MAHINDER BOLERO MAXI TRUCK | 2012 |
| 3 | AP24AR 8546 | RAJU ELLANDULA | ESCORTS 439 PT | 2011 |

AUCTION DATE 15-02-2025

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED

H.No :15-1-237, Shop No. 1, 2 & 3, 2nd Floor Warangal City Center, Opp : L B College, Mulugu Road, Cell : 9989809938 & 9000298883



## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు చర్యలు

### కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/ నల్లగొండ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా గత నెల 26న పథకాన్ని ప్రారంభించిన గ్రామాలలో ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై అవగాహన నిమిత్తం శుక్రవారం కలెక్టర్ కార్యాలయావరణంలోని ఉదయాదిత్య భవన్లో సంబంధిత గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, మే)లకు సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు.ఇంటి నిర్మాణానికి తీసుకోవాల్సిన విస్తీర్ణం, చెల్లింపులు, వాడవలసిన సాంకేతిక అంశాలపై తెలియజేశారు. కొత్తగా నిర్మించిన ఇండ్లకు మాత్రమే ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెల్లింపులు చేయడం జరుగుతుందని, ఉన్న ఇంటికి కొనసాగింపుగా ఇల్లు నిర్మించినా బిల్లులు ఇవ్వడం జరగదని స్పష్టం చేశారు. గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ రాజకుమార్, ఆర్డిఓ, ఇన్చార్జి డిఆర్ఓ వై. అశోక్ రెడ్డి తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

**లబ్ధిదారుల జాబితాలు సిద్ధం చేయాలి**

ఇందిరమ్మ ఇండ్ల సర్వే ఆధారంగా అన్ని గ్రామాలలో అర్హత ఉన్న లబ్ధిదారుల జాబితాలు సిద్ధం చేయాలని ఇలా త్రిపాఠి ఎంపిడిఓ లను ఆదేశించారు. శుక్రవారం ఆమె నమూనా ఇందిరమ్మ గృహాల నిర్మాణం, గ్రామాల వారీగా అర్హులైన లబ్ధిదారుల జాబితా తయారు తదిత అంశాలపై సమీక్షించారు . ఈనెల 20 నాటికి అన్ని గ్రామాలకు సంబంధించి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాను రూపొందించాలని ఆమె చెప్పారు. గృహ నిర్మాణ శాఖ పిడి రాజకుమార్, జెడ్పి సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి, డిపిఓ వెంకయ్య, డిప్యూటీ సీఈవో శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.



## గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం

**ప్రజాపక్షం/కోదాడరూరల్:** క్రీడలతో శారీరక దృఢత్వం మానసిక ఉల్లాసం కలుగుతాయని కోదాడ రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కోదాడ మండలంలోని నల్లబండగూడెం గ్రామంలోని లింగమంతుల జాతర సందర్భంగా స్థానిక యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ క్రీడారులలో ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి క్రీడాపోటీలు దోహదం చేస్తాయని అన్నారు. క్రీడలు నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. మాజీ సర్పంచులు ఎరమాల సుశీల బెంజిమెన్, మాజీ ఎంపిటిసి క్రాంతికుమార్, అల్సగాని శరభయ్య, శరవయ్య, ముంద్రా రంగారావు, మేకల ప్రతాప్, ముంద్రా శివరామకృష్ణ, కొల్లూరి రామారావు, నేలవెల్లి నారాయణరావు, బట్టు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మోసగాళ్ళపట్ల అప్రమత్తంగా ఉండాలి




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** సైబర్ మోసగాళ్ళ పట్ల విద్యార్థిని విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని షీటీం ఎస్ఐ నీలిమా అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్‌వి ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ నేరాలపై పోలీస్ కళాబృందంతో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ షీటీం సైబర్ నేరాలపై ఘట్టి నిఘా పెట్టిందన్నారు. వారి మోసాలకు ఎవరు బలి కావద్దన్నారు. బ్యాంకు ఖాతా, ఎటిఎం వివరాలు, ఓటిపి వివరాలు ఇతరులకు తెలపవద్దన్నారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు, వేదింపులకు 100కు ఫిర్యాదు చేయాలన్నారు. ఆకతాయిలు మహిళలు, ఆడపిల్లలను వేదింపులకు గురి చేస్తే సూర్యాపేట షీటీం ఫోన్ నెంబర్ 8712686056కు ఫోన్ చేయాలన్నారు. అనంతరం పోలీస్ కళాబృందం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎఎస్ఐ సాలయ్య, మహిళ సాధికారికత జిల్లా కోఆర్డీనేటర్ చైతన్య, పోలీస్ కళాబృందం ఇన్‌చార్జీ ఎల్లయ్య, సభ్యులు గోపయ్య, నాగార్జున, విద్యార్థులు పాల్గొన్నారు.

## అమర జవాన్ల త్యాగం అపూర్వం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** దేశ రక్షణలో అమర జవాన్ల త్యాగం మరువలేనిదని సూర్యాపేట పట్టణ ఎస్ఐ వాస ప్రవీణ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుండి తెలంగాణ ఎక్స్ సెంట్రల్ ఆర్మడ్ ఫోర్స్ పర్సనల్ వెల్ఫేర్ అసోసియేషన్, వాసవి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో పల్వామాఉగ్రవాదుల దాడిలో అమరులైన వీర జవాన్ల సంస్మరణార్థం కొవ్వొత్తుల ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. 2019 ఫిబ్రవరి 14న జమ్ముకాశ్మీర్‌లోని పల్వామా ప్రాంతంలో సిఆర్‌పిఎస్ జవాన్లపై ఉగ్రవాదులు బీకర దాడికి తెగబడ్డారని అన్నారు. ఈ దాడిలో 40మంది జవాన్లు అమరులయ్యారని చెప్పారు. వీరమరణం పొందిన జవాన్ల సేవలు ప్రజలు ఎప్పటికి మరువలేరన్నారు. అనంతరం కల్నల్ సంతోష్ బాబు విగ్రహానికి నివాళులర్పించారు. సిఎపిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్‌ఎల్‌ఎన్ నాయక్, ఉపాధ్యక్షులు జెపి యాదయ్య, ప్రధాన కార్యదర్శి పి చంద్రయ్య, మాజీ సైనికులు సిహెచ్ జయరాజ్, షెక్ అబుద్ల్ ఖాదర్, ఎ నాగయ్య, ఎఎస్ఐ వి ముత్తయ్య, కె వీరయ్య, వాసవి క్లబ్ యూత్ అధ్యక్షులు వెంపటి రవితేజ పాల్గొన్నారు.

## జాతీయ కబడ్డీ పోటీలకు అయేషా ఎంపిక



**ప్రజాపక్షం/ హాలియా:** ఈనెల 15 నుంచి 18 వరకు హర్యానాలో జరిగే జాతీయ మహిళా సీనియర్ కబడ్డీ పోటీలకు తెలంగాణజట్టుకు ఆడేందుకు అయేషా ఎంపిక కావడం పట్ల రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈనెల 15వ తేదీ నుండి 18వ తేదీ వరకు హర్యానాలో జరిగే 71వ జాతీయ స్థాయి మహిళా కబడ్డీ పోటీలకు తెలంగాణ రాష్ట్ర జట్టుకు అయేషా ప్రాతినిధ్యం వహించినట్లు కోచ్ అన్వర్ ఖాన్ తెలిపారు. 71వ జాతీయ స్థాయి మహిళా కబడ్డీ పోటీల్లో పాల్గొనే జట్లకు గుజరాత్ లోని గాంధీ నగర్ లో సాయి అకాడమీలో నిర్వహించే శిక్షణకు ఖేలో ఇండియా భారత మహిళా సీనియర్ కబడ్డీ జట్టు శిక్షణ శిబిరానికి ఎంపిక కావడం పై రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయేషా ఎంపిక పట్ల పలువురు నాయకులు, క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

# సమన్వయంతో పనిచేస్తే సత్ఫలితాలు

### లింగమంతులస్వామి జాతర నిర్వహణపై అధికారులకు దిశానిర్దేశం

### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/చివ్వెంల:** శ్రీ లింగమంతులస్వామి పెద్ద గట్టు జాతరను ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి అంగరంగ వైభవంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శుక్రవారం పెద్దగట్టుపై జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ ఈనెల 16 నుండి 20 వరకు జరగనున్న జాతరకు గతం కంటే భక్తులు ఎక్కువగా హాజరయ్యే అవకాశం ఉందన్నారు. భక్తులకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 2వేలమందిపోలీసులతో పటిష్టమైన బందోబస్తు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 60 సిసికెమెరా ఏర్పాటు, మహిళల రక్షణకు షీటీంలను ఏర్పాటు చేశామన్నారు. దేవాదాయశాక శానిటేషన్ సిబ్బందిని నియమించడం జరిగిందని, షిఫ్టుకు 30మంది చొప్పున 90 మంది పారిశుధ్య సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. పనులను పర్యవేక్షించేందుకు 37మంది అధికారులను నియమించినట్లు తెలిపారు. విద్యుత్ అంతరాయం లేకుండా 110 మంది విద్యుత్ సిబ్బందిని విధులు నిర్వహించడం జరుగుతుందని, 9 లోకేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్ ద్వారా నీటిని అందిస్తామని చెప్పారు. గట్టు కింద భాగంలో 20వేల లీటర్లు, గట్టుపైన ప్రత్యేక ట్యాంక్ ఏర్పాటు చేశామని చెప్పారు. భక్తుల సౌకర్యార్థం గట్టు పరిసర ప్రాంతాలు 25చోట్ల నల్లాలు, 12చోట్ల టబ్బులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 8చోట్ల ప్రథమ చికిత్స కేంద్రాలు, మూడు అంబులెన్స్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 60 ప్రత్యేక బస్సుల ద్వారా ఆర్‌టిసి భక్తులను తరలించనున్నట్లు చెప్పారు. కలుషిత ఆహార పదార్థాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జాతరలో సమస్యలు తలెత్తిన వెంటనే సూర్యాపేట ఆర్‌డిఓ, జాతర నోడల్ అధికారికి వేణుమాధవ్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం అధికారులతో కలిసి జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. దేవాలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పోలేబోయిన నర్సయ్య యాదవ్, ఈఓ కుశలయ్య, సిపిఓ ఎల్ కిషన్ నాయక్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటాచలం, సూర్యాపేట డిఎస్‌పి రవి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, తహసీల్దార్లు శ్యాంసుందర్ రెడ్డి, క్రిష్ణయ్య, భగీరథ ఇంట్ర ఈఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**కలెక్టర్ ఆకస్మిక తనిఖీ**

**ప్రజాపక్షం/చివ్వెంల:** మండలంలోని గుంజలూరు గ్రామాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తనిఖీ చేశారు. గ్రామంలోని మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పెద్దపోలు జయమ్మ అజొల్ల పెంపకం చేపట్టడం జరిగింది. ఈ అజొల్ల పెంపకం పశువుల మేతకు దాణ కోసం ఉపయోగించడం ద్వారా పశువుల్లో పాల ఉత్పత్తి పెరగడానికి దోహదపడుతుంది.అజొల్ల పెంపకం ద్వారా పశువులకు అనేక రకాల ఉపయోగాలున్నాయి. పెంపకాన్ని కలెక్టర్ పరిశీలించిరైతులతోమాట్లాడారు.ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివే విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలనుఅడిగి తెలుసుకున్నారు. కొంతమంది విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేశారు. డిఆర్‌డిఎ పిడి అప్పారావు, డిపిఓ నారాయణరెడ్డి, ఎంపిడిఓ సంతోష్ కుమార్, ఎంపిఓ దయాకర్, ఎపిఓ నాగయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రావణి పాల్గొన్నారు.

## గెలిపిస్తే..ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి





**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:**ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని వరంగల్‌ఖమ్మంనల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పన్నాల గోపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని శ్రీ సాయి త్రివేణి డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తిలో 32 సంవత్సరాలు కొనసాగిన తనకు ఉపాధ్యాయుల సమస్యల గురించి సంపూర్ణ అవగాహన ఉందన్నారు. ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న బిల్లుల క్లియరెన్స్, ఈకుబేర్ వ్యవస్థ రద్దు చేసి ట్రెజరి శాఖ ద్వారా బిల్లుల మంజూరు, పాత విధానాలు పునరుద్ధరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 90శాతం ఖాళీగా ఉన్న డిఈఓ, డిఐఈఓల పోస్టులను ఉపాధ్యాయులకు ప్రమోషన్ ద్వారా భర్తీ చేయించేందుకు, మధ్యాహ్న భోజన పథకం అమలు అయ్యేందుకు, అందులో ఉన్న లోపాలు సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటానన్నారు.టిజెఎస్ జిల్లా కార్యదర్శి నాగేశ్వర్ రావు, నాయకులు ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నరేష్, కళాశాల ప్రిన్సిపల్ తన్నీరు ఉపేందర్ పాల్గొన్నారు.

**పదేళ్ల నుండి విద్యా వ్యవస్థ నిర్వీర్యం**

**కోదాడ:** గత పది సంవత్సరాలుగా విద్యా వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వరంగల్ ఖమ్మం, నల్లగొండ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి పన్నాల గోపాల్‌రెడ్డి అన్నారు.శుక్రవారం కోదాడ పట్టణంలోని ఎంఎస్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పోరేట్ పాఠశాలల రాకతో చిన్న చిన్న ప్రైవేట్ పాఠశాలలు దివాళా తీశాయని, ప్రభుత్వ విద్యారంగం పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. విద్యా, వైద్యం ప్రజలకు అందుబాటులో ఉండేందుకు కృషి చేయడంతో పాటు విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నానన్నారు. సూరం ప్రభాకర్‌రెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయులు స్వామి, పందిరి నాగిరెడ్డి, చిన్ని, గంగాధర్, నరేష్, ఎస్ఎస్‌రావు, ప్రసాద్, విజయ్‌భాస్కర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలో నక్ష సర్వేకై హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ ఎండి. యూసుఫ్ తెలిపారు. సర్వే ఆఫ్ ఆండియా ఏడి ఫరీదా, సర్వే జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అధికారులతో కలిసి హెలికాప్టర్ ద్వారా ట్రయల్ వేశామన్నారు. సర్వే ఆఫ్ ఇండియా,మున్సిపాలిటి,రెవెన్యూ తదితర శాఖల సంయుక్తంగా చేపట్టిన నేషనల్ జియోస్పేషియల్ బేస్డ్ ల్యాండ్‌సర్వేఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్ సర్వేకు రాష్ట్రంలోని మిర్యాలగూడతో కలిపి పది పట్టణాలకు పైలట్ ప్రాజెక్టుగా ఎంపికయ్యాయన్నారు. సేకరించిన వివరాలను మున్సిపల్ కార్యాలయ భవనంపై డీజీపీఎస్ యంత్రం నిక్షిప్తం చేసుకుంటుందన్నారు.సోమయ్య, హరీష్, అంజయ్య, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రులలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి



**ప్రజాపక్షం/యాదాద్రి :** యాదాద్రి భువనగిరి జిల్లా డీఎంహెచ్ఓ డా.మనోహర్ అధ్యక్షతన జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా ఆరోగ్య కార్యకర్తలకు సమీకృత అధిక ప్రమాదకర సమస్యలను గుర్తించుట, నిర్వహణ మరియు శిక్షణ కార్యక్రమం ఆర్మన్ స్వచంద సంస్థ వారిచే ఒక రోజు శిక్షణ కార్యక్రమము నిర్వహించారు. జిల్లా కలెక్టర్ హనుమంతురావు మాట్లాడుతూ గర్భిణీకి వచ్చేసమస్యలను ముందుగానే గుర్తించి ప్రత్యేక వైద్య నిపుణులతో పరిక్షలు నిర్వహించి ప్రభుత్వ ఆసుపత్రిలలో సాదారణ ప్రసవాలు జరిగేల చూడాలని, దినికోరకై ఆరోగ్య సిబ్బంది అందరు క్షేత్ర స్థాయిలో ప్రతి గర్భిణీని సందర్శించిపోషకఆహారం, రెగ్యులర్ చేకప్స్, వ్యాయామాలు గురించి అవగాహనా కల్పిస్తూ ప్రభుత్వ ఆసుపత్రులలో సాదారణ ప్రసవం జరిగేల ప్రోత్సహించాలని సూచించారు. ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మనోహర్ మాట్లాడుతూ అధిక ప్రమాద గర్భదారణులను తొలి నుండి చివరి వరకు సమగ్ర మార్గదర్శకాలు లేకపోవడం అదిక ప్రమాదాల పరిస్తితి, నిర్వహణలలో అరోగ్య కార్యకర్తలకు పాత్ర తెలియకపోవడం ఫలితంగా చాలా మంది మహిళలు నవజాత శిశువులు, పిల్లలకు అధిక మరణాలు, అనారోగ్యాలకు దారి తీస్తుంది. ప్రసవానంతర అరోగ్య సంరక్షణ అవసరం ఉంది అని, ఈ సంరక్షణ ప్రదాతలకు నైపుణ్యం లోటును తగ్గించడానికి మెరుగు పరచడానికి ఈ శిక్షణ మంచి అవకాశం అని, దీని ద్వార అరోగ్య కార్యకర్తలకు ఆత్మ విశ్వాసం, ధైర్యం పెరుగుతుందని బావిస్తున్నామని అన్నారు. ఇంటిగ్రేటెడ్ హైరిస్క్ ప్రేగ్నన్సి ట్రాకింగ్ అండ్ మేనేజేమేంట్ ప్రోగ్రాం వేగవంతమైన పురోగతిని సాదించాలని సూచించారు. డా.యశోద, మాతా శిశు సంరక్షణ ప్రోగ్రాం అధికారిని ఈ సమావేశం ముఖ్య ఉద్దేశ్యం, జిల్లాలో గర్భిణీస్త్రీలకి మెరుగైన సేవలు, సురక్షిత ప్రసవాలు మరియు మాతృ మరణాలు లేకుండా చేయడం, హై రిస్క్ గర్భధారణ, గుండె సంబంధిత వ్యాధులు, శ్వాస సమస్యలు, క్షయ వ్యాధి, పిల్లల పుట్టుక, సంబంధిత సమస్యలు, జ్వరం వంటి అంశాలపై తెలియజేశారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఆర్మన్ స్వచంద సంస్థ హైదరాబాద్ సిబ్బంది డాక్టర్.రోహిణి, స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్.శివకుమార్ శిక్షణకు సంబందించిన కోర్సు మెటీరియల్‌ని సరఫరా చేసి గ్రామ స్థాయిలో వారి యొక్క విధుల గురించి శిక్షణ ద్వారా తెలియజేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ శిల్పిని, హెల్త్ ఎడ్యుకేటర్లు, జిల్లాలోని మహిళా ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రక్త దానం మరొకరికి ప్రాణదానం




**ప్రజాపక్షం/యాదాద్రి :** రక్త దానం మరొకరికి ప్రాణ దానం అని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శుక్రవారం భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నిర్వహించిన రక్త దాన శిబిరానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఎంతోమంది ఆర్గాన్స్ ఇచ్చుటకు సంబంధించిన సరైన అవగాహన లేకపోవడంపై చాలామంది మరణించారు. ఈ మధ్యకాలం చాలా మందిలో అవగాహన వచ్చి రక్తదానం చేయడానికి ఎంతోమంది ముందుకొస్తున్నారు. ఈ సందర్భంగా రక్త దానం చేసే వారు ఎన్ని సార్లు రక్త దానం చేశారని జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వైద్యులు డిసిహెచ్ఎస్ రాజారం, చిన్న నాయక్ ఒక మంచి చొరవతో వైద్యులు బిజిగా ఉన్నపటికీ రక్తదానం చేస్తున్నారని, ఈరోజు ప్రత్యేకంగా డాక్టర్లు డాక్టర్ల కుటుంబాలు, ఫారా మెడికల్ సిబ్బంది, వైద్యులు, వైద్య సిబ్బంది రక్త దానం చేయడం మంచి కార్యక్రమని అన్నారు. డిసిహెచ్ఎస్ రాజారామ్ ఇది ఒక మంచి అవకాశంగా తీసుకొని ప్రభుత్వ ఆసుపత్రిలో మంచి వైద్యం, రూపు రేఖలు మార్చేందుకు ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారని, దానికి అనుగుణంగా జిల్లా కలెక్టర్‌గా తన సహాయ సహకారాలు అందిస్తానని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రక్తదానం చేసినటువంటి ప్రతి ఒక్కరికి జిల్లా కలెక్టర్ అభినందనలు తెలుపుతూ ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో జరగాలని కోరారు. ఆస్పత్రిలో బ్లడ్ షార్ట్ ఏజ్ ఉన్నందున త్వరలో పెద్ద ఎత్తున ఒక మెగా క్యాంప్ రక్తదానం శిబిరం నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు.

## విధులు బహిష్కరించిన న్యాయవాదులు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రంగారెడ్డి కోర్టులో ముద్దాయి జడ్జిపై చెప్పు విసిరిన కేసులో నిరసనగా తెలంగాణ అడ్వకేట్ అసోసియేషన్ పిలుపుమేరకు శుక్రవారం మిర్యాలగూడ న్యాయవాదులు నిరసన తెలిపి విదులు బహిష్కరించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు ఎండి.ఇబ్రహీం, కార్యదర్శి వేలాద్రి, పవన్‌కుమార్, లింగంపల్లి శ్రీనివాస్, వేణుగోపాల్, పరమేష్, శ్రీనివాస్‌రెడ్డి, పెంటారెడ్డి, రాజ్‌కుమార్, మస్తాన్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

## స్నేహ పూర్వక పోటీతత్వం అలవర్చుకోండి



**ప్రజాపక్షం/దేవరకొండ:** లక్ష్య సాధనకు యువత క్రమ శిక్షణతో స్నేహ పూర్వక పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని దేవరకొండ అడిషనల్ ఎస్పి మౌనిక అన్నారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మిషన్ పరివర్తన్ యువ తేజం సబ్ డివిజన్ స్థాయి కబడ్డీ పోటీలను ఆమె ప్రారంభించారు.ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యువత, పోలీస్ శాఖ పరస్పర సహకారంతో గ్రామాల్లో ప్రశాంతత నెలకొనే విధంగా యువతకు గ్రామీణ క్రీడలయినటువంటి కబడ్డీ క్రీడలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శరీర దృఢత్వానికి సమాజంలో గౌరవానికి దొహదపడుతుందని అన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉన్నప్పుడే జీవితంలో ఉత్తమ ఫలితాలు సాధించడంతో పాటు లక్ష్యాలను అధిగమిస్తారని మౌనిక సూచించారు. విజేతలకు నగదు, మెమోంటో అందజేశారు.మునిసిపల్ కమిషనర్ సుదర్శన్, తహశీల్దార్‌సంతోష్‌కిరణ్,ఎంపిడివోడానియల్, ఎంఈవో మాతృనాయక్, సిఐలు సురేష్, నర్సింహులు, ధనుంజయ్, ఎస్ఐలురాజు, యాదయ్య, సతీష్, నర్సింహులు, రామ్మూర్తి, ప్రజలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి వివాహిత మృతి

**ప్రజాపక్షం /మునుగోడు:** కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి వివాహిత మృ తి చెందినసంఘటన మండలంలోని ఊకోం డిలో చోటు చేసుకుంది గ్రామస్తులు, కుటు ంబ సభ్యులుతెలిపిన వివరాలప్రకారం అదే గ్రామానికి చెందిన నిమ్మల నాగరాజు తో యాదాద్రి జిల్లా జనపల్లి గ్రామానికి చెందిన మానసతో వివాహం కాగా వీరికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. భర్తతో గొడవ పడి శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు నల్గొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొం దుతూ మృతి చెందింది. పోలీసులను వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందలేదని ఎస్ఐ ఇరుగు రవి తెలిపారు.

## పోచంపల్లి చేనేత ఇక్కత్ వస్త్రాల కళా సౌరభాలు భళా

### ఆకట్టుకున్న గ్లోబల్ టెక్స్‌టైల్ ప్రదర్శన



**ప్రజాపక్షం/భూదాన్‌పోచంపల్లి :** ఢిల్లీలో జరుగుతున్న భారత్ టెక్స్ 2025, గ్లోబల్ టెక్స్‌టైల్స్ ప్రదర్శనలో పోచంపల్లి చేనేత ఇక్కత్ వస్త్రాల కళ భళా అంటూ ప్రపంచ దేశాల వ్యాపార దిగ్గజాలు ప్రశంసలు కురిపించినట్లు ఆ ఎక్స్‌పోలో పాల్గొన్న చేనేత ప్రదర్శనకారులు భోగ బాలయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత దేశంలోని అతిపెద్ద గ్లోబల్ టెక్స్‌టైల్ ఈవెంట్‌లో నిన్నటి నుండి ఈనెల 17 వరకు జరిగే ప్రదర్శనలో 110 దేశాల వస్త్రాల ఉత్పత్తుల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈవెంట్ భారత్ మండపంలో అన్ని జౌళి ఉత్పత్తులు ప్రదర్శించబడిన స్థల విస్తీర్ణం 2 లక్షల 20 చ మీ, 5000 ప్రదర్శనలు 6000 కొనుగోలుదారులు 1,20,000మంది సందర్శకులు వచ్చినట్లు తెలిపారు. 2 లక్షల.20 వేల విస్తీర్ణంలో 20వేల ఉత్పత్తులు ప్రదర్శించినట్లు 110 దేశాలకు సంబంధించిన 400 మంది వక్తలు కలిసి మెగా ఈవెంట్‌ను జరుపుతున్నట్లు వివరాలు తెలిపారు. ఇందులో భాగంగా మొదటిరోజు పోచంపల్లి డబల్ ఇక్కత్ గురించి మగ్గంపై ప్రత్యక్షంగా ఆయన డెమో ఏర్పాటు చేశారు. ఈ డెమోలో భోగ బాలయ్య వీవర్‌గా అసిస్టెంట్‌గా గంజి విజయ్ కుమార్ కలిసి ప్రదర్శనకు వచ్చిన దేశ విదేశీయులకు వర్తక వ్యాపారులకు, వక్తలకూ ప్రదర్శన, సందర్శనకారులకు చేనేత పరిశ్రమ,వస్త్రాల తయారీ,టై అండ్ డై ప్రాసెస్, పట్టుచీరల ఉత్పత్తులు తయారయ్యే అన్ని దశలను వి వరించారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఒక్క పోచంపల్లి డబల్ ఇక్కత్ చీరలు ప్రదర్శించేందుకు అవకాశం ల భించినందుకు గర్వ ంగా ఉందని ఇది మొత్త ం చేనేత పరిశ్రమకు దక్కుతుందని ఆయన అన్నారు. వీవర్స్ సర్వీస్ సెంటర్ హైదరాబాద్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో చేనేత పరిశ్రమకు ప్రత్యేక గుర్తింపు లభించిందని ప్రపంచ దేశాలలో చేనేత వస్త్రాలకు చాలా ప్రాధాన్యం ఉందని అన్నారు. చేనేత వస్త్రాల పనితీరును రంగుల అద్దకాన్ని కళా నైపుణ్యాన్ని అందరూ మెచ్చుకున్నారని తెలిపారు. ఈ ప్రదర్శనలో తానే స్వయంగా పదివేల షెడ్స్ రంగులతో డబుల్ ఇక్కత్ మగ్గంపై నేసిన వస్త్రం, జాతీయ జెండా ప్రదర్శించినందుకు చాలా విదేశాల నుంచి వచ్చిన సందర్శకులువిశేషంగా అభినందించినట్లు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రదర్శనలు దేశ విదేశీ విదేశాల నుండి వచ్చిన వస్త్ర ఉత్పత్తుల కంపెనీలు వర్తకులు వక్తలు తమ వృత్తి పట్ల పనితీరు పట్ల చేనేత కళపట్ల అభినందనలు తెలిపిన తీరుతో భవిష్యత్తులో మరిన్ని కళాత్మక చేనేత డబల్ ఇక్కత్ వస్త్రాలను తయారు చేస్తామన్న ప్రోత్సాహం లభించిందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు చేనేత పరిశ్రమపై ఆధారపడుతున్న ప్రతి ఒక్కరూ ఆయనను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## 16 నుండి లింగమంతులస్వామి జాతర



**ప్రజాపక్షం/ సూర్యా పేట:** భ క్తుల దర్శన సౌకర్యం కల్పి స్తూ పోలీసుల విధు లు ఉంటా యని జిల్లా ఎస్ పి సన్ ప్రీత్ సింగ్‌అన్నారు. ఈనెల 16 నుండి 20వ తేదీ వరకు జరి గే శ్రీ లింగమంతులస్వామి(పెద్దగట్టు) జాతర సందర్భంగా పోలీసు భద్రతపై శుక్రవారం ఆయ న మీడియాతో మాట్లాడారు. ప్రతి ఒక్క భక్తునికి రక్షణ కల్పిస్తూ దైవ దర్శనం జరిగేలా చూస్తామన్నారు. దొంగతనాల నివారణకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రద్దీ ఎక్కువగాఉన్నందున భక్తులు విలువైన వస్తువులు వెంట తీసుకురావద్దని చెప్పారు. సెల్ ఫోన్లు జాగ్రత్తగా ఉంచుకోవాలని, యువతులు, మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పిల్లలు, వృద్దులు వంటరిగా జాతరకు రావద్దని సూచించారు. అత్యవసర సమయాల్లో పోలీసులు అందుబాటులో ఉంటారని పోలీస్ కంట్రోల్ రూం హెల్ప్ లైన్ సెంటర్లను సంప్రదించాలని కోరారు.

**జాతరకు 60 ప్రత్యేక బస్సులు**



**సూర్యాపేట టౌన్:** శ్రీ లింగమంతులస్వామి( పెద్దగట్టు) జాతరకు భక్తుల సౌకర్యార్థం సూర్యాపేట డిపో నుండి ప్రత్యేకంగా 60 బస్సులను నడుపుతున్నట్లు టిజిఎస్ ఆర్‌టిసి నల్లగొండ రిజినల్ మేనేజర్ కె జాన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈనెల 16తేదీ తెల్లవారుజాము నుండి 20వ తేదీ వరకు జాతర కొనసాగనున్నందున వివిధ ప్రాంతాల నుండి వచ్చే లక్షలాది మంది భక్తులను పెద్దగట్టుకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పెద్దగట్టు జాతరకు సూర్యాపేట నుండి టికెట్ ధర పెద్దలకు రూ. 40, పిల్లలకు రూ. 20లు ఉంటుందని చెప్పారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలనాలని కోరారు. ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణం సురక్షితం, సుఖవంతమని చెప్పారు.

## ప్రాథమిక సహకార సంఘాల సభ్యుల పదవీ కాలం మరో 6నెలలు పొడిగింపు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సహకార సంఘాలను మరింత బలోపేతం చేసే చర్యల్లో భాగంగా పదవీ కాలం ముగిసిన సభ్యుల పదవీ కాలాన్ని మరో 6 నెలల పాటు పొడిగిస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతమున్న 904 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో ఒక్క సంగెం ప్రాథమిక సహకార సంఘం తప్ప మిగిత సభ్యుల పదవి కాలం శుక్రవారం ముగిసిపోవడంతో వీరి పదవికాలాన్ని మరో 6 నెలల పాటు ప్రభుత్వం పొడిగిస్తు ప్రభుత్వం జిఓ నంబర్ 74ను విడుదల చేసిందని మంత్రి తెలిపారు. అదేవిధంగా ప్రాథమిక సహకార సంఘాల సేవలను రైతులకు మరిత మెరుగైన సేవలను అందించాలనే లక్ష్యంతో పాటు జిల్లాల పునర్విభజన ఫలితంగా వీటిని పునర్విభజన చేయ్యాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందులోభాగంగా అన్ని జిల్లాల సహకార అధికారులతో జిల్లా స్థాయిలో సమావేశాలు నిర్వహించి, సహకార సంఘాల పునర్విభజన కొరకు ప్రతిపాదనలు పంపించాల్సిందిగా ఆదేశించామ, ఈ ప్రక్రియ పూరైయ్యేందుకు కొంత సమయం పట్టనుండడతో సహకార సంఘాల పదవీకాలం ముగిస్తున్న సభ్యుల పదవీకాలాన్ని మరో 6 నెలలు లేక, తదుపరి ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చేదాకా పొడిగిస్తూ ప్రభుత్వ జిఓనంబర్ 74ను జారీ చేసిందని తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో ఉన్న 9 డిసిసిబిల పదవీకాలం ఈ నెల 24తో టిజిక్యాబ్ కమిటీ సభ్యుల పదవీకాలం మార్చి4 వతేదీతో ముగనున్నాయని మంత్రి తెలిపారు.

# పార్టీ కోసం కష్టపడితేనే పదవులు

నాయకుల చుట్టూ తిరిగితే రావు
పోరాడిన వారందరికీ స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్లు



**న్యూఢిల్లీ :** పార్టీ కోసం పోరాడిన అందరికి స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్లు ఇస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత ఎక్కువగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రతి పేదవాడు ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5లక్షలు ఇస్తున్నామని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత యూత్ కాంగ్రెస్‌పై ఉందని సిఎం తెలిపారు. గాంధీభవన్‌లో శుక్రవారం జరిగిన యువజన కాంగ్రెస్ నేతల ప్రమాణస్వీకార కార్యక్రమానికి రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 37 కార్పొరేషన్లకు చైర్మన్లు, అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమించామని, పార్టీలో కష్టపడితే తప్పకుండా ఫలితం ఉంటుందని, పార్టీ కోసం కష్టపడకుండా కేవలం నాయకుల చుట్టూ తిరిగితే మాత్రం పదవులు ఉండవని వెల్లడించారు. గల్లీ నుంచి పోరాడితేనే ఢిల్లీ వరకు ఎదిగే అవకాశం వస్తుందని, కేవలం డబ్బులతోనే రాజకీయాల్లో విజయం సాధిస్తామని అనుకోవద్దని అన్నారు. డబ్బుతోనే గెలిచేది ఉంటే కెసిఆర్‌కు వంద సీట్లు వచ్చి ఉండేవని, కెసిఆర్ లారీల్లో డబ్బు తరలించినా బిఆర్‌ఎస్‌ను ప్రజలు ఓడించారని, ప్రజల్లో ఉండి సమస్యలపై పోరాడితేనే ప్రజలు ఆదరిస్తారని రేవంత్ రెడ్డి వివరించారు. పదేళ్లు ప్రజలను పట్టించుకోని బిఆర్‌ఎస్ నేతలు, ఇప్పుడు ఊర్ల మీద పడ్డారని ఎద్దేవా చేశారు. తొలి ఏడాదిలోనే 55 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని గుర్తుచేశారు. తొలి ఏడాదిలోనే రూ.2 లక్షల రుణమాఫీ చేసి చూపించామని, తొలి ఏడాదిలోనే 26 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసి చూపించామని, ఎస్సీ వర్గీకరణ కోసం 35 ఏళ్ల పోరాటం జరిగిందని, ఎందరో ప్రాణాలు అర్పించారని పేర్కొన్నారు. ఇప్పుడు ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తున్న తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని అన్నారు. సోషల్ మీడియాలో విపక్షాలు చేసే తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు సహకరించట్లేదని సిఎం రేవంత్ రెడ్డి విమర్శించారు.
బిహార్, గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్‌కు తప్ప ఎవరికీ నిధులు ఇవ్వట్లేదని ఆరోపించారు. రాష్ట్రానికి ఏమీ సాధించని కిషన్‌రెడ్డి, బండి సంజయ్ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మెట్రో ప్రాజెక్టు దస్త్రాన్ని ఢిల్లీకి పంపితే ఇంతవరకు ఆమోదించలేదని, తాము సొంతంగా చేసుకుంటామని చెప్పినా, మెట్రోకు ఆమోదం తెలుపలేదని అన్నారు. ట్రిపుల్ ఆర్‌ను సగం ఆమోదించి సగం పక్కకు పెట్టారని తెలిపారు.

## సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ కూల్చివేత

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర రాజధానికి తలమానికంగా ఉన్న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ భవనాలు నేలమట్టమయ్యాయి. ఆధునికీకరణ పనుల్లో భాగంగా.. 1952లో కట్టిన సికింద్రాబాద్ స్టేషన్ ప్రధాన భవనాలను రైల్వే శాఖ అధికారులు గురువారం కూల్చివేశారు. దీంతో అప్పటి కళలు, సంస్కృతి ఉట్టిపడేలా నిర్మించిన ఈ కట్టడం గత స్మృతిగా మిగిలింది. 1874లో అప్పటి నిజాం నవాబు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ను నిర్మించారు.



## ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో.. ఇంజనీరింగ్ కోర్సులు

మంత్రి శ్రీధర్‌బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంజనీరింగ్ కోర్సులను ప్రారంభించబోతున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి, ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు శ్రీధర్ బాబు అన్నారు. గత 46 రోజుల నుంచి హైదరాబాద్ నాంపల్లిలో జరుగుతున్న ఎగ్జిబిషన్ ముగింపు వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీధర్‌బాబు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ లో విద్యాభివృద్ధికి ఎగ్జిబిషన్ సొసైటీ చేస్తున్న కృషిని అభినందించారు. సొసైటీ ఆధ్వర్యంలో 20 విద్యా సంస్థలు నడుస్తున్నాయని, ప్రస్తుతం డిప్లొమా కోర్సులు మాత్రమే ఉన్నాయన్నారు. గతేడాది ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవం లో సిఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినట్లుగా.. ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంజనీరింగ్ కోర్సులను కూడా ప్రారంభించబోతున్నామన్నారు. 46 రోజుల్లో 17.46 లక్షల మంది ఎగ్జిబిషన్ ను సందర్శించారు. 2వేల స్టాల్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. వాస్తవానికి జనవరి 1 నుంచి ఎగ్జిబిషన్ ప్రారంభం కావాల్సి ఉండగా.. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కి నివాళిగా రెండు రోజులు ఆలస్యంగా ప్రారంభించామని తెలిపారు. ఎగ్జిబిషన్ నిర్వహణలో తలెత్తుతున్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తున్నామన్నారు. ఈ ఏడాది ఎగ్జిబిషన్ విజయవంతంగా నిర్వహించామని, ఇందుకు సహకరించిన ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యులు, పోలీసులు, ఇతర ప్రభుత్వ అధికారులకు ఆయన ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

## రానున్న బడ్జెట్‌లో వ్యవసాయానికి పెద్దపీట

డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రానున్న బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ప్రస్తుత 202425 ఆర్థిక బడ్జెట్‌లో ఈ రంగానికి పెద్ద మొత్తంలో నిధులను కేటాయించామని, వచ్చే ఆర్థిక బడ్జెట్‌లో కూడా ఇదే విధానాన్ని కొనసాగిస్తామన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో శుక్రవారం జరిగిన వ్యవసాయ, చేనేత, హస్త కళల శాఖల ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ 6 గ్యారంటీల్లో భాగంగా రైతులకు పెట్టుబడి సాయంగా అందిస్తున్న రైతు భరోసాను కొనసాగిస్తామని, ఇందుకు సంబంధించి బడ్జెట్‌లో ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఉద్యాన పంటల విస్తీర్ణం పెంపుపై దృష్టి సారించాలని మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల అధికారులను ఆదేశించారు. సాధారణ పంటలతో పోలిస్తే ఉద్యాన పంటలతో వచ్చే ఆదాయం మూడు రేట్లు ఉంటుందని, ఫలితంగా రాష్ట్రం ఆర్థికంగా వృద్ధి మరింత పెరుగుతుందని వివరించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ పూలు, కూరగాయలు, ఆయిల్ ఫామ్ వంటి ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. జల వనరులను సంరక్షించడంతో పాటు, పంట ఉత్పత్తులు పెరిగేందుకు ఉపయోగపడే డ్రిప్, స్ప్రింక్లర్లు సబ్సిడీపై రైతులకు అందజేయాలని సూచించారు.
చేనేత కార్మికులకు సబ్సిడీపై నూలు, విద్యుత్ సౌకర్యం వంటి పథకాలు కొనసాగించాలన్నారు. రాష్ట్రంలో టెక్స్ టైల్ పార్కుల అభివృద్ధికి కావాల్సిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి రఘునందన్ రావు, చేనేత శాఖ ముఖ్యకార్యదర్శి శైలజ రామాఅయ్యర్, ఆర్థిక శాఖ జాయింట్ డైరెక్టర్ హరిత, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి తదితరులు పాల్గొన్నారు.

## అక్కంపల్లి ఘటనపై ఆందోళన వద్దు

జలమండలి అధికాల వివరణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నల్లగొండ జిల్లాలోని పిఏ పల్లి మండలం పరిధిలోని అక్కంపల్లి బాలెన్సింగ్ రిజర్వాయర్‌లో చనిపోయిన కోళ్లను వేసినట్లు శుక్రవారం ఉదయం నుంచి సోషల్ మీడియా వేదికగా ప్రచారం జరిగింది. దీనిపై జలమండలి స్పందించింది. ఈ ఉదయం రిజర్వాయర్ లో చనిపోయిన కోళ్లను స్థానికులు గుర్తించి వివిధ ప్రభుత్వ విభాగాలకు సమాచారం అందించడంతో జిల్లా యంత్రాంగంతో పాటు పోలీసు, రెవెన్యూ, జలమండలి అధికారులు అప్రమత్తమై స్థలాన్ని పరిశీలించారు. జలమండలి క్వాలిటీ అస్యూరెన్స్ అండ్ టెస్టింగ్ వింగ్ (క్యూఏటీ) అధికారులతో పాటు ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపిఎం), థర్డ్ పార్టీ లూసిడ్ సంస్థ కోదండపూర్ నీటి శుద్ధి కేంద్రాలను సందర్శించి, నీటి నమూనాలను సేకరించారు. ప్రాథమికంగా ఎలాంటి అవశేషాలు గుర్తించలేదని తెలిపారు. ఈ ఘటనపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఐఎస్ ప్రమాణాలతో మూడంచెల క్లోరిన్ ప్రక్రియ ద్వారా నీటి సరఫరా జరుగుతుందని అధికారులు చెప్పారు.

**ప్రతి గంటకు నీటి ప్రమాణాలు పరీక్షిస్తాం : జలమండలి ఎం.డి. అశోక్ రెడ్డి**

వచ్చే వారం రోజుల పాటు ప్రతి గంటకూ నీటి ప్రమాణాలను పరీక్షిస్తామని జలమండలి ఎం.డి. అశోక్ రెడ్డి వెల్లడించారు. నీటి సరఫరాలో జలమండలి ఇప్పటికే మూడంచెల క్లోరినేషన్ ప్రక్రియ పద్ధతిని అవలంబిస్తుందన్నారు. మొదటి దశలో నీటి శుద్ధి కేంద్రాల (డబ్ల్యూటిపి) వద్ద, రెండో దశలో మెయిన్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల (ఎంబిఆర్) వద్ద, చివరగా సర్వీస్ రిజర్వాయర్ల వద్ద బూస్టర్ క్లోరినేషన్ ప్రక్రియ జరుగుతుందని చెప్పారు. దీంతో పాటు ప్రజలకు సరఫరా అవుతున్న నీటిలో కచ్చితంగా 0.5 పిపిఎం క్లోరిన్ ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నగర ప్రజలకు శుద్ధమైన నీరు అందించేందుకు ఇండియన్ స్టాండర్డ్ (ఐఎస్ 105002012) ప్రమాణాల్ని పాటిస్తూ, శాస్త్రీయంగా తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలనూ తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అశోక్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## కులగణన పేరుతో కుటిల రాజకీయం

మాజీ మంత్రి హరీశ్‌రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కులగణన పేరుతో కుటిల రాజకీయం చేస్తే తగిన మూల్యం చెల్లించు కోక తప్పదని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. కులగణన సర్వే ఉత్త ఎన్నికల జిమ్మిక్కు అని, అదొక ఫెయిల్యూవర్ మ్యాజిక్ అని ఎద్దేవా చేశారు. ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో ఫ్యాక్షన్ వాతావరణాన్ని సృష్టించే ప్రయత్నాలు ఎప్పటికీ సఫలం కాబోదని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుందని, సిఎం నోరే ఆయన రాజకీయ జీవితానికి ఉరిగా మారబోతుందన్నారు. తెలంగాణను ఆవిష్కరించిన కెసిఆర్‌ను బహిష్కరించడం సాధ్యం కాదని,సిఎం నిష్క్రమణకు సమయం దగ్గర పడుతున్నదని పేర్కొన్నారు.



**ఉమ్మడి ఎపి తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య చిత్రపటానికి సిఎం ఘన నివాళి**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జూబ్లీహిల్స్‌లోని నివాసంలో సంజీవయ్య చిత్రపటానికి సిఎం రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. సంజీవయ్యకు నివాళులు అర్పించిన వారిలో సిఎం సలహాదారుల వేం నరేందర్ రెడ్డి, కార్పొరేషన్ ఛైర్మన్లు పటేల్ రమేష్ రెడ్డి, మానాల మోహన్ రెడ్డి, ఎంఎల్‌ఎలు రాజేందర్ రెడ్డి, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఎడ్యుకేషన్ కమిషన్ సభ్యులు చారగొండ వెంకటేశ్, మాజీ ఎంఎల్‌ఎ సంపత్ కుమార్‌లు ఉన్నారు.

## ఫోటోగ్రఫీ డిప్లొమా కోర్సు ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నిరుద్యోగులకు ఉపాధి కల్పించే లక్ష్యంగా తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ, రాష్ట్ర ప్రభుత్వం, సిగ్మా అకాడమీ అఫ్ ఫోటోగ్రఫీ సంయుక్త ఆధ్వర్యంలో ఉచితంగా ఫోటోగ్రఫీ డిప్లొమా కోర్సు నిర్వహిస్తున్నామని అకాడమీ చైర్మన్ ఎసిశేఖర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. యువత ఫోటోగ్రఫీ నేర్చుకొని, ఉపాధికోసం వృత్తిగా స్వీకరించడానికి ఉత్సాహంగా ఉన్నట్లయితే, వారు ఈ సమగ్ర ఉచిత ఫోటోగ్రఫీ డిప్లొమా కోర్సును పూర్తి చేసిన తర్వాత ఉపాధి పొందవచ్చునని తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించే ఈ ఆరు నెలల ఉచిత ఫోటోగ్రఫీ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి ఫోటోగ్రఫీ అభిరుచి గలవారు లేదా వృత్తిగా స్వీకరించేవారు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. మాట్లాడుతూ ప్రాథమిక ఫోటోగ్రఫీ తోపాటు వెడ్డింగ్, ఇండస్ట్రియల్, ఫాషన్, పిక్టోరియల్ షూటింగ్ నైపుణ్యాలను, అధునాతన సాంకేతికతలు, కంపొజిషన్, లైటింగ్, ఫ్రేమ్మింగ్ లలో కలిగిన అధ్యాపకులచే శిక్షణ ఇవ్వబడుతుందని, 4వ బ్యాచ్ ఉచిత ఫోటోగ్రఫీ డిప్లొమా కోర్సు మార్చి 15 నుండి శిక్షణ తరగతులు ప్రారంభమౌతాయని, ఆసక్తి గల అభ్యర్థులు 8008021075 7095692175 నెంబర్లపై ఉదయం 9 నుండి సాయంత్రం 6 గంటలలోపు సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోగలరని,ఆన్లైన్‌లో రిజిస్టర్ చేసుకునే వారు. https://sapindia. org/diplomacourse/ ఈ లింక్ ద్వారా చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తులకు ఆఖరు తేదీ ఈనెల 25 అని ఎం.సి.శేఖర్ ఒక ప్రకటనలో వెల్లడించారు.



**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాదిగ మేధావుల ఫోరం ప్రతినిధుల సన్మానం**

ఎస్‌సి రిజర్వేషన్ వర్గీకరణ ప్రక్రియను ప్రారంభించినందుకు మాదిగ మేధావుల ఫోరం ప్రతినిధులు శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వర్గీకరణ ప్రక్రియను వేగవంతం చేయడంలో చూపిన చొరవకు సిఎంకు వారు ధన్యవాదాలు తెలిపారు. సిఎంను కలిసిన వారిలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, ఒయు విసి ప్రొఫెసర్. ఎం.కుమార్, ఒయు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్. సి.కాశీం, ప్రొఫెసర్. గడ్డం మల్లేశం, ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్ ,తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ సభ్యుడు డాక్టర్ చారకొండ వెంకటేష్ ఉన్నారు.

## నేడు అమెరికా నుంచి మరో బృందం రాక

**ఛండీగఢ్ :** అక్రమంగా అమెరికాలో నివసిస్తున్న మరో 119మంది వలసదారులతో కూడిన అమెరికా విమానం శనివారం అమృతసర్ విమానాశ్రయం చేరుకోనున్నది. గత నెలలో డొనాల్డ్ పదవీ స్వీకారం చేసిన అనంతరం అక్రమ వలసల అణచివేతలో భాగంగా చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో స్వదేశానికి చేరుకోనున్న రెండో భారత బృందం ఇది. అమెరికా విమానం శనివారం రాత్రి 10 గంటలకు అమృత్‌సర్ చేరుకుంటుందని అధికారులు తెలియజేశారు. ఈ వలసదారులలో 67మంది పంజాబ్‌కు, 33మంది హర్యానాకు, 8మంది గుజరాత్‌కు, ముగ్గురు ఉత్తరప్రదేశ్‌కు, ఇద్దరు చొప్పున గోవా, మహారాష్ట్ర, రాజస్థాన్‌కు, ఒక్కొక్కరు హిమాచల్ ప్రదేశ్, జమ్ము–కశ్మీర్‌కు చెందినవారని అధికారులు తెలిపారు. భారత వలసదారులతో కూడిన మరో విమానం 16వ తేదీన రావచ్చని భావిస్తున్నారు. గతవారం 104మంది భారత వలసదారులతో కూడిన అమెరికా విమానం అమృత్‌సర్ చేరుకున్న విషయం తెలిసిందే. తమ కుటుంబానికి మెరుగైన జీవనం అందించేందుకు అమెరికాకు వలస వెళ్లామని, అయితే సరిహద్దుల్లో తమను గుర్తించి తిరిగి స్వదేశానికి పంపించారని, అయితే గెంటివేత సందర్భంగా తమకు సంకెళ్లు వేశారని పలువురు వలసదారులు తెలిపారు. లక్షల రూపాయలు ఖర్చు పెట్టకుని అక్రమ మార్గాలలో అమెరికాలో ప్రవేశించిన భారతీయులు ఇపుడు బహిష్కరణకు గురయ్యారు. కాగా అమెరికా విమానం అమృత్‌సర్‌లో దిగడాన్ని పలువురు పంజాబ్ రాజకీయ నాయకులు ప్రశ్నిస్తున్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పంజాబ్‌ను అప్రతిష్టపాలు చేసేందుకే అమెరికా విమానాలను అమృత్‌సర్‌లో దింపుతోందని, గుజరాత్, హర్యానా, ఢిల్లీలో ఎందుకు అనుమతించడం లేదని పంజాబ్ ఆర్థికశాఖ మంత్రి హర్పల్ సింగ్ చీమ ప్రశ్నించారు. పంజాబ్‌నుంచి అమెరికాకు అక్రమంగా వలసపోయే వారిని గుర్తించేందుకు పంజాబ్ ప్రభుత్వం ఇటీవల ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని( సిట్) ఏర్పాటుచేసింది. ఈ నేపథ్యంలో బహిష్కరణకు గురైన వలసదారులు అందించిన సమాచారంతో అక్రమ వలసలను ప్రోత్సహిస్తున్న 10 సంస్థలపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.



**ప్రతిభను కనబర్చిన అధికారులకు క్యాష్ రివార్డులు, ప్రతిభ ప్రశంసా పత్రాలు**

ఇటీవల నిజామాబాద్‌లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు 90 కిలోల గంజాయి, కారును పట్టుకోవడంలో ప్రతిభను కనబర్చిన అధికారులకు నాంపల్లిలోని ఆబ్కారీ భవన్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్‌రెడ్డి శుక్రవారం క్యాష్ రివ్వార్డులు, ప్రతిభ ప్రశంసా పత్రాలను అందజేశారు. అవార్డులు అందుకున్న వారిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ పి.స్వప్న, ఎస్ఐ బి. రాముకుమార్, కానిస్టేబుళ్లు ఎం.ఎ.హమీద్, కె. అవినాష్, కె.మంజుల, పి.సందీప్, ఎం.సందీప్‌లు ఉన్నారు.

## అప్పలతో కెసిఆర్ ఆస్తులను సృష్టించారు

బోయినపల్లి వినోద్ కుమార్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పదేళ్ల కెసిఆర్ పాలనను కేంద్రమంత్రి సీతారామన్ చాలా చిన్నచూపుతో మాట్లాడారని, కెసిఆర్ అప్పులు చేసి వృధాగా ఖర్చు చేయలేదని, ఆస్తులను సృష్టించారని బిఆర్‌ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంఎల్‌సి సత్యవతిరాథోడ్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ సమ్మక్క సారక్క యూనివర్సిటీ తెలంగాణ హక్కు అని, ఆ పేరును కూడా కెసిఆరే పెట్టారని, కేంద్ర మంత్రి సీతారామన్ చేసింది ఏమిటని ప్రశ్నించారు.తెలంగాణ తలసని ఆదాయం , తెలంగాణకు సొంత రాబడి ఐదు రెట్లు పెరిగిన విషయాన్ని నిర్మల సీతారామన్ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఆమె రెండు రోజులు తెలంగాణ పర్యటనకు వస్తే ఇక్కడి అభివృద్ధి తెలుస్తుందన్నారు. విభజన చట్టంలోని తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చిన హమీలు పెండింగ్‌లోనే ఉన్నాయని, ముందుగా వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ తాను తెలుగు రాష్ట్రాల కోడలిని అంటూనే కేంద్ర మంత్రి సీతారామన్ తెలంగాణను అవమానించేలా మాట్లాడారని మండిపడ్డారు.

## మానవ అక్రమ రవాణా నిర్మూలించడం అందరి బాధ్యత

సెర్ప్ సిఇఒ దివ్య దేవరాజన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మనుషుల అక్రమ రవాణా నిర్మూలనలో ప్రజలు అందరూ భాగస్వామ్యం అయినప్పుడే సమూలంగా నివారించవచ్చు అని సెర్ప్ సిఇఒ దివ్య దేవరాజన్ అన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శుక్రవారం ప్రారంభమైన రెండు రోజుల శిక్షణ కార్యక్రమానికి దేవరాజన్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ... మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచం వ్యాప్తంగా అత్యంత వేగంగా విస్తరిస్తూ ఎంతో మంది అమ్మాయిల జీవితాలను నాశనం చేస్తుందన్నారు. దీనికి పేద మధ్య తరగతి అమ్మాయిలు, మహిళలు ఎక్కువగా గురి అవుతున్నారన్నారు. సమాజంలో ప్రజలతో సన్నిహితంగా ఉండే సెర్ప్ మహిళా సంఘం సభ్యులు వారి ఆర్థిక సామజిక స్థితి గతులను గమనించి వారికి అవగాహనా కల్పించాలని సూచించారు. ప్రజ్వల సంస్థ వ్యవస్థాపకులు పద్మశ్రీ అవార్డు గ్రహిత సునీత కృష్ణన్ మాట్లాడుతూ.. మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాను ఆదిలోనే అడ్డుకుంటే మన ఆడపిల్లలను రక్షించు కోవవచ్చున్నారు. ప్రజ్వల సంస్థ ద్వారా ఇప్పటి వరకు 30 వేల మంది అమ్మాయిలను మహిళలను కాపాడడం జరిగిందని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సెర్ప్ డైరెక్టర్ సునీత, ప్రాజెక్ట్ మేనేజర్ సరిత, ఎపిఎం అరుంధతి, డిపిఎం సురేఖ రెడ్డి, ప్రజ్వల జూనియర్ డైరెక్టర్ అహ్మద్ ఆలీ, ప్రాజెక్ట్ మేనేజర్ బలరామ కృష్ణ, సురేష్ కుమార్, అంబర్ సింగ్, మితాళి రాజ్, స్రవంతి మరియు ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్, పెద్దపల్లి, ములుగు, భూపాల్ పల్లి జిల్లాల నుండి డిపిఎంలు,ఎపిఎంలు,విఒఎలు పాల్గొన్నారు.

## వరద నీటి వ్యవస్థపై ఎఐ సాయంతో సర్వే

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్‌లో వరద నీటి వ్యవస్థపై ఎఐ సాయంతో సర్వే చేయాలని మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) నిర్ణయించింది. నగర వ్యాప్తంగా పూర్తి స్థాయిలో వరద నీటి వ్యవస్థను గుర్తించనున్నారు. ప్రధాన రహదారులు, కాలనీలు, భూగర్భ వరదనీటి వ్యవస్థ, పైకప్పు ఉన్నవి, లేని నాలాలతో పాటు చెరువులను జియోట్యాగ్ చేయనున్నారు. నూటికి నూరుశాతం కచ్చితత్వంతో గుర్తించేందుకు జిహెచ్‌ఎంసి ఐటి విభాగం సన్నాహాలు పూర్తి చేసింది. ఇందుకోసం డిఫరెన్సియల్ గ్లోబల్ పొజిషనింగ్ (డిజిపిఎస్) విధానం ద్వారా సాంకేతికతను వినియోగించనున్నారు. మొబైల్ యాప్ ద్వారా సర్వే జరగనుందని, ఆర్క్ జిఐఎస్ పేరుతో ఇప్పటికే యాప్‌ను రూపొందించారు. ప్రయోగాత్మకంగా ఐదు డివిజన్‌లలో శనివారం నుంచి ఈ సర్వే జరగనుంది. లోటుపాట్లను పరిశీలించిన అనంతరం నగర వ్యాప్తంగా 150 డివిజన్‌లలో విస్తృతంగా



సర్వే చేపట్టనున్నారు. ఈ నెలాఖరు నాటికి వివరాలను సేకరించాలనే యోచనలో జిహెచ్‌ఎంసి ఉన్నతాధికారులు ఉన్నారు. నగర వ్యాప్తంగా ప్రైవేట్, ప్రభుత్వ ఆస్తులకు సంబంధించి జిహెచ్‌ఎంసి జిఐఎస్ సర్వే చేస్తోంది. ఈ సర్వే ద్వారా ఇప్పటికే 7 లక్షల ఆస్తుల వివరాలను యంత్రాంగం సేకరించింది. ఈ సర్వే ద్వారా కేవలం ఆస్తి పన్ను చెల్లింపుదారులకు సంబంధించిన ఆస్తులనే కాకుండా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులతో పాటు వాటి అంతస్తులు, నీటి, విద్యుత్ కనెక్షన్, నాలాలు, రహదారులు, పార్కులు, ప్లే గ్రౌండ్‌లు, చెరువులు, మరుగుదొడ్లు తదితర సమగ్ర సమాచారాన్ని సేకరిస్తున్నారు. సమగ్ర నాలా నెట్ వర్క్ సేకరించడం ద్వారా భవిష్యత్‌లో తలెత్తే వరద ముంపు విపత్తులను సులభతరంగా అధిగమించేందుకు, ముందస్తు చర్యలు చేపట్టేందుకు ఈ సమాచార సేకరణ ఉపయోగపడుతుందని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. వర్షపాతం ఆధారంగా భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నాలాల విస్తరణ, భూగర్భ వరద నీటి నిర్వహణకు ఉపయోగపడుతుందంటున్నారు. జిఐఎస్ ఇళ్ల సర్వేలో జిహెచ్‌ఎంసి నగరం మొత్తాన్ని ఇప్పటికే డ్రోన్‌లతో సర్వే చేపట్టింది. గూగుల్ పటం కన్నా స్పష్టంగా అందులో నగర భౌగోళిక స్వరూపం నమోదు చేసింది. వీటి ఆధారంగా భవిష్యత్ అభివృద్ధి పనులు చేపట్టేందుకు మార్గం సుగమం అవుతోంది.

## విధులు పట్ల అలసత్వం వహిస్తే చర్యలు

మండల అభివృద్ధి అధికారి తిరుపతి అన్న



ప్రజాపక్షం/ఉండవెల్లి : అధికారులు గ్రామాల్లో విధులు నిర్వహణలో నిర్ల క్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని మండల అధికారి తిరుపతి అన్న అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో చెత్త చెదారం లేకుండా కాలనీలు పరిశుభ్రంగా ఉండాలని వారు ఆదేశించారు. గ్రామాల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చూడాలన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్ కుమార్ ఆదేశాల మేరకు స్థానికంగా గ్రామాల్లో ఉండి ఎప్పటి సమస్యలపడు పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ భాస్కర్ పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

ప్రజాపక్షం/బిజినేపల్లి : అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన సంఘటన ఖానాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు తలారి చెన్నమ్మ(50)సుల్తాన్ భార్యాభర్తలు, పంట పొలంలో వేసిన మొక్కజొన్న పంటకు సాగు నీరు అందించేందుకు వెళ్లిన సుల్తాన్ ఇంటికి రాగానే అపస్మారక స్థితిలో ఉన్నది. వెంటనే చెన్నమ్మను ఆసుపత్రికి తరలించారు. అనంతరం చికిత్స పొందుతూ మృతి చెందిన చెన్నమ్మ ఒంటిపై గాయాలు ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపైకేసునమోదు చేసుకుని ఎస్ఐ విచారణ చేపట్టినట్లు తెలిపారు.

## సరిహద్దులో ముమ్మరంగా తనిఖీలు

ప్రజాపక్షం/ఉండవెల్లి : ఆంధ్ర కర్ణాటక మహారాష్ట్ర ప్రాంతాల నుండి వచ్చే కోళ్ల వివరణ చర్యల కోసం 44వ జాతీయ రహదారి మీదుగా పుల్లూరు టోల్ ప్లాంట్ దగ్గర చెక్‌పోస్టు ను ఏర్పాటు చేశారు. అనంతరం రహదారి వెంట వచ్చే వాహనాలను తనిఖీలు చేపడు తున్నట్లు పశువైద్యాధికారి శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

## బాధితులకు అండగా ఉంటా : ఎమ్మెల్యే



ప్రజాపక్షం/ మక్తల్ : మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో గతంలో సుభాని అనే వ్యక్తి కొంత మంది దగ్గర నుండి ఎక్కువ వడ్డీ ని ఆశ చూపి, వారితో దాదాపుగా 150 కోట్లు తీసుకొని, ఎగ్గొట్టి మోసం చేశాడు. వారిని కర్నూల్‌లో పోలీసులు అదు పులోకి తీసుకున్నారు. మక్తల్ నియోజకవర్గానికి చెందిన బాధితులు నేడు పోలీస్‌స్టేషన్‌లో ఆందోళన చేయగా, బాధితులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే శ్రీహరి హామీ ఇచ్చారు. బాధితులకు డబ్బులు అందేలా చూస్తామన్నారు.

## కార్మికులకు బకాయి వేతనాలు వెంటనే ఇవ్వాలి

డాక్టర్ శిల్పాకి వినతి పత్రం అందజేత



ప్రజాపక్షం/మక్తల్ : మక్తల్ ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికుల ఐదు నెలల బకాయి వేతనాలు ఇవ్వాలని సంబంధిత డాక్టర్ శిల్పకి వినతిపత్రం శుక్రవారం అందజేశారు. చాలీచాలని వేతనాలతో జీవనం కొనసాగిస్తున్న కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్మికులకు కనీస వేతనాలు 26,000 ఇవ్వాలని, పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని గోవింద్ రాజ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధు, భీమ్, బాలరాజ్, పవన్, నరేష్, మహబూబ్, జమ్ములమ్మ, సంధ్య, లక్ష్మి, నర్మద, పాల్గొన్నారు.

## దామోదర సంజీవయ్య జయంతి

ప్రజాపక్షం/జడ్చర్ల: జడ్చర్ల నియోజకవర్గంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ప్రాంగణంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసేవకుడు కొప్పుల మధు, మహ బూ బ్‌నగర్ జిల్లా సమతా సైనిక్ దళ్ అధ్యక్షులు కోడిగుంట నంద, ఉపాధ్యక్షులు మంగునురి రాములు పాల్గొని ఘన నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడారు.

## అమర జవాన్ల త్యాగం మరవలేనిది



ప్రజాపక్షం/బిజినపల్లి : పుల్వామాలో సైనికులపై జరిగిన దాడిలో మృతి చెందిన అమర వీరులకు శుక్రవారం పాలెం వెంకటేశ్వర ప్రభుత్వం డిగ్రీ, జూనియర్ కళాశాలలో ఘన నివాళ్లు అర్పించారు. ఎబివిపి ఆధ్వర్యంలో 2019 సంవత్సరంలో జరిగిన పుల్వామా దాడులలో వీర మరణం పొందిన జవాన్లకు నివాళులు అర్పించారు. శివాజీ జయప్రకాష్ భాను ప్రకాష్ సంఘ మహేష్ ఆంజనేయులు జీవన్ ఇంటర్ కళా శాలప్రిన్సిపాల్ ఆనంద్‌గౌడ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్న కలిసిన బిసి సంఘం నేతలు



ప్రజాపక్షం/బిజినేపల్లి : ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను బిజినేపల్లి బిసి సంఘం నాయకులు దాసర్ల వెంకటస్వామి, సత్యశీల సాగర్ మర్యాదపూర్వకంగా కలిశారు. బిసి కులాలను ఐక్యం చేసి రాజ్యాధికారం దిశగా అడుగులు వేసేలా చైతన్యం తీసుకురావాలని ఆయన సూచిం చినట్లు వివరించారు. త్వరలోనే ఈ ప్రాం తంలో వరంగల్ తరహాల్ బిసి రాజకీయ యుద్ధభేరి సమావేశం నిర్వహించ తలపెట్టినట్లు చెప్పారు.

## కొనసాగుతున్న డిజిటల్ క్రాస్ సర్వే



ప్రజాపక్షం/బిజినేపల్లి: డిజిటల్ క్రాస్ సర్వేలో భాగంగా బోయపూర్ లో క్రాప్ డిజిటల్ సర్వే కొనసాగుతోంది. గ్రామ శివారులో రైతుల పొలాల్లో వేసిన పం టలను గుర్తింపునకు ఎఇఒ కె.శారద శుక్రవారం డిజిటల్ సర్వే నిర్వహించారు. పలువురు రైతులు పొలాల్లో పంటలను ఫోటో తీసి ఆన్‌లౌన్ నమోదు చేశారు. పంటలు నమోదు ప్రక్రియ డిజిటల్ సర్వే రూపంలో నిర్వహిస్తున్నామని తెలిపారు.

## ఎసిబికి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

ప్రజాపక్షం/ఉండవెల్లి : ఉండవెల్లి మండల పరిధిలోని పుల్లూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ రెడ్డి వెంచరు సమస్యపై రెండు లక్షల లంచం తీసుకుంటున్నగా ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండ్ గా పట్టుబడియన్నారు. శుక్రవారం సాయంత్రం వేళలో డిపిఓ శ్యాంసుందర్ ఆదేశాల మేరకు లంచం తీసుకున్నాడని సూచనల వినబడ్డాయి అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలన చేపట్టి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

# పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి: పిఎంశ్రీ పథకం కింద అభివృద్ధి పనుల కోసం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మొదటి విడత నిధులను త్వరగా వినియోగించి, ఎంపికైన పాఠశాలల్లో వారం రోజుల వ్యవధిలో అభివృద్ధి పనులను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అధికారులకు సూచించారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపర్చేందుకు అవసరమైన మౌలిక వసతులు, స్మార్ట్‌క్లాస్‌రూమ్‌లు, లైబ్రరీలు, ల్యాబ్‌లు, క్రీడా సౌకర్యాలు, తాగునీటి సదుపాయాలు కల్పించాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ జిల్లాలోని పాఠశాలల అభివృద్ధికి పీఎంశ్రీ నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో పిఎం శ్రీ పథకానికి ఎంపికైన 27 పాఠశాలల్లో మౌలిక వసతులకల్పన, గార్డెనింగ్, విద్యుత్‌శక్తి సామర్థ్యం, లైబ్రరీ, పరిసరాల పరిశుభ్రత, అంశాలపై ప్రత్యేకశ్రద్ధ తీసుకొని త్వరితగతిన పూర్తిచేయాలని, వీటి అభివృద్ధికి మొత్తం రూ.3.89కోట్లు విడుదల అయ్యాయని ఈనిధులను పూర్తిగా వినియోగించి , పాఠశాలల్లో అన్నిరకాల మౌలిక వసతులను అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. రెండోవిడత నిధులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో సమర్పించాలని అధికారులకు సూచించారు. ఈసమావేశంలో జిల్లావిద్యాశాఖ అధికారి రమేష్‌కుమార్, సమగ్రశిక్ష అభియాన్ గణాంక అధికారి మధుసూదన్‌రెడ్డి, సమగ్రశిక్ష ప్లానింగ్ కోఆర్డినేటర్ నూరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## స్టాల్స్,ఫన్ గేమ్స్,సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు

ప్రజల నుండి విశేషస్పందన



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : మహబూబ్ నగర్ పట్టణంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న మన మహబూబ్ నగర్ మహా నగరోత్సవం ను మహబూబ్ నగర్ శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయితో కలిసి మహ బూబ్ నగర్ పట్టణం లోని శిల్పారామంలో శుక్రవారం ప్రారంభించారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ కార్పొరేషన్ గా ఏర్పాటు అయిన సందర్భంగా రెండు రోజుల పాటు మార్కెట్ స్టాల్‌లు ఏర్పాటు, ప్రభుత్వ స్టాల్ లు, ఫన్ గేమ్స్, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మహబూబ్ నగర్ పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మలు నర్సింహా రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ఎఐటియుసి పోరాటాల ఫలితంగా

# పెండింగ్ బకాయిలు విడుదల

తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి




ప్రజాపక్షం/జడ్చర్ల/మహబూబ్ నగర్ ప్రతినిధి : తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధి లోని ప్రభుత్వ జిల్లా ఏరియా సిహెచ్‌సి ఆసుపత్రులలో పని చేస్తున్న పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్‌వైజర్ కార్మికులకు చెల్లించాల్సిన ఏడు నెలల పెండింగ్ జీతాల బడ్జెట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మెడికట్ కాంట్రాక్ట్స్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా వివిధ రూపాలలో ఆందోళన నిరసన కార్యక్రమాలు చేపట్టింది. ఈనెల 19న వేలాది మందితో హై దరాబాద్ కోఠిలోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ కార్యాలయం ముట్టడికి సిద్ధం అవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యంగా తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ మాత్యులు దామోదర్ రాజనరసింహ కార్మికుల ఇబ్బందులు, సంక్షేమం దృష్టిలో పెట్టుకొని ఆయన ప్రత్యేక చొరవ తీసుకుని కార్మికులకు జూన్ నుండి డిసెంబర్ వరకు దాదాపు ఆరు నెలల పెండింగ్ వేతనాల బడ్జెట్ ను విడుదల చేశారని, ఇది ఎఐటియుసి మెడికల్ యూనియన్, కార్మికుల రాజీలేని పోరాటాల ఫలితమేనని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పి. సురేష్, జిల్లా నాయకులు భాగి కృష్ణ యాదవ్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విడుదలైన వేతన బడ్జెట్‌ను తక్షణమే కాంట్రాక్టర్లు ఎటువంటి కోతలు పెట్టకుండా నేరుగా కార్మికుల ఖాతాలో పడేవిధంగా వైద్యారోగ్య శాఖ అధికారులు, జిల్లా వైద్య సమన్వయ అధికా రులు, ఆసుపత్రుల మెడికల్ సూపరింటెండెంట్ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థులు ప్రణాళికతో చదవాలి

అదనపు కలెక్టర్ దేవసహాయం




ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ ప్రతినిధి : పరీక్షల సమయంలో భయంతో కాకుండా ఏకాగ్రతతో చదివితే పరీక్షలను సులభంగా రాయవచ్చని స్థానికసంస్థల అదనపు కలెక్టర్ దేవ సహాయం విద్యార్థులకు సూచించారు. జిల్లా సాంఘిక సంక్షేమ, బిసి సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని సుఖజీవన్‌రెడ్డిఫంక్షన్ హాలులో సాంఘిక సంక్షేమ బిసి సంక్షేమ శాఖల వసతిగృహాల పదోతరగతి విద్యార్థులకు పదోతరగతి పరీక్షలపై నిర్వహించిన ప్రేరణ తరగతుల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ దేవస హాయం హాజరై మాట్లాడుతూ పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడికి గురికావొద్దని, ఉపాధ్యాయులు బోధించిన ప్రతి అంశాన్ని శ్రద్ధగా అర్థం చేసుకొని ప్రశాంతంగాపరీక్షలు రాయాలన్నారు. పదోతరగతి పరీక్షల సమయం దగ్గర పడుతుండటంతో విద్యార్థుల్లో భయాన్ని తొలగించడానికే ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమశాఖ అధికారి ఖాజానాజింఆలీ అప్సర్, జిల్లా సాంఘికసంక్షేమశాఖ అధికారి శ్రవణ్‌కుమార్, సహాయ అధికారులు శ్రీరామ్, శ్రీకర్‌రెడ్డి, పాండునాయక్, ఆయాసంక్షేమశాఖల హాస్టల్‌వార్డెన్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మిర్యాలపావనిని పరామర్శించిన ఎమ్మెల్సీ కవిత





ప్రజాపక్షం/కల్వకుర్తి : తెలంగాణజాగృతి నాగర్‌కర్నూల్ జిల్లా జాగృతి నాయకురాలు మిరియాల పావని అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ, తెలంగాణ రాష్ట్ర జాగృతి వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్‌తో కలిసి అల్మాసుగూడలోని వారి ఇంటికివెళ్లి పరామర్శించి మనోధైర్యాన్ని చెప్పారు. కర్మన్‌ఘాట్‌లోగల ఉప్పల వెంకటేష్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఎంపిపి నిర్మల శ్రీశైలంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అధిక రుసుం వసూలు చేస్తే చర్యలు

మీ–సేవ నిర్వాహకులతో తహసీల్దార్ సమావేశం



ప్రజాపక్షం/నర్వ: మిసేవ కేంద్రాల్లో వివిధ సర్వీస్ల నిమిత్తం ప్రభుత్వం నిర్ణయించిన రుసుం కంటే అధికంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మల్లారెడ్డి అ న్నారు. నర్వ మండల పరిధిలోని 8 మీ–సేవ కేంద్రాల నిర్వాహకులతో తహసీల్దార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా ప్రవేశపెట్టి ప్రజలకు అందిస్తున్న నూతన రేషన్ కార్డుల దరఖాస్తుల ప్రక్రి యలో భాగంగా ఆన్‌లైన్ రేషన్ కార్డు కరెక్షన్ కోసం కానీ, కొత్త రేషన్ కార్డు కోసం కానీ దరఖాస్తు చేసుకునే సమయంలో ప్రభుత్వం నిర్ణయించిన రుసుం ప్రకారమే తీసు కోవాలని సూచించారు. అధికంగా డబ్బులు వసూలు చేసినా, రుజువైనా అ మీసేవ కేంద్రంపైశాఖపరమైనచర్యలుఉంటాయన్నారు.

**దళారులను నమ్మొద్దు..** ప్రజలు వివిధ పనులు,ఇతర అవసరాల నిమిత్తం దళారులను నమ్మొద్దని, సొంతంగా వారే కార్యాలయానికి వచ్చి తమ పనులను చేసుకుని వెళ్లాలని తహసీల్దార్ మల్లారెడ్డి సూచించారు.కొందరు ఎమ్మార్వో ఆఫీస్‌ల పైసలు ఇస్తే గాని ఫైలు కదలదు అని బహిరంగంగా చర్చించుకుంటున్నారు. బర్త్ సర్టిఫికెట్, కల్యాణలక్ష్మి ఓరేటు వివిధ రకాల పనులకు ఎమ్మార్వో ఆఫీస్‌లో పైసలు అడగకుంటే దళారులు ఎవరు తీసుకోరని మీ–సేవ నిర్వాహకులు ఎంఆర్ఓ దృష్టికి తీసుకువచ్చారు. ఈకార్య క్రమంలో డిప్యూటీ తహసీల్దార్, శ్రీనివాస్ సిబ్బంది బాలకృష్ణ మీసేవ నిర్వాహకులు (మీసేవ కేంద్రాల నారాయణపేట జిల్లా ఉపాధ్యాక్షులు) మల్లన్ కోటి శంకర్,మీసేవల నిర్వాహకులు అజయ్, రాయన్న, బాలరాజు, శ్రీనివాస్ రెడ్డి, పాతర్చేడు, ఉం దెకోడ్ మీసేవ కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# చదువుతోనే బంగారు భవిష్యత్తు

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్‌ప్రతినిధి : విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలంటే మంచిగా చదువుకోవాAని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని ధర్మాపూర్, కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో చదివే పదవ తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే తన సొంత నిధులతో ఉచితంగా డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్ అందించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎం కృష్ణయ్య, జిహెచ్ఎం వెంకటేశ్వర్లు, సిఎంఒ బాలుయాదవ్, డిఇఓ ప్రవీణ కుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డితదితరులు పాల్గొన్నారు.

**విద్యాలయాలు అభివృద్ధితోనే దేశాభివృద్ధి**

విద్యాలయాలు అభివృద్ధి చెందినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వికలాంగుల, వయోవృద్ధుల, ట్రాన్స్ జెండర్స్ వ్యక్తుల సాధికారత శాఖ ద్వారా 69 లక్షల రూపాయల తో నిర్మించిన సిసి రోడ్, గ్రంథాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు.

**ఘనంగా పండుగసాయన్న విగ్రహావిష్కరణ**

పాలమూరు వీరుడు పండుగ సాయన్న ఆశయాలను కొనసాగిస్తామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి పండుగ సాయన్న విగ్రహాన్ని ఆవి ష్కరించారు.

## సగర శంఖారావం బహిరంగసభ



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ ప్రతినిధి : జిల్లా సగర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న సగర శంఖారావం బహిరంగసభను విజయవంతం చేయాలని తెలం గాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ పిలుపునిచ్చారు. బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తూడుకుర్తి, వడ్డెమాన్, సల్కర్‌పేట, శాయిన్‌పల్లి, గంగారం, పోలేపల్లి, బిజినేపల్లి, ఖానాపూర్ తదిత రగ్రామాల్లో జిల్లా అధ్యక్షులు పోతులపల్లిగట్టుశ్రీనివాస్‌సగర ఆధ్వర్యంలో శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. బహిరంగసభను విజయవంతం చేయాలని సగరులను చైతన్య పరుస్తూ సన్నాహాక సమావేశాలు నిర్వహించారు. రాష్ట్ర ముఖ్య సలహాదారులు ఆంజనేయులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా ఇంచార్జీ ఆంజనేయులు, సగర,రాష్ట్రమహిళాసంఘం ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి, పాల్గొన్నారు.

ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ : సగర శంఖారావం సభకు వేలాదిగా తరలి వచ్చి విజ యవంతం చేయాలని కల్వకుర్తి మండల అధ్యక్షులు వావిలాల సురేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలపై ఈసగర శంఖా రావం సభకు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

## గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యం



ప్రజాపక్షం/పెబ్బేరు : పెబ్బేరు మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు వనపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పలు గ్రామాల్లో శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో అన్ని గ్రామాలను సమగ్రం గా అభివృద్ధి చేయడమే తమ లక్ష్య ంగా పని చేస్తున్నామని ఆయన అన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ లో గ్రామాలలో సిమెంట్ కాంక్రీట్ రోడ్లు, తిప్పాయిపల్లి గ్రామంలో బీటీ రోడ్డు నిర్మాణానికి , అంగన్ వాడీ బిల్డింగ్ నిర్మాణానికి, వైశాఖపూర్ లో పలు నిర్మాణాలకు, గుమ్మడం యాపర్లలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. మండల కాంగ్రెస్ నాయకులు, ఆయా గ్రామాల కాంగ్రెస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు అండగా ఉంటాం

రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్

ప్రజాపక్షం/పెబ్బేరు: పెబ్బేరుకు చెందిన జర్నలిస్టు బీసన్న హార్ట్ స్ట్రోక్‌తో బాధపడుతూ వనపర్తి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రిపోర్టర్ బీసన్నను పెబ్బేరు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బాలవర్ధన్ , సహచార జర్నలిస్టు మిత్రులు శుక్రవారం పరామర్శించారు. పెబ్బేరు ప్రెస్ క్లబ్ తరపున టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్ మాట్లాడుతూ అవసరమైతే హైదరాబాద్‌లో కూడా డాక్టర్లతో మాట్లాడి మెరుగైన వైద్యం అందిటట్లుగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. రూ. 7500లను శుక్రవారం ఆయనకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పరుశరాం, ఉపాధ్యక్షుడు కిరణ్ కుమార్ గౌడ్ , సంయుక్త కార్యదర్శి రాజేంద్రప్రసాద్ , జర్నలిస్టు మిత్రుడు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభం



ప్రజాపక్షం / కొత్తకోట: కొత కోట ప్రీమియర్ లీగ్ ప్రీమియర్ లీగ్ 1 క్రికెట్ పోటీలను క్రీడా మైదానంలో దేవరకద్ర ఎమ్మె ల్యే జి. మధుసూదన్ రెడ్డి బ్యా టింగ్ చేసి ప్రారం భిం చారు. ముందుగా పూల్వామా దాడిలో వీరమరణం పొందిన జవాన్లకు నివాళులర్పించి , జాతీయ గీతాన్ని అలపించికొవ్వొత్తులను వెలిగించి ఈ పోటీలను ప్రారంభించారు. తదనంతరం బీపీఆర్ గార్డెన్ లో జనుంపల్లి సునీల్ కుమార్ వెడ్స్ కళ్యాణి వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## రోడ్డు నిర్మాణం పరిశీలన



ప్రజాపక్షం/వీపనగండ్ల : నూతనంగా నిర్మాణం చేపట్టే వెల్గొండ ... బుసిరెడ్డిపల్లి రోడ్డు నిర్మాణానికి శుక్రవారం అధికారులు పరిశీలించారు. నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నర్సింహ వెల్గొండ .... బుసిరెడ్డిపల్లి 416 సర్వే నంబర్ వెంట గ్రామ రైతుల పంట పొలాలకు త్వరగా దారి నిర్మించాలనే ప్రతిపాదనను మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లి చర్చించగా మంత్రి జూపల్లి స్పందించడం జరిగిందని తెలిపారు. పంచాయతీ రాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ ను, వనపర్తి జిల్లా డిఆర్డీఓ ఉమాదేవిని ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా రోడ్ సౌకర్యం కల్పించాలని ఆదేశించినట్లు నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నర్సింహ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు రవీందర్ గౌడ్ , బందేల శ్రీకాంత్ , పోచమోని ఆంజనేయులు, రంగపురం తిరుపతయ్య, తదితరులు ఉన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు



ప్రజాపక్షం/కల్వకుర్తి : అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ నాగా ర్జున హెచ్చరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్‌పి గైక్వాడ్‌వైభవ్‌రఘునాథ్ ఆదేశాలతో శుక్రవారం సీఐ నాగార్జున, ఎస్ఐ మాధవ రెడ్డి, తెలకపల్లి ఎస్ఐలు దుందుభివాగు పరి సరగ్రామ శివారు ప్రాంతాలు ఎల్లికట్ట , రఘుపతిపేట గ్రామాలలో అక్రమంగా ఇసుక తరలింపు జరగకుండా వాగులను పరిశీలించారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపితే పోలీస్‌లకు సమాచారం అందించాలని సూచించారు. అక్రమ ఇసుక తరలించిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని, వాహనాలు స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

## ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి

జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

ప్రజాపక్షం / నారాయణపేట : ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. శుక్రవారం నారాయణపేట జిల్లా వ్యవసాయ అధికారుల డైరీని జిల్లా కలెక్టర్ స్మితా పట్నాయక్ అడిషనల్ కలెక్టర్ బెన్షాలోమ్ చేతుల మీదుగా జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ నగేష్ , హైమవతి, మండల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అయోడిన్ లోపాలపై అవగాహన

ప్రజాపక్షం / మద్దూరు : ఇనిస్టూట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్మెంట్ ఆశీర్వాద్ స్మార్ట్ ఇం డియా ఆధ్వర్యంలో మద్దూర్ మండలం రెనివట్ల ఉన్నత పాఠశాల విద్యార్థులకు అయో డిన్ లోపం వలన ఏర్పడే రుగ్మతల గురించి డా.శ్రీకాంత్, పాఠశాల ప్రధానోపా ధ్యా యు లు రాజునాయక్ , ఇనిస్టూట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్మెంట్ డిస్ట్రిక్ట్ కో ఆర్డీనేటర్ ప్రసా ద్‌లు వివరించారు. ఈ సందర్భంగా డా.శ్రీకాంత్ మాట్లాడుతూ అయోడిన్ లోపం నుండి వచ్చే రుగ్మతలు గాయిటర్ , క్రెటనిజం, న్యూరోమేటర్ , థైరాయిడ్ వంటి రోగాలు వస్తా యన్నారు. ప్రాపర్ డైట్ , సమతుల ఆహారంపై, విటమిన్ లోపం వలన వచ్చే రుగ్మతుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏర్పాటు చేసిన క్విజ్ పోటీలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

## రోగులకు మెరుగైన వైద్యశాల

ప్రజాపక్షం/వీపనగండ్ల: ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగని వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి డా. శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించారు. మిషన్ మధుమేహ స్క్రీనింగ్,అనుమానిత కేసులు, ఆన్‌లైన్ ఎంట్రీ నమోదు చేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి ఆరోగ్య సేవలు అందించాలని విధుల పట్ల నిర్లక్ష్యం వహించడం తగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ డాక్టర్లు, హేమవర్ధన్ , శ్వేత, కరుణశ్రీ, భాగ్యశ్రీ, సూపర్వైజర్స్ దయామణి, కేశవులు, కళమ్మ, జహంగీర్ పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి షూటింగ్ బాల్ క్రీడలకు ఎంపికైన విద్యార్థి

ప్రజాపక్షం/మాగనూరు :7న హైదరాబాద్‌లోని దోమలగూడ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీలో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ ఎంపికలో కృష్ణ మండలం జడ్పీ హై స్కూల్ విద్యార్థి కావలి రఘు జాతీయ స్థాయి షూటింగ్ క్రీడలకు ఎంపికైనట్లు పిడి సౌమ్య తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థికి , పిడి సౌమ్యకు శుక్రవారం రాష్ట్ర షూటింగ్ బాల్ ఉపాధ్యక్షుడు బి. గోపాలం శాలువాతో సన్మానించారు. ఈ నెల 21 నుండి 23 వరకు నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగే జాతీయ స్థాయి షూటింగ్ బాల్ క్రీడల్లో రఘు పాల్గొంటారని తెలపారు.

# ఫోకస్

# సైన్స్

# అనంత విశ్వంలో అతిపెద్ద పాలపుంత!

శోధించినకొద్దీ అనంత విశ్వంలో ఎన్నో అద్భుతాలు బయటపడుతున్నాయి. వాటిలో ఒకటి ఖగోళ శాస్త్రవేత్తలు ఇటీవల గుర్తించిన అతిపెద్ద పాలపుంత. అయితే, మన గెలాక్సీ మాదిరిగానే ఇందులోనూ నక్షత్రాలు, గ్రహాలు, చంద్రులు ఉన్నాయా లేక ఏ ఇతర పదార్థాల తోనైనా ఏర్పడిందా అనేది తెలియాల్సి ఉంది. సుమారు 1.3 బిలియన్ కాంతి సంవత్సరాల విస్తీర్ణంలో ఉన్న ఈ భారీ విశ్వనిర్మాణం 'క్విపు' మన పాలపుంత కంటే సుమారు 13,000 రెట్లు పొడవుగా ఉంది. దీనిపై లోతైన అధ్యయనం జరిగితే, విశ్వం నిర్మాణంపై ఇప్పటి వరకూ మనకు ఉన్న అవగాహనను మార్చివేసే అవకాశాలు లేకపోలేదు. ఖగోళంలో రూరాలను లెక్కించడానికి పురాతన కాలంలో 'క్విపు' అనే ఇంకాన్ కొలత విధానాన్ని వినియోగించేవారు. కొత్తగా కనిపెట్టిన విశ్వ భాగానికి ఈ పేరునే ఖరారు చేశారు. గెలాక్సీ క్లస్టర్ డేటాను విశ్లేషించే సమయంలో పరిశోధనకులు ఈ సూపర్ స్ట్రక్చర్‌ను కనుగొన్నారు. ప్రస్తుతానికి మనకు తెలిసిన అతిపెద్ద నిర్మాణం 'హెర్క్యులస్ కరోనా బోరియాలిస్ గ్రేట్ వాల్'. అది 10 బిలియన్ కాంతి సంవత్సరాల వరకు విస్తరించి ఉంది. అయితే, దీని ఉనికిపై ఇప్పటికీ స్పష్టత లేదు. వివాదాలు కొనసాగుతున్నందున, అధికారికంగా దీనిని ఖగోళ నిర్మాణంగా గుర్తించలేదు. కాబట్టి, ప్రస్తు తానికి 'క్విపు'నే అతిపెద్ద ఖగోళ స్ట్రక్చర్‌గా అంగీకరించాలి. ఈ క్రమంలోనే శాస్త్రవేత్తలు మరో నాలుగు భారీ సూపర్ క్లస్టర్లను కూడా కనుగొన్నారు. ఈ ఐదు నిర్మాణాల్లో 30 శాతం గెలాక్సీలు, 45 శాతం గెలాక్సీ సమూహాలు, 25 శాతం ఇతరత్రా పదార్థాన్ని వారు గుర్తించారు. ఈ కొత్త భారీ స్ట్రక్చర్‌కు సంబంధించిన చిత్రంలో క్విపు (ఎరుపు) అందులోని అతిపెద్దది. ఆ తర్వాత షాప్లీ (నీలం), సెర్సెన్స్‌కరోనా బోరియాలిస్ (ఆకుపచ్చ), హెర్క్యులస్ (ఊదా), స్కల్ప్చర్‌పెగాసస్ (లేత గోధుమ రంగు) గెలాక్సీ సమూహాలు ఉన్నాయి. పాలపుంత లానియాకియా సూపదర్ క్లస్టర్‌కు చెందింది కాగా, విశ్వ చలనంలో క్విపు ప్రధాన పాత్ర పోషిస్తున్న దని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. అయితే, ఈ విషయంలో ఇంకా లోతైన అధ్యయనం జరగాల్సి ఉంది. స్థానిక సమూహాన్ని ప్రభావితం చేసే గురుత్వాకర్షణ శక్తికి క్విపు దోహదం చేస్తుంది. ఇది కాస్మిక్ మైక్రోవేవ్ నేపథ్యానికి సంబంధించిన దాని కదలికను ప్రభావితం చేస్తుంది. అయితే, ప్రస్తుతానికి ఇవన్నీ ప్రాథమిక అంచనాలనీ, ఆయా ప్రభావాలను నిర్ధారించడానికి మరిన్ని అధ్యయనాలు అవసరమని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు.



ఇలావుంటే, క్విపు శాశ్వతంగా ఉండే అవకాశం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. పరిమాణంలో చాలా విస్తారమైనదే అయినప్పటికీ, చివరికి చిన్నచిన్న యూనిట్లు లేదా విభాగాలుగా విడిపోతుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. అందుకే క్విపును కాలక్రమేణ మారే 'తాత్కాలిక ఆకృతీకరణ'గా అభివర్ణిస్తున్నారు. ఇలావుంటే, క్విపును అధ్యయనం చేయడం వల్ల విశ్వ నమూనాలను మెరుగుపరచడం సాధ్యమవుతుంది. ఇది గెలాక్సీ పరిణామం, యూనివర్స్ డైనమిక్స్‌పదై కొత్త అంతర్దృష్టిలను అందించగలదు.

## ఆధునిక భౌతికశాస్త్రం..గెలీలియోతో ప్రారంభం





నేడు జయంతి

ప్రపంచ ఆలోచనా సరళిని మార్చిన అత్యంత మేధావులైన శాస్త్రవేత్తల్లో గెలీలియో గెలిలి పేరు ప్ర ముఖంగా వినిపిస్తుంది. ప్రత్యేకించి ఆధునిక భౌతికశాస్త్రం ఆయనతోనే ప్రారంభమైందని అంటారు. అప్పటి వరకూ బలం గా ఉన్న మానవాతీత శక్తుల ప్రమేయాన్ని తోసిపుచ్చి, వస్తుగత దృష్టికి ప్రాధాన్యమిచ్చిన తొలి శాస్త్రవేత్త ఆయన. సైంటిఫిక్ మెథడ్ లేదా సైంటిఫిక్ అప్రోచ్‌గా పే ర్కొనే ఆధునిక శాస్త్రీయ ఆలోచనలకు గెలీలియో పునాదులువేశాడు. అనేక ప్రయోగాలతో, తన వాదనను నిరూపించాడు. భౌతికం కానిది ఏమీ లేదని చాటిచెప్పాడు. 1564 ఫిబ్రవరి 15న ఇటలీలోని పీసా నగరంలో జన్మించిన గెలీలియో బాల్యం దైవచింతన బలంగా ఉన్న కు టుంబంలో గడిచింది. తండ్రి ఒక మత బోధకుడు కావడంతో,చిన్నతనంలో చర్చిప్రార్థనలకు వెళ్లేవాడు. అయి తే, అక్కడి తతంగం అతనికి నచ్చేదికాదు. నిరంతరం ఆ లోచనల్లో మునిగితేలేవాడు. ఒకసారి ఓ ప్రవచనకర్త మా ట్లాడుతున్నప్పుడు, అతని వెనుక ఒక గొలుసుకు వేలాడదీసిన దీపంగెలీలియోను ఆకర్షించింది. ఆ దీపం అటూ ఇటూ ఊగుతుండడంతో, ఒకసారి ఊగడానికి ఎంత సమయం పడుతుందని లెక్కించడం మొదలుపెట్టాడు. క్రమంగా ఆడోలనం(oscillation) దూరం తగ్గ డం మొదలైంది. క్రమంగా కేంద్ర బిందువుకు చాలా దగ్గరికి చేరింది. అయితే, డోలన కాలం మాత్రం ఏమాత్రం మారలేదు. డోలన దూరం తగ్గినప్పు డు, సమయం ఎందుకు తగ్గలేదన్న ఆలోచన మొదలైంది. ఆ విషయాన్నే మరింత లోతుగా శోధించడం మొదలుపెట్టాడు. ఆఆలోచన నుంచి ఉద్భవించిందే'లోలకం'(pend ulu m). దీని ఆవర్తక కాలం కేవలం కట్టిన తాడు పొడువుపై ఆధరపడుతుందేగానీ, డోలనం వ్యాప్తి (ampli tude) లేదా దూరం మీద కాదని నిరూపించే యం త్రాన్ని తయారు చేశాడు. దానికి 'పల్సిలోగియా' (pul silogia) అని పేరు పెట్టాడు. ఆవిధంగా కచ్చితమైన వ్యవధిగల డోలనాలను ప్రదర్శించే లోలకంతో కాలాన్ని కొలవడం సాధ్యమవుతుందని, దానిని ఒక గడియారం లో వాడవచ్చని కూడా గెలీలియో ఊహించాడు. చిన్నతనంలోనే అతను ఒక శాస్త్రవేత్త, ఒక పరిశోధకుడిగా మారాడు. తండ్రి బలవంతం మీద వైద్య శాస్త్రాన్ని అభ్యసించడం మొదలుపెట్టిన గెలీలియో, నాడి చూసి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునే అవకాశం ఉన్నప్పుడు,అదే నాడి వేగాన్ని లోపాలు లేకుండా కొలవడానికి లోలకం వాడవచ్చని అనుకున్నాడు. తనఆలోచన ను అమలు చేశాడు. అయితే,మధ్యలోనే చదవు మానేశాడు. కనిపించిన ప్రతి విషయాన్నీ క్షుణ్ణంగా అధ్యయనం చేయడం, ప్రశ్నించడంఅనే అలవాట్లు గెలీలియోను విలక్షణ వ్యక్తిగా మా ర్చాయి.రుజువులు... సాక్ష్యాధారాలు లేనిదే ఏ విషయా న్నీ అంగీకరించేవాడుకాదు. అప్పటో అరిస్టాటిల్ ఆలోచనలు, అభిప్రాయాలనే ప్రజలు నమ్మేవారు.. ఆచరించేవారు. అయితే, అంతకు ముందు కొన్ని శతాబ్దాల క్రితం అరిస్టాటిల్ చెప్పిందంతా వాస్తవమేనని అనుకోవడం, అదే సరైన విధానమని వాదించడం తప్పని గెలీలియో స్పష్టం చేసేవాడు.అతని ఆలోచనా విధానమే సరికొత్త భౌతికశాస్త్ర అధ్యయనాలకు నాంది పలికింది. బరువైన, నునుపైన, నీటిని సులభంగా ఛేదించగల ఆకారం గల (stream lined) వస్తువులు (ఉదాహరణకి, నునుపైన మొన గల ఓ స్టీలు కడ్డీ) ఒకే కాలంలో కిందపడతాయని, బాగా తేలికైన వస్తువులు గాని, నునుపైన, నీటిని కోయగల ఆకారం లేని వస్తువులు గాని మరింత నెమ్మదిగా పడతాయని గెలీలియో తన ప్రయోగాలతో నిరూపించాడు.

ఆధునిక టెలిస్కోప్ నిర్మాణం కూడా గెలీలియో ఘనతగా చెప్పుకోవాలి. ఒక రకంగా చెప్పాలంటే, ఖగోళ పరిశోధనలకు ఉపయోగిస్తున్న జేమ్స్ వెబ్ వంటి టెలిస్కోప్‌లకు ఆద్యుడు గెలీలియో. తాను తయారు చేసుకున్న టెలిస్కోప్‌తో అతను అంతరిక్ష పరిశోధన కొనసాగించాడు. అతి చిన్న గ్రహం మెర్క్యురీని విడిచిపెట్టి, వీనస్ (శుక్రుడు)పై అధ్యయనం ప్రారంభించాడు. భూమికి చంద్రుడి మాదిరిగానే, సూర్యుడికి వీనస్ ఎప్పుడూ అభిముఖంగానే ఉంటుంది. ఈ గ్రహం కదలికలను పరిశీలించిన గెలీలియో 1610లో మొట్టమొదటి సారిగా తన పరిశీలను వర్ణిస్తూ సవివరంగా చిత్రాలు గీశాడు. అయితే, ఆ పరిశీలనలు సూర్యసిద్ధాంతానికి మద్దతు నిస్తున్నట్టుగా ఉన్నాయి కాబట్టి, కోపర్నికస్ సిద్ధాంతాన్ని అనుసరించేవారు వాదలకు దిగుతారని, మతపరమైన ఘర్షణలు ఎదుర్కోవాల్సి వస్తుందని అనుకున్న గెలీలియో తానుకనుగొన్న విషయాన్ని గూఢసందేశంగా (anagram) తన పుస్తకంలో రాసుకున్నాడు. అలా 1610 లో చేసిన పరిశీలనలు తదనంతరం 1613 లో బయటపడ్డాయి. సూర్యసిద్ధాంతాన్ని సమర్థిస్తూ ఇన్ని ఆధారాలు బయటపడుతున్నా అరిస్టాటిల్ వాదులు మాత్రం తమ మంకు పట్టు వదల్లేదు. ఎంతో కాలంగా అంతరిక్ష వస్తువులని పరిశీలించడానికి అలవాటు పడ్డ ఖగోళవేత్తలకి ఈ కొత్త బోధన మింగుడుపడలేదు. ఉదాహరణకి బృహస్పతి చందమామల గురించి గెలీలియో కనుక్కున్న విషయాల గురించి విన్న ఫ్రాన్సెస్కో సిజీ అనే ఖగోళ వేత్త ఇలా వితండ వాదన మొదలెట్టాడు. బృహస్పతి చందమాలు కంటికి కనిపించవు కనుక, భూమి మీద వాటికి ప్రభావం ఉండదు. కాబట్టి వాటిని గురించి అసలు పట్టించుకోవడం అనవసరమని అభిప్రాయపడ్డాడు. ప్రభావం లేనివి ఉన్నా లేనట్టేనని అతని వాదన. గిలియో లీబ్రీ అనే తత్వవేత్త అసలు దూరదర్శిని లోంచి చూడడాన్ని నేరంగా పేర్కొన్నాడు. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో గెలీలియో సూర్యసిద్ధాంతం బయటకు వచ్చింది. అప్పుడు చాలా మంది తిరస్కరించిన ఆ సిద్ధాంతమే, తర్వాతి కాలంలో సాక్ష్యాధారతోసహా రుజువైంది.

## సముద్రగర్భంలో శక్తివంతమైన న్యూట్రినో



ఎన్నో అద్భుతాలను తనలో దాచుకున్న సముద్రంలో అత్యంత శక్తివంతమైన న్యూట్రినోను శాస్త్రవేత్తలు గుర్తించారు. గతంలో గుర్తించిన న్యూట్రినోలతో పోలిస్తే, ఇది కనీసం 20 రెట్లు శక్తివంతమైనదని అంటున్నారు. న్యూ ట్రినో అనేది బలహీనమైన పరస్పర చర్య. గురుత్వాకర్షణ ద్వారా సంకర్షణ చెందే ఒక ప్రాథమిక కణం. న్యూట్రినో విద్యుత్తు తటస్థంగా ఉంటుంది. ఫలితంగా దాని విశ్రాంత ద్రవ్యరాశి చాలా చిన్నది. చాలాకాలంగా దీనిని సున్నాగా భావించేవారు. అందుకే, ఈ కణానికి న్యూట్రినో అని పేరు పెట్టారు. ద్రవ్యరాశి లేని కణాలను మినహాయిస్తే, ఇతరత్రా కణాల్లో అత్యంత తక్కువ ద్రవ్యరాశిగల కణంగా న్యూట్రినోను పేర్కొంటారు. న్యూట్రినోలు విద్యుదయస్కాంత పరస్పర చర్యలో లేదాబలమైన పరస్పర చర్యలోపాల్గొనవు. అందువల్ల ఇవి సాధారణ పదార్థం గుండా అడ్డంకులు లేకుండా వెళతాయి. అంతేగాదు, వీటిని గుర్తించడం కూడా కష్టమే. కాగా, సీఫ్లోర్‌లో అత్యంత శక్తివంతమైన నూట్రినోను కనుగొన్న తర్వాత, అక్కడి నెట్‌వర్క్‌కు 'ది క్యూబిక్ కిలోమీటర్ న్యూట్రినో టెలిస్కోప్' (కెఎం3ఎన్ఇటి) మాడ్యూల్‌ను జోడించేందుకు ఇంజనీర్లు సిద్ధమయ్యారు. దాని లాంచర్ వెహికల్ మాడ్యూల్ తుది తనిఖీ చేసిన తర్వాత, సముద్రంలోకి పంపుతారు. మధ్యధరా సముద్రంలో యూరోపియన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ నెలకొల్పిన టెలిస్కోప్ కెఎం3ఎన్ఇటితో మాడ్యూల్‌ను అనుసంధానం చేసి, అక్కడి నుంచి వచ్చే వివరాలను సేకరించి, కొత్తగా గుర్తించిన నూట్రినోపై లోతైన అధ్యయనాలు జరుపుతారు. ప్రస్తుతానికి ఈ నూట్రినో దిశ లేదా శక్తి వంటి వివరాలను యూరోపియన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ వెల్లడించలేదు. ప్రస్తుతానికి ప్రాథమిక సమాచారం మాత్రమే ఉందని, మరిన్ని పరీక్షలు, అధ్యయనాలు అవసరమని పేర్కొంది. ఒక ఎలక్ట్రాన్ కంటే మిలియన్ రెట్లు తేలికైన విద్యుత్ తటస్థ కణాలైన న్యూట్రినోలు సాధారణంగా సూర్యుడి మధ్యలో ఉన్న అణు ప్రతిచర్యలతో ఉత్పత్తి అవుతాయి. అయితే, గత దశాబ్దకాలంలో పరిశోధకులు అనేక క్వాడ్రిలియన్ ఎలక్ట్రాన్ వోల్ట్‌ల (1015 eV, లేదా 1 పెటాఎలెక్ట్రాన్‌వోల్ట్) ఎక్కువ శక్తిని మోసుకెళ్లే న్యూట్రినోలను రికార్డు చేయగలిగారు. ఇవి సుదూర గెలాక్సీలలో ఉద్భవించాయన్న వాదన ఉంది. 320,000 పీవీ వద్ద ఇప్పటివరకు కనుగొనబడిన అత్యంత శక్తివంతమైన కణం న్యూట్రినో కాదు.. ఇది పార్టికల్ అని పిలిచే కాస్మిక్ కిరణం. అందుకే, కొత్త శక్తివంతమైన న్యూట్రినోపై అనేక అనుమానాలతోపాటు ఆసక్తి కూడా నెలకొంది. ఫలితాలపై అంతా ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.

## వయసును జయించే అక్టోపస్!



అక్టోపస్‌లను చాలా మంది చూసే ఉంటారు. అన్ని అక్టోపస్ లు ఒకటి కాదు. వాటిలో సుమారు 300 రకాలున్నాయి.అన్నింటిలో నూ'బడా స్' (శాస్త్రీయనా మం'ట్యురిటోప్సిస్ డొ ర్ని) విలక్షణమైనది. ఎందుకంటే అది వయసును జయిస్తుంది. చావును ఏమారుస్తుంది. నిత్యయవ్వనంతో జీవిస్తుంది. ఈ జాతి అక్టోపస్ వయసు పెరుగుతున్నప్పుడు, తనను తాను తిరిగి యవ్వన రూ పంలోకి మార్చుకుంటుంది (సెల్ఫ్ పాలిప్). అంటే కాలాన్ని వెనక్కు నడిపిస్తుంది. దీనిని టైమ్‌ట్రావెల్ అక్టోపస్ అనుకోవచ్చు. ప్రపంచంలో ఎన్ని వింతలో... జీవుల్లో ఎన్ని రకాలో... తరచి చూచినకొద్దీ వెలుగు చూస్తునే ఉంటాయి.

## ఉచితాలపై న్యాయమూర్తుల వ్యాఖ్యలు అత్యంత బాధాకరం

### బికెఎంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు



ప్రజాపక్షం/వరంగల్‌టౌన్: రైతు కూలీలకు అసంఘటితరంగ కార్మికులకు చేతివృత్తుల వారికి పేదలకు ప్రభు త్వాలు ఇస్తున్న ఉచిత పథకాలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు వ్యాఖ్యానించడం అత్యంత బాధా కరమని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. పేదలకు ఉపాధి కల్పించలేక, రైతులకు కొంత ఉపశమనం కలిగించే విధంగా పాలకులు కొన్ని ఉచిత పథకాలు ప్రవేశపెడితే దానికి వ్యతిరేకంగా న్యాయమూర్తులు చేసిన వ్యాఖ్యలు సామాజిక న్యాయానికి విరుద్ధంగా ఉన్నాయన్నారు. ఉచిత పథకాల వలన పేదలు సోమరిపోతులుగా తయారవుతున్నారని, వ్యవసాయపనులకు వారు రావడం లేదని చెప్పడం ఏ మాత్రం సరైనది కాదన్నారు. ఉచిత పథకాలకు వ్యతిరేకంగా మాట్లాడుతున్న వారు ఎవరైనా తమ వైఖరిని మార్చుకోవాలని, పెరుగుతున్న ఆర్థిక అంతరాలను తగ్గించేందుకు, సామాన్య ప్రజలకుసామాజిక న్యాయం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు.

## మార్క్‌ఫెడ్‌తో మిర్చి కొనుగోలు

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ సుధాకర్‌రెడ్డి డిమాండ్



ప్రజాపక్షం/మరిపెడ : మిర్చిపంటను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కురవి శివారులో మిరప కల్లాలను సిపిఐ బృందం సందర్శించి మిర్చి రైతాంగంతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిరప పంట పండించడానికి రైతాంగం ఎకరాలకు లక్ష నుంచి లక్షా యాభైవేలు వరకూ పెట్టుబడిపెట్టి పంట పండించి మార్కెట్‌కు తీసుకు పోగా మును పెన్నడూ లేని విధంగా రూ.10వేల నుండి 12వేలుకు కొనుగోలు చేయడంతో రైతాంగం విలవిలలాడుతుందన్నారు.ప్రభుత్వంరంగ సంస్థల ద్వారా క్వింటా మిర్చికి రూ.20వేల నుండి రూ.25వేల వరకూ కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కురవి మండల కార్యదర్శి కరణం రాజన్న, బుర్ర సమ్మయ్య, కన్నె వెంకన్న, గజ్జి చంద్రయ్య, జిన్నె సూర్యనారాయణ, కందుల శరత్ పాల్గొన్నారు.

## సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు

### ఎఐటియుసి ఆర్జీ వన్ అధ్యక్షులు ఎంఎ గౌస్ డిమాండ్



ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధి: సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులుగా పని చేస్తున్న వారికి జెబిసిసిఐ నిర్ణయించి న హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని, ప్రతి నెలా 7వలోపు వేతనాలు చెల్లించే విధంగా యాజమాన్యం తగు చర్యలు తీసుకోవాలని గురువారం రామగుండం పర్యటనకు వచ్చిన సింగరేణి సిఅండ్ఎండికి కార్మికుల సమ స్యల పరిష్కారం కోసం వినతి ఇవ్వడం జరిగిందని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆర్జీ వన్ అధ్యక్షులు ఎం.ఎ. గౌస్ పేర్కొన్నారు. శుక్రవారం గోదావరిఖని విఠల్ నగర్, పైవింక్లయిన్ ఏరియాల్లో ఉన్న కాంట్రాక్టు కార్మికులను కలిసి అనంతరం జరిగిన వేర్వేరు సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ సింగరేణిలో దాదాపు ముప్పై వేల మంది కార్మికులు పని చేస్తున్నారని, వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం రామగుండం రీజియన్‌లో పర్యటనకు వచ్చిన సింగరేణి సిఅండ్ ఎండి బలరాం నాయక్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు ప్రస్తుతం ఇస్తున్న వేతనాలు సరిపోవడం లేదని, వారికి వేతనాలు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి నెలా 7వ తేదీ లోపు చెల్లించాల్సిన వేతనాలు 20వ తారీకు వరకు కూడా చెల్లించడం లేదని, దీని వల్ల వారు సకాలంలో వేతనాలు అందక అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటియుసి గౌరవ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో డిమాండ్ చేసినట్లు పేర్కొన్నారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్క రించేందుకు యాజమాన్యం చొరవ చూపాలని, లేని యెడల ఎఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఎఐటియుసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆర్జీ వన్ బ్రాంచి ఉపాధ్యక్షులు కోటవెంకన్న అధ్యక్షతన జరిగిన ఈ సమా వేశంలో నాయకులు వరికొప్పుల కొమరమ్మ,దేవమ్మ, పద్మ, సారయ్య, మహేశ్, కాంట్రాక్టు కార్మికులు, తదితవరులు పాల్గొన్నారు.



## స్థానిక ఎన్నికలలో సిపిఐ పోటీ

### సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు షఫి అహ్మద్

ప్రజాపక్షం/సదాశివపేట:త్వరలో జరిగే స్థానిక సర్పంచ్ ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికల్లో సంగారెడ్డి నియోజకవర్గంలో పార్టీ బలంగా ఉన్న చోట అభ్యర్థులు పోటీలో ఉంటారని సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు షఫి అహ్మద్ అన్నారు. శుక్రవారం సదాశివపేటలో సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రేషన్ కార్డుల కోసమేప్రభుత్వం ప్రజాపాలనలో మొన్నమల్లి ప్రజల నుండి రేషన్ కార్డులకు దరఖాస్తులు స్వీకరించి ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం సరైంది కాదన్నారు. మళ్లీ ఇప్పుడు మీ సేవలో రేషన్ కార్డు కోసం మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ కార్య క్రమంలో సిపిఐ నాయుకులు తాజుద్దీన్, యాదమ్మ, రమేష్, మంజుల తదితరులు పాల్గొన్నారు.



## మార్చి 25 నుంచి రాష్ట్ర రైతు సంఘం మూడవ రాష్ట్ర మహాసభలు

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : రాష్ట్ర రైతు సంఘం మూడవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయా లని రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ అన్నారు. 3వ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం సమావేశం అధ్యక్షులు నర్ర రామారావు అధ్యక్షతన శుక్రవారం జరగగా ఈ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులకు జరుగుతున్న అన్యాయం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు కల్పించాల్సిన వసతులపై సుధీర్ఘంగా చర్చ నిర్వహిస్తూ సమస్యలకు పరిష్కారం చూపిస్తుందన్నారు. మార్చి 25, 26, 27న బీఎల్ఎన్ గార్డెన్‌లో నిర్వహించే ఈ మహాసభకు కార్మిక కర్షకులు పెద్దసంక్యలో హాజరవ్వాలని కోరారు. అనం తరం మహాసభల కరపత్రాలను నర్ర రామారావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కంజర భూమయ్య, రాజే శ్వర్, సుధాకర్, న ర్సింలు, రాజారెడ్డి, రవీందర్, దశరథ్, ఓమయ్య, విఠల్‌గౌడ్, నర్సింలు, రఘురాంనాయక్, అంజలి, రాధాకుమార్, దేవ య్య,ఫిరోజ్, కిష్టయ్య, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

## కొర్రీలతో రైతులను నిండా ముంచుతున్న మిల్లర్లు

### తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రజినీకాంత్



ప్రజాపక్షం/చిట్యాల: కొర్రీల పేరుతో పత్తి కొనుగోల్లలో సర్వర్ సమస్యల పేరుతో పత్తి రైతులను మిల్లర్లు నిండ ముంచుతున్నారని తెలంగాణ రైతు సంఘం భూపాలపల్లి జిల్లా కార్యదర్శి చింతల రజినీకాంత్ అన్నారు. మండలంలోని శాంతినగర్ శి వారులోని ఆంజనేయ ఆగ్రో కాటన్ ఇండస్ట్రీలో సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని తెలం గాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చింతల రజినీకాంత్ గురువారం రైతు సంఘం నాయకులతో కలిసి సం దర్శించి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా ప్రామాణిక ఆధార్, సర్వ ర్ సమస్యల వలన పత్తి కొనుగోళ్లు నిలిచిపోయాయని, రైతులకు సమాచారం లేక కొనుగోలు కేంద్రాలకు వచ్చి పత్తిని తిరిగి ఇండ్లలోకి తీసుకెళ్లలేక కూలీల డబ్బులతో ఇబ్బందులు తలెత్తడంతో ప్రైవేట్ కొనుగోలుదారులకు కొర్రీలతో తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశార న్నా రు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు దృష్టి సారించి సాంకేతిక సమస్యలను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సం ఘం మండల కార్యదర్శి పోతవేణి కుమార్, అధ్యక్షులు వాయిలాల రమేష్, రైతులు జి.శ్రీకాంత్, పి.దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎఐటియుసి మెంబర్‌షిప్‌లో ఆర్థిక తోడ్పాటు అందించండి

### కార్మికులకు ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం పిలుపు

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : సింగరేణి వ్యాప్తంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి యూనియన్‌కు మెంబర్ షిప్ సేకరించే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆర్జీ వన్ ఏరియా లోని జిడికె 11వ ఇంక్లైన్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. దీనిలో ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్య దర్శి ఆరెల్లి పోషం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్‌కు అధిక సంఖ్యలో మెంబర్ షిప్ చేయాలని ఆయన గని పిట్ కమిటీ నాయకులకు సూచించారు. సింగరేణి లో నిరంతరం కార్మిక వర్గ సంక్షేమం కోసం వారి హక్కుల సాధన కోసం పోరాటాలు, ఉద్యమాలు చేస్తున్న ఏఐటియుసి కి కార్మిక వర్గం అధిక సంఖ్యలో యూనియన్ మెంబర్ షిప్ లో పాల్గొని ఆర్థిక తోడ్పాటును అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి పిట్ సెక్రటరీ నాయిని శంకర్, సహాయ కార్యదర్శి గొడిశల నరేశ్, నాయకులు చెప్యాల భాస్కర్, పొన్నం రంజిత్, ఎం.డి.రియాజ్, సాయి క్రిష్ణ , అంగిడి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ వీల్ సర్వీసెస్ ఉమెన్ వాలీబాల్ కెప్టెన్‌గా సుధా కీర్తి



**ప్రజాపక్షం/అల్వాల్:** అల్వాల్ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కు చెందిన సూపర్వైజర్ సుధా కీర్తి చెన్నైలో గొప్ప అవకాశం లభించింది. నేటి నుండి 18వ తేదీ వరకు జరిగే ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్ కి తెలంగాణ సివిల్ సర్వీసెస్ ఉమెన్ వాలీబాల్ కెప్టెన్ గా ఎంపికయింది. ఆమెకు అల్వాల్ ఐసిడిఎస్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

# మహానగరి

## యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా శివ చరణ్‌రెడ్డి

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ యూఅధ్యక్షులు జక్కిడి శివచరణ్‌రెడ్డి గాంధీభవన్‌లో శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నవాబుపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తలారి శేఖర్ శివచరణ్‌రెడ్డి ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యు నవాబుపేట్ మండల అధ్యక్షులు టిప్పు సుల్తాన్ , యువజన నాయకులు జగదీష్, ప్రశాంత్, భుజంగం తదితరులు పాల్గొన్నారు.




## బధిరులు అన్ని రంగాల్లో రాణించాలి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** బధిరులు అధైర్యపడకుండా అందరితో సమానంగా అన్ని రంగాల్లో పోటీపడి రాణించాలని హెలెన్ కెల్లర్స్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ ఫౌండర్ చైర్మన్ లయన్ పఠాన్ ఉమ్మర్ కాన్ సూచించారు. శుక్రవారం సంస్థలో జరిగిన జన్మదిన వేడుకల్లో బధిర విద్యార్థులు నృత్యాలు పలువురిని ఆకట్టుకొన్నాయి. ఈ కార్యక్రమంలో ప్రమీల, బధిర విద్యార్థుల తల్లిదండ్రులు శ్రీధర్,సాజిదా. శశిధర్ రెడ్డి, ఆర్ముగం, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



## జెడ్‌పి స్కూల్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

**ప్రజాపక్షం/చర్లపల్లి :** నాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఎనిమిదవ తరగతి చదివే ముగ్గురు విద్యార్థులకు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ మంజూరైంది. ఈ విద్యార్థులు తొమ్మిదో తరగతి నుండి ఇంటర్ పూర్తయ్యే వరకు ప్రతి ఏటా స్కాలర్‌షిప్‌లు పొందుతారు. ఈ సందర్భంగా స్కాలర్‌షిప్‌లు పొందిన విద్యార్థులు తోషన్ రత్నం, ప్రజ్వల, చందనలతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు అరవింద్ కుమార్, వనజ, రాజ్యలక్ష్మి , శ్రీదేవి, పాండు, రఘు, అజీజ్ అహ్మద్, వరమ్మ, వందన, గాయత్రి, సంజయ్, రాణి, సత్యశ్రీ, సంధ్యారాణి, వాలంటీర్లు స్వప్న, శ్రీవిద్య, అల్కాలను ప్రధానోపాధ్యాయులు పిసి రాములు అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రాములు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పథకం ద్వారా ఆర్థికంగా వెనుక బడిన, ప్రతిభ కల విద్యార్థులను ఆదుకొనేందుకు గాను పోటీ పరీక్షల ద్వారా విద్యార్థులను ఎంపికచేసి ఇంటర్ పూర్తయ్యే వరకు ప్రతి ఏటా నెలకు రూ.1000 చొప్పున ఏడాదికి మొత్తం రూ.12000 ఉపకారవేతనంగా అందిస్తారని తెలిపారు.

## కారు ప్రమాదంలో వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఓఆర్‌ఆర్‌పై గార్డెనింగ్ పనులు చేస్తున్న కూలీని కారు ఢీకొట్టిన ఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓఆర్‌ఆర్ 66 కిలోమీటర్ సమీపంలో కీసర గ్రామానికి చెందిన మాసపాక పరుషరాములు(39) తోటి కూలీలతో కలిసి గార్డెనింగ్ పని చేస్తున్నాడు. ఈ క్రమంలో కీసర వైపు నుంచి (ఎంహెచ్ 13డిటి5429) ఎర్టిగా కారును నడుపుతున్న అశుతోష్ విశ్వాస్ కారును వేగంగా, నిర్లక్ష్యంగా నడపుతు పరుషరాములును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో పరుషరాములు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కిటికీ మీద పడి చిన్నారి మృతి



**ప్రజాపక్షం/పరిగి రూరల్ :** కిటికీ పడి చిన్నారి మృతి చెందిన ఘటన వికారాబాద్ జిల్లా పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ సంతోష్ కుమార్, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దోమ మండల పరిధిలోని బ్రాహ్మన్ పల్లి తండాకు చెందిన చంది భాయ్ పరిగి పట్టణంలోని బాలాజీ నగర్‌లో కూలిపని చేయడానికి వచ్చే సమయంలో తన కూతురిని వెంట తీసుకువచ్చింది. ఆమె కూలీ పనిచేస్తుండగా చిన్నారి అమూల్య వయసు నాలుగు సంవత్సరాలు ఆడుకుంటూ గోడకు నిలబెట్టిన కిటికీని తాకడంతో చిన్నారి మీదపడి గాయాలు అయ్యాయి. చిన్నారిని వెంటనే పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అమూల్య మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## గౌడ కులస్తుల అభివృద్ధికి సహకరిస్తా: ఎమ్మెల్యే బండారి

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** గౌడ కులస్తుల అభివృద్ధికి తన వంతుగా ప్రభుత్వపరంగా లభించే సౌకర్యాలను అందించేలా సహకరిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపా రు. శుక్రవారం బిసి సంక్షేమ శాఖ ద్వారా నియోజకవర్గంలోని ఏడు గు రు గీత కార్మికులకు మంజూరైన కాటమయ్య రక్ష కిట్స్‌ను అందచేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీత కార్మికులు తమ వృత్తిలో భాగం గా తాటిచెట్లు ఎక్కేప్పుడు ఎలాంటి ప్రమాదాలకు గురి కాకుండా ఉండేందుకు గాను ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన రక్ష కిట్లు అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మీర్పేట్ హెచ్‌బి కాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, బిఆర్‌ఎస్ నేతలు మహేష్ గౌడ్, జంపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## వ్యవసాయ శాఖ మంత్రిని కలిసిన పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్

**ప్రజాపక్షం/పరిగి :** పరిగి ఎమ్మెల్యే రామోహన్‌రెడ్డి తో కలసి పరిగి మార్కెట్ కమిటి చైర్మన్ పరశురాంరెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో వ్యవసాయ మార్కెట్ శఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును అతని నివాసంలో మార్యాదపూర్వకంగా కలిసి పరిగి మార్కెట్ కమిటి అభివృద్ధి కొరకు నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. మంత్రి సానుకులంగా స్పందించడం జరిగింది అన్నారు. త్వరలో పరిగి మార్కెట్ కు కావలసిన పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తామని మంత్రి హామి ఇచ్చినట్లు తెలిపారు.

# వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారం

### శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** వికారాబాద్ జిల్లాలో ప్రభుత్వ వసతి గృహాలలో ఉంటున్న విద్యార్థులను వార్డెన్లు తమ స్వంత పిల్లలుగా భావించి వారికి ఆరోగ్యకరమైన ఆహారం అందించాలని రాష్ట్ర శాసనసభా స్పీకర్ ప్రసాద్‌కమార్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జిల్లాలోని 104 ఎస్‌సి,ఎస్‌టి, బిసి, మైనార్టీ ప్రభుత్వ గురుకుల వసతి గృహాలకు శాసనమండలి చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ట్రైనింగ్ కలెక్టర్ ఉమాహారతితో కలిసి 25లక్షల విలువైన వంట సామగ్రి వార్డెన్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని నిధులను సమీకరించి ప్రభుత్వ వసతి గృహాలకు వంట సామాగ్రిని అందించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ హాస్టల్స్‌లో వసతుల కల్పనకు ప్రభుత్వం నుంచి నిధులను మంజూరు చేయించడం నావంతు కృషి చేస్తానని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం 7శాతం పై నిధులను విద్యాశాఖకు కేటాయిచిందని అన్నారు. వంటసాగాగ్రితో వసతి గృమల్లో వంటలు మరింత సులభంగా, పరిశుభ్రంగా చేయాడానికి ఉపయోగపడుతాయని, విద్యార్థులకు పౌష్టికాహారం అందుతుందని అన్నారు. రాష్ట్రంలో డైట్ చార్జీలు 401శాతం, కాస్మోటిక్ చార్జీలు 200శాతం పెంచుతు విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకున్నారు. నాణ్యమైన భోజనం పెడుతున్నారా లేదా అనేది జిల్లా కలెక్టర్ ఇతర ఉన్నతాధికారులు హాస్టళ్లను సందర్శించాలని ఆదేశించారు. ప్రభుత్వం విద్యావ్యవస్థలో పాఠశాలలు, వసతి గృహాలను ఆధునీకరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ 25లక్షలతో సామాగ్రి పంపిణీ చేయడం సంతోకరం అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఉండే ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ వసతిగృహాలను తనిఖీ చేయడం జరిగింది అన్నారు. ముఖ్యంగా బాలికలకు టాయిలెట్స్, వాష్ రూమ్, త్రాగునీరు, ప్యాన్లు, లైట్స్, మౌలిక వసతులపై దృష్టి పెట్టి ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఓ శ్రీనివాస్, మల్లేశం, ఉపేందం,తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ హయాంలోనే రోడ్లకు మహర్దశ :** కాంగ్రెస్ హయాంలోనే రోడ్ల అభివృద్ధి సాధ్యమని స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం కోట్‌పల్లి మండలంలోని మోత్కుపల్లి నుండి వికారాబాద్ తేజ ఫంక్షన్ హాల్ వరకు రూ.30కోట్లతో సింగిల్ లైన్ ను డబుల్ లైన్ రోడ్డుగా చేసే అభివృద్ధి కార్యక్రమానికి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, చెవెళ్ళ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరై... శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ... పేదల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయమని, పేదోడికి సొంతింటి కలను తీర్చడంతో పాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశల వారీగా నేరవేరుస్తూ... రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని అన్నారు. అనంతరం చెవెళ్ళ ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ... రూ.30 కోట్ల సిఐఆర్ఎఫ్ నిధులతో 15 కిలోమీటర్ల మేర (మోత్కుపల్లి నుండి వికారాబాద్ వరకు కలుపే) ప్రధాన రోడ్డు మార్గానికి కేంద్ర ప్రభుత్వం నిధులను విడుదల చేయడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు మాధవ్‌రెడ్డి, వికారాబాద్ నియోజకవర్గ కోఆర్డినేటర్ ( దిశ కమిటీ మెంబర్) వడ్ల నందు, మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డకింది అంజయ్య, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింగ్ నాయక్, బిజెపి మండల అధ్యక్షుడు కందూరి శివకుమార్, నాయకులు, తదితరులు ఉన్నారు.



## మొబైల్ ఉమెన్స్ కేన్సర్ స్క్రీనింగ్ యూనిట్ ఉచిత శిబిరం సద్వినియోగం చేసుకోవాలి

### మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్



**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ మున్సిపాలిటీ 27వ వార్డ్ లో గ్రానుల్స్ ఇండియా లిమిటెడ్ మరియు ఎఐజి హాస్పిటల్ వారిచే ఉచ్చిత రొమ్ము క్యాన్సర్ పరీక్షలు, అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కోట్ల రూపాయలు విలువ చేసే టెక్నాలజీ తో మహిళా మణులకు ఉచిత పరీక్షలు నిర్వహించడంతో పాటు అవగాహన కల్పించి సమస్యలు ఉంటే అందుకు అయ్యే ఖర్చులు భరించడం చాలా గొప్ప నిర్ణయం అని గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ వారికి కృతజ్ఞతలు తెలిపి అభినందనలు తెలిపారు. స్థానిక మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్ ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రజ్ఞ చిగురుపాటి వారి బృందం పాల్గొని గ్రామములో తిరిగి అవగాహనా కల్పించి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. అదే విధంగా ప్రతి ఆరు నెలల్లో ఒక సారి ఈ పరీక్షలు చేయించుకుని శిబిరానికి వచ్చిన మహిళలకు ఉద్దేశించి అవగాహన పరిచారు. మేడ్చల్ జిల్లా పరిధిలోనీ ప్రతి వార్డు గ్రామములో గ్రానుల్స్ ఇండియా కంపెనీ తరుపున నిర్వహించడం జరుగుతుందని అందుకు అందరు సద్వినియోగం చేసుకోవాలి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజ్ఞ చిగురుపాటి బ్రిందాము స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణమూర్తి సేవలు ఆదర్శనీయం మహిళా సమాఖ్య



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సిపిఐ నాయకుడు కామ్రేడ్ కృష్ణమూర్తి కుటుంబ సభ్యులను మహిళా సమాఖ్య నేతలు శుక్రవారం పరామర్శించారు. దివంగత కృష్ణమూర్తి కొనసాగించిన ప్రజా సేవలు ఆదర్శనీయమని కొనియాడిన సమాఖ్య నేతలు కె.ప్రమీల, సిహెచ్ మాధవి, కె.మహాలక్ష్మి , కె.నర్సమ్మలు ఆయన సతీమణి కామ్రేడ్ గిరిజా కృష్ణమూర్తికి ధైర్యం చెప్పారు.



## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** విద్యతో పాటు అన్ని రంగాల్లో పోటీతత్వంతో ముందుకు వెళ్లి దేశానికి వన్నెతెచ్చే స్థాయికి చేరుకోవాలని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి అన్నారు. నాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రోటరీ క్లబ్ జూబ్లిహిల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో చెవి, ముక్కు, గొంతు, కళ్లు పరీక్షలు చేసారు. అనంతరం అవసరమైన విద్యార్థినీ విద్యార్థులకు ఉచితంగా కళ్ల జోళ్లను రోటరీ క్లబ్ ప్రతినిధులు రాజగోపాల్, రాజకృష్ణ, అరుణ్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కంకర పరిచారు..పనులు మరిచారు.. అధికారుల నిర్లక్ష్యమే కారణం



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తూంకుంట మున్సిపాలిటీ పోతాయిపల్లిలో మున్సిపల్ నిధులతో చేపట్టిన సిసి రోడ్డు పనులు అర్ధాంతరంగా నిలిచాయి. గ్రామంలోని ప్రధాన రోడ్డు గతంలో గుంతలమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానిక కౌన్సిలర్ హరిబాబు, చైర్మన్ కారంగుల రాజేశ్వర్‌రావుల సహకారంతో తూంకుంట పురపాలక సంఘం (జనరల్ ఫండ్) రూ.33 లక్షలతో సిసి రోడ్డు పనులకు ప్రారంభించారు. కాగా ఈ రోడ్డు వేయడానికి అధికారులు రోడ్డు మార్కింగ్‌లో సరైన మార్గనిర్దేశాలు చేయకపోవడంతో సిసి రోడ్డు పనులు నిలిచిపోయాయి. రోడ్డు వెడల్పులో భాగంగా పరిమితిని దృష్టిలో పెట్టుకుని రోడ్డు వేయాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదని స్థానికుల నుంచి పిర్యాదులు అందడంతో రోడ్డు పనులు నిలిపి వేశారని సమాచారం. కాగా గత కొద్ది రోజుల నుంచి రోడ్డుపై కంకరపోసి వదిలేయడంతో రోడ్డు వెంబడి నడవాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజావాణిలో పిర్యాదు చేయడంతో రోడ్డు పనులు నిలిపివేశారు. సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించి రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## బస్తీ దవాఖానలలో వైద్య సేవలు వినియోగించుకోవాలి

### డిఎంహెచ్ఒ డాక్టర్ ఉమాగౌరి

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** తమ సమీప ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాలలో అందుబాటులో ఉన్న వ్యాధి నిర్ధారణ పరీక్షలు, వైద్య చికిత్సలను అవసరమైన సందర్భాల్లో వినియోగించుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి (డిఎంహెచ్ఓ) సి.ఉమాగౌరి సూచించారు. శుక్రవారం దమ్మాయిగూడ, రాజీవ్ గృహకల్పలలోని బస్తీ దవాఖానా, కీసరలోని సబ్ సెంటర్, కీసరలోని ఆరోగ్య వెల్నెస్ సెంటర్‌లను ఆకస్మికంగా తనిఖీ చేసారు. నేరుగా రోగులతో మాట్లాడిన ఆమె ఏ మేరకు చికిత్సలు లభిస్తున్నాయని అడిగి తెల్సుకొన్నారు. ఉద్యోగుల హాజరీ రిజిస్టర్లు, అవుట్ పేషంట్, మందుల రిజిస్టర్లను పరిశీలించారు. కీసరలో నిర్మాణంలో ఉన్న ఆరోగ్య వెల్నెస్ సెంటర్ భవన నిర్మాణ పనులను పరిశీలించి కంట్రాక్టర్, ఆర్ అండ్ బి అధికార్లతో మాట్లాడి బోర్‌వెల్, విద్యుత్ ఏర్పాట్లను పటిష్టంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని కొంతమంది కబ్జా చేస్తున్న విషయాన్ని గుర్తించిన డిఎంహెచ్ఓ దీనికి సంబంధించి నివేదిక సమర్పించాలని కీసర వైద్యాధికారిని ఆదేశించారు.



## జాతీయ స్థాయి మహిళా కబడ్డీ పోటీలకు రాణి ఎంపిక



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** హర్యానా రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి కబ్బడ్డీ పోటీలకు తోగుట మండలం వరదరాజుపల్లికి గ్రామానికి చెందిన బొంగోని రాణి ఎంపికయ్యింది. గత ఆరు సంవత్సరాలుగా కబడ్డీలో అనేక రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటూ సిద్దిపేట జిల్లా కబ్బడ్డీ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించింది. కాగా జాతీయ స్థాయిలో కబడ్డిలో రాణిస్తున్న బొంగోని రాణి మేడ్చల్ జిల్లా మూడు చింతలపల్లి మండలంలోని ఎస్ఎస్ఆర్ స్కూల్లో పిఇటిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఆర్ స్కూల్ డైరక్టర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ కబడ్డీలో రాణిస్తు మా పాఠశాల విద్యార్థులకు కబడ్డీలో మెళకువలు నేర్పిస్తుందన్నారు. జాతీయ స్థాయి కబడ్డీలో హర్యానా రాష్ట్రంలో జరుగుతున్న పోటీల్లో పతకాలు సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాణిని పలువురు అభినందించారు.



## మహంకాళీ ఆలయ నూతన పాలక కమిటీ ప్రమాణ స్వీకారం

**ప్రజాపక్షం/కాప్రా :** ఉప్పల్‌లోని మహంకాళీ ఆలయ ట్రస్టీ బోర్డు నూతన పాలక కమిటీ చైర్మన్, ధర్మకర్తలు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేసారు. రాష్ట్ర ధర్మాదాయ శాఖ పరిధిలోకి చేరిన ఈ ఆలయ పాలక కమిటి చైర్మన్‌గా తెల్కల మోహనరెడ్డి, ధర్మకర్తలుగా మాశెట్టి రాఘవేంద్ర కుమార్, మీనంపలియల ఆండాలు, గుమ్మడెల్లి కృష్ణ, అలుగుల అనిల్ కుమార్‌లు ప్రమాణ స్వీకారం చేసిన వారిలో ఉన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ వీరేశం, ఇనస్పెక్టర్ ప్రణీత్,కాంగ్రెస్ నాయకుడు పరమేశ్వర్‌రెడ్డి, ప్రభాకర్, రఘునాథరెడ్డి, చందర్, బాలమణి, బస్తీవాసులు, ఉప్పల్ వైశ్య సంఘం, గౌడ సంఘం, కుమ్మరి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## 26కేజీల గంజాయి పట్టివేత



**ప్రజాపక్షం/ వికారాబాద్ ప్రతినిధి:** భువనేశ్వర్‌నుండి ముంబైకి వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో 26కేజీల ఎండు గంజాయిని పట్టుకున్నట్లు జిల్లా అబ్కారీ అధికారి విజయ భాస్కర్ తెలిపారు.విశ్వసనీయ సమాచారం మేరకు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంటు శ్రీనివాస్‌రెడ్డి అధ్వర్యంలో రైల్వే ఆఫిసార్ విశ్రాంత్రి భవనం పరిసర ప్రాంతంలో గంజాయి రవాణి ,అమ్మకాలపై దాడులు నిర్వహించారు. ఇందులో హౌర ,శిబిపూర్[పశ్చిమ బెంగాల్ ] కు చెందినస్నీ సేథ్ అనే వ్యక్తి వద్ద 26.789 కేజీల ఎండు గంజాయి లభించింది అని తెలిపారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ ప్రేమ్‌కుమార్‌రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ,శివరాం గణేష్ , మహేందర్,కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా స్థాయి జూనియర్ బాలబాలికల కబడ్డీ ఎంపిక పోటీలు

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా స్థాయి జూనియర్ బాలబాలికల కబడ్డీ ఎంపిక పోటీలు బాచుపల్లిలోని కాసాని కబడ్డీ అకాడమీలో జరుగుతాయని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కాసాని వీరేశ్ ముదిరాజ్ , చంద్రహాస్‌లు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్ జూనియర్ జిల్లా స్థాయి బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 15వ తేదీన జరుగుతాయని అన్నారు. ఎంపికైన జిల్లా జట్టు ఈనెల 20వ తేదీ నుండి 23వ తేదీ వరకు వికారాబాద్ జిల్లాలో నిర్వహించే 34వ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా జట్టు ప్రాతినిధ్యం వహిస్తుందని చెప్పారు. ఎంపికైన క్రీడాకారులు 01042009 తరువాత జన్మించిన వారై ఉండాలని, అబ్బాయిలు 55కేజీలు, అమ్మాయిలు 50కేజీల బరువు ఉండాలని, ఆధార్ కార్డు, పాఠశాల బోనఫైడ్ సర్టిఫికెట్‌తో బాచుపల్లిలోని కబడ్డీ అకాడమీలో మధ్యాహ్నం మూడు గంటల వరకు సయ్యద్ షకీల్ ను కలిసి ఇవ్వాలని, లేని పక్షంలో ఫోన్ నంబరు 7396749998ని సంప్రదించాలని సూచించారు.




## మార్చి 1,2 తేదీల్లో ఎఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

**ప్రజాపక్షం/కాప్రా :** ఎఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు మార్చి నెల 1,2 తేదీల్లో జరుగనున్నాయని ఇసిఐఎల్‌లో ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర తెలిపారు. శుక్రవారం ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్, ఉపాధ్యక్షుడు గిరిబాబు, శేఖర్, సాయిలు, శ్రీకాంత్, సుదర్శన్, విజయ్,రాజులతో కల్సి సమావేశాలకు సంబంధించి గోడ పత్రికలను ఈసిఐఎల్‌లోని నీలం రాజశేఖరరెడ్డి భవన్‌లో విడుదల చేసారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర, సత్యప్రసాద్‌లు మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న యువజన విధానాలపై ఈ సమావేశాల్లో చర్చిస్తారని, నిర్దిష్టమైన ప్రణాళికలను పాలకులకు పోరాటాల ద్వారా తెలియచేయనున్నామన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశాల్లో మొదటి రోజు సెమినార్ నిర్వహిస్తున్నామని, రెండో రోజు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి వచ్చే ఏఐవైఎఫ్ ప్రతినిధులు హాజరు అవుతారని తెలిపారు.

## సిఎం సహాయనిధి చెక్కు అందజేత

**ప్రజాపక్షం/తలకొండపల్లి:** తలకొండపల్లి మండలంలోని చౌదర్ పల్లి గ్రామానికి చెందిన కాలే ఎల్లమ్మ అనారోగ్యానికి గురై హైదరాబాదులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందింది. కాగా ఎల్లమ్మ ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో సిఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకుంది. ఎమ్మెల్యే సహకారంతో మంజూరైన సిఎం సహాయనిది చెక్కును శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఏమిరెడ్డి రవి కిరణ్‌రెడ్డి బాధితురాలు ఎల్లమ్మకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాలే బాల మైసయ్య, తడిసిన శ్రీరామ్ రెడ్డి, ఏమిరెడ్డి ప్రదీప్ రెడ్డి, కాలే మహేష్, శ్రీకాంత్, యాదగిరి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి

## రోడ్ల నిర్మాణానికి నిధులు

### కార్పొరేటర్ నర్సింహగుప్త వినతి




**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** డివిజన్‌లో రోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయాలని చైతన్యపురి డివిజన్ కార్పొరేటర్ రంగ నర్సింహగుప్త అధికారులను కోరారు. ఈమేరకు శుక్రవారం జిహెచ్ఎంసి తూర్పుజోన్ జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పోరేటర్ నర్సింహగుప్త మాట్లాడుతూ డివిజన్‌లో రోడ్లు నిర్మాణానికి టెండర్లు పూర్తయి సంవత్సరం కావస్తున్న పనులు ప్రారంభం కాలేదని, ఇప్పటికైనా నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలని కోరారు.

## ట్రైబల్ టీచర్ సమస్యల పరిష్కారానికి కృషి : మధుయాష్కీ




**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ట్రైబల్ టీచర్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి రాష్ట్రం ప్రభుత్వం సిద్ధంగా ఉందని టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. శుక్రవారం ట్రైబల్ టీచర్ అసోసియేషన్ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్, ట్రైబల్ టీచర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు శంకర్ నాయక్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ గిరిజన ప్రభుత్వ ఉద్యోగుల ఎదురుకుంటున్న సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. కార్యక్రమంలో ట్రైబల్ టీచర్ యూనియన్ నాయకులు లక్ష్మణ్ నాయక్, రాధాబాయి, శక్రు నాయక్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

### సంఘటన స్థలాన్ని పరిశీలించిన కార్పొరేటర్ లచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం కాగా.. సిలిండర్ పేలీ ఇంట్లో సామాగ్రి పూర్తిగా ధ్వసం అయింది. ఈ ఘటన బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని వైదేహి నగర్‌లో శ్రీషిరిడి సాయిబాబా ఆలయం సమీపంలో సాయి శంకర్ ఇంట్లో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంట్లో విద్యుత్ వైర్లతో షార్ట్ సర్క్యూట్ కావడంతో భారీ ఎత్తున మంటలు చెలరేగాయి. మంటలు రావడంతో చుట్టు పక్కల వారు గమనించి అగ్నిమాపక సిబ్బందిని సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలాని ఫైర్ సిబ్బంది చేరుకుని మంటలను అదుపులో తీసుకొచ్చారు. స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డిని శుక్రవారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. నష్టపోయిన ఇంటి యజమాన్యంతో మాట్లాడి వారిని ధైర్యం చెప్పారు. ప్రభుత్వం నుంచి వచ్చే నష్ట పరిహారం అందే విధంగా కృషి చేస్తామన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

### మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య



**ప్రజాపక్షం/కొత్తూరు:** తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న ప్రజల కష్టాలను తెలుసుకొని నూతనంగా బోరు వేయించినట్లు మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ తెలిపారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని ఫాతిమాపూర్ గ్రామంలో నూతనంగా వేసిన బోరు మోటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ లావణ్య మాట్లాడుతూ పట్టణంలో ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, కౌన్సిలర్ భ్యాగరి ప్రసన్నలత యాదయ్య, పార్టీ మండల అధ్యక్షుడు మెండే కృష్ణ యాదవ్, నేతలు అల్విన్‌రెడ్డి, దిలిప్‌రెడ్డి, లూథ్‌రెడ్డి, బాల్‌శివారెడ్డి పాల్గొన్నారు

## ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు వినతి



**ప్రజాపక్షం/తలకొండపల్లి:** రంగారెడ్డి జిల్లాలోని మారుమూల గ్రామమైన గట్టుఇప్పలపల్లిని ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు ఆ గ్రామస్తులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గట్టుఇప్పలపల్లి గ్రామం నుండి తలకొండపల్లి మండల కేంద్రానికి వెళ్లాలంటే గ్రామస్తులు సరైన సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని తీన్మార్ మల్లన్నకు వివరించారు. కార్యక్రమంలో జోలం వెంకటయ్య యాదవ్, గుండ్రతి లింగం గౌడ్, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆనంద్ కుటుంబానికి ఈటెల పరామర్శ



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** కుంభమేళ నుండి నగరానికి తిరిగి వస్తుండగా జబల్‌పూర్ జిల్లా సిహోరా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడం బాధాకరం అని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. ప్రమాదంలో మృతిచెందిన గడ్డిఅన్నారం డివిజన్ వివినగర్‌కు చెందిన గొల్కొండ ఆనంద్‌కుమార్ చారీ నివాసానికి స్థానిక కారొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డితో కలిసి ఎంపి ఈటల రాజేందర్ శుక్రవారం సందర్శించారు. ఆనంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతకుముందు ప్రమాదంలో గాయపడి సంజీవిని ఆసుప్రతిలో చికిత్స పొందుతున్న కొత్తపేట చెందిన నవీన్‌చారిని పరామర్శించి డాక్టర్లతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఈటల విలేకరులతో మాట్లాడుతూ మహాకుంభమేళా తిరుగు ప్రయాణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్ వాసులు మృతి చెందడం బాధాకరమన్నారు. జరిగిన ఘటనపై వారి కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేలా చూస్తానన్నారు. మధ్యప్రదేశ్‌లో ప్రమాదం జరిగింది. అక్కడ ప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వం కూడా ఆదుకునేలా కోరుతామన్నారు. కార్యక్రమంలో దాసరి మల్లేషం, కొత్త రవిందర్‌గౌడ్, ఆనంద్‌కుమార్, జయప్రకాష్, ఏనుగు శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

## విఆర్‌ఎ వారసులకు ఉద్యోగాలివ్వాలని కోరుతూ

# 17న చలో హైదరాబాద్

### విజయవంతం చేయాలని ఎంపి ఆర్.కృష్ణయ్య పిలుపు



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం 61 ఏళ్ల వయస్సు పైబడిన విఆర్‌ఎల వారసులకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య తెలిపారు. విఆర్‌ఎల వారసులు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో నిరుద్యోగ జెఎసి చైర్మన్ నీల వెంకటేష్, విఆర్‌ఎ వారసుల జెఎసి అధ్యక్షులు ఆంజనేయులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం 2020 సెప్టెంబర్ 9న విఆర్‌ఎలతో చర్చలు పేస్కేల్, వారసులకు ఉద్యోగాలిస్తామని ప్రకటించి, జి.ఒ.81, 85లను విడుదల చేసిందని గుర్తుచేశారు. ఈ జిఒల ప్రకారం తమకు ఎలాగైనా ఉద్యోగాలు వస్తాయని నమ్మకంతో విఆర్‌ఎ వారసులు 15 నెలలుగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. మొత్తం 20,555 విఆర్ఒలుకాగా, వివిధ శాఖల్లో 16,758 మందిని సర్దుబాటు కాగా, మిగిలిన 3,797 మంది విఆర్‌ఎ వారసులకు ఉద్యోగ ఉత్తర్వులివ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. చదువుకొన్న విఆర్‌ఎ వారసులకు ఉద్యోగం ఇవ్వడంవల్ల రెవెన్యూ వ్యవస్థ బలోపేతం అవుతుందని చెప్పారు. సిఎం రేవంత్‌రెడ్డి, సంబంధిత మంత్రి జోక్యం చేసుకొని, విఆర్‌ఎ వారసులకు ఉద్యోగాలిచ్చాలే చర్యలు చేపట్టాలని కృష్ణయ్య కోరారు. సమావేశంలో సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం, యువజన రాష్ట్ర అధ్యక్షులు జిలపల్లి అంజి, జెఎసి ప్రతినిధులు సంగీత, రవి యాదవ్, అనిల్, శ్రీను, లక్ష్మి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## మా ప్లాట్లలో అక్రమ కట్టడాలు కూల్చేయండి

### ఐలాపూర్ రాజగోపాల్ నగర్ అసోసియేషన్ విజ్ఞప్తి



**ప్రజాపక్షం/ ఖైరతాబాద్:** తమ కష్టార్జితంతో కొన్న ప్లాట్‌లలో వెలిసిన అక్రమ కట్టడాలను కూల్చివేసి, న్యాయం చేయాలని ఐలాపూర్ రాజగోపాల్ నగర్ అసోసియేషన్ ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వానికి, హైడ్రాకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో అసోసియేషన్ ప్రతినిధులు లక్ష్మీ నారాయణ, సందీప్ కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, రమేశ్ తదితరులు మీడియాతో మాట్లాడారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం, ఐలాపూర్ పరిధిలోని సర్వేనం.119 నుంచి 220లోని 408 ఎకరాల్లో కొన్నేండ్ల క్రితమే 5వేలకుపైగా ప్లాట్‌లను సేల్ డీడ్ ద్వారా అసోసియేషన్ సభ్యులు కొన్నారని, దీనికి సంబంధించి అన్ని డాక్యుమెంట్స్ ఉన్నాయని తెలిపారు. అయితే, ఇందులోని 40 ఎకరాలను స్థానిక నివాసి ముఖీమ్ అనే వ్యక్తి దౌర్జన్యం చేస్తూ తన అనుచరులతో కబ్జా చేశారని ఆరోపించారు. దీనిపై హైకోర్టును ఆశ్రయిస్తే, తుది తీర్పు వచ్చేంతవరకు ఈ భూమిపైకి వెళ్లొద్దని ఉత్తర్వులిచ్చిందని గుర్తుచేశారు. అయినా, కబ్జాదారులు హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ ఈ 40 ఎకరాల్లో అక్రమ కట్టడాలు, ప్రహారి నిర్మించడమేగాకుండా అమాయలకు నోటరీ ద్వారా ప్లాట్లు అమ్మి మోసం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

## అమరవీరుల కుటుంబాలను ఆదుకోండి

### వంగపల్లి శ్రీనివాస్ విజ్ఞప్తి



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** ఎస్‌సి వర్గీకరణ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన మాదిగ అమరవీరుల కుటుంబాలకు ఇంటికో ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లుతోపాటు రూ.50లక్షల చొప్పున నగదు అందజేసి, ఆదుకోవాలని తెలంగాణ ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ సిఎం రేవంత్‌రెడ్డిని కోరారు. శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో మాదిగ అమరవీరుల కుటుంబసభ్యులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ మార్చి 1న మాదిగ అమరవీరుల సంస్మరణ సభ నిర్వహిస్తామని, ఈసందర్భంగా అమరుల కుటుంబాలను సన్మానిస్తామని తెలిపారు. మాదిగ అమరవీరుల స్థూపం,స్మారక మ్యూజియాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని కోరారు. మాదిగ అమరవీరుల కుటుంబాలను మందకృష్ణ పరామర్శించకపోవడం విచారకరమన్నారు. సమావేశంలో మాదిగ అమరుడు పొన్నాల సురేందర్ తల్లిదండ్రులు యాదయ్య,గంగమ్మ, అమరుడు మహేష్ మాదిగ తల్లిదండ్రులు ఇందిరమ్మ, అంజయ్య, సభ్యులు బంగారు శీను, పొట్ట పెంజర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం

### ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని వెంకటేశ్వర కాలనీలో భూగర్భ డ్రైనేజీ సమస్యలను త్వరలోనే పరిష్కారం చేస్తామని ఎల్‌బి నగర్ ఎంఎల్‌ఎ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గచ్చిబౌలిలోని ఎంఎల్‌ఎ నివాసంలో బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ బిఆర్‌ఎస్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి ఆధ్వర్యంలో వెంకటేశ్వర కాలనీ సంక్షేమ అధ్యక్షులు పి. కృష్ణ కలిసి డ్రైనేజీ సమస్యను ఎంఎల్‌ఎకు వివరించారు. అనంతరం ఎంఎల్‌ఎ సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ డ్రైనేజీ సంబంధిత అధికారులతో మాట్లాడి 100 ఫీట్ల డ్రైనేజీ పైప్ లైన్‌పై అధికారులతో ప్రణాళిక సిద్ధం చేసి పనులను ప్రారంభించే విధంగా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు వారు తెలిపారు. వెంకటేశ్వర కాలనీ డివిజన్ శివారు కాలనీ కావడంతో ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుని, పనులు చేపట్టాలని కోరారు. అనంతరం కాలనీ వాసులు ఎంఎల్‌ఎ సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు డ్రైనేజీ పనులను కాలనీ సంక్షేమ వాసులు ప్రారంభించి, ఎంఎల్‌ఎ సుధీర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పోగుల రాంబాబు, లక్ష్మ చారి, బొమ్మరాజు శ్రీను పాల్గొన్నారు.

## వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా

# ప్రణాళికాబద్ధంగా ముందస్తు చర్యలు

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** రాబోయే వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో ప్రణాళిక బద్ధంగా పనిచేస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనం సమావేశ మందిరంలో కలెక్టర్ సి.నారాయణరెడ్డి తాగునీటి సరఫరాపై సంబంధిత ఇఇ, డిఇ, ఎఇలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో మిషన్ భగీరథ గ్రిడ్ ఇంటింటికి తాగునీటి సరఫరాలో భాగంగా చేపట్టిన పనులు, ప్రస్తుతం నీటి సరఫరా జరుగుతున్న ఆవాసాలు, వాటర్ సోర్స్, ఇతర ఇబ్బందులు, తదితర అంశాలపై కలెక్టర్ డివిజన్ వారీగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భం గా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ రాబోయే వేసవి కాలంలో నీటి సరఫరా సమస్యలు ఎక్కడ ఉత్పన్నమవుతాయో ముందస్తుగా గుర్తించి తక్షణమే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలని, ఏమైనా సమస్యల ఉంటే వాటిపై దృష్టి పెట్టి ఎక్కడ తాగునీటి సరఫరాలో సమస్యలు రాకుండా చూడాలని అధికారులకు తగు సూచనలు చేశారు. గ్రామ పంచాయతీ పరిధిలో ప్రస్తుత నిధులతో పైప్ లైన్లు, చిన్న చిన్న మరమ్మతులు చేయించి నీటి ఎద్దడిని నివారించాలని తెలిపారు. మండల, మున్సిపల్ పరిధిలో సమన్వయంతో పనిచేసి రాబోయే వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ప్రణాళిక బద్ధంగా పని చేయాలని సూచించారు. గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకుల ద్వారా నివాస ప్రాంతాలకు తాగునీరు అందే విధం గా పనులు చేపట్టాలన్నారు. నీటి పంపులు, మోటర్లు, వాల్స్‌లు పైపులకు సంబంధించి మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఎక్కడైతే సమస్యలు ఉన్నాయో ఆయా గ్రామాలు నీటి సరఫరా అధికారులు సందర్శించి అందుకు కావలసిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో నీటి సరఫరా చేయాలని తెలిపారు. సమావేశంలో మిషన్ భగీరథ ఇఇ ఎస్.రాజేశ్వర్, డిఇలు, ఎఇలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మణికొండ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

### ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**ప్రజాపక్షం/గండిపేట:** రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మణికొండ మున్సిపాలిటీని పార్టీలకతీతంగా ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో రూ.5.50 కోట్ల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ శుక్రవారం శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. మణికొండలోని నేక్నంపూర్ ,ఉప్పల గూడలలో బస్తీ దవఖానా, 8,18, 4, వార్డులలో కాళోజి పార్క్ కె పిఆర్ పార్క్,అబ్దుల్ కలాం పార్కులో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు. పుప్పాలగూడలో నిర్మించిన సీవరేజ్ లైను సీసీ రోడ్డు, నెమలి నగర్‌లో నిర్మించనున్న బస్తీ దవాఖానా ప్రారంభించారు. నెమలి నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ సహాయ సహకారాలతో రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, నరేందర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

## అనాథ ఆశ్రమానికి బియ్యం అందజేత



**ప్రజాపక్షం/యాచారం :** అనాథలను అదుకోవడానికి తన వంతుగా సహాయసహకారాలు అందించేందుకు కృషి చేస్తానని యాచారం సిఐ నర్సింహ్మారావు అన్నారు. శుక్రవారం మంచాల మండలం ఆగపల్లి గ్రామంలో ఉన్న మానవ సేవా అనాథ ఆశ్రమంకు 2 కింటాళ్ళ బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యానవన పంటల సాగు మేలు



**ప్రజాపక్షం/యాచారం:** రైతులు తక్కువ నీటితో, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వచ్చే ఉద్యానవన పంటలను సాగు చేసుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖ, సెరి కల్చర్ అధికారి సురేశ్ అన్నారు. శుక్రవారం యాచారం మండల పరిధిలోని గున్‌గల్,తక్కళ్ళపల్లి గ్రామాలలో మామిడి, అయిల్ ఫాం, కూరగాయల విత్తనాల సాగును పరిశీలించారు. ఈ సంధర్భంగా అయన మాట్లాడుతూ డిఫ్ సిస్టం ద్వారా తక్కువ నీటితో పంటలను పండించుకోవడానికి ఎంతగానో విలుంటుందన్నారు. కార్యక్రమంలో అధికారులు కవిత, బి. శ్రీలత, హెచ్ఒ నవినా తదితరులు పాల్గొన్నారు.

## దైవభక్తితో మనస్సుకు ప్రశాంతత

**ప్రజాపక్షం/నందిగామ:** దైవభక్తితో మనస్సుకు ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎంపిపి ప్రియాంక శివశంకర్ గౌడ్ అన్నారు. శుక్రవారం నందిగామ మండల పరిధిలోని చేగూరు గ్రామంలో ఉన్న శ్రీ సాయిబాబా దేవాలయం 16వ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారి పల్లకి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియాంక శివశంకర్ గౌడ్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహించడంతోపాటు స్వామివారి పల్లకి సేవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మెన్ విఠల్ ముదిరాజ్‌తో పాటు మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

# ప్రజలకు అందుబాటులో ఆసుపత్రి

### డయాలసిస్ సెంటర్ నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయండి : షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి సకాలంలో పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్ చర్యలు తీసుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. శుక్రవారం పట్టణ శివారులో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. ఆసుపత్రిలోని అన్ని వార్డులో పర్యటించి పనులను పరిశీలించడంతోపాటు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ షాద్‌నగర్‌లో వంద పడకల ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తే ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. ఈ ఆసుపత్రిలో అన్ని మౌలిక సౌకర్యాలతోపాటు వైద్య సిబ్బంది సంఖ్యను సైతం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి వచ్చే ఐదు నెలల్లోనే ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. షాద్‌నగర్ పట్టణంలో ఉన్న 50పడకల ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేస్తూ 100పడకలకు పెంచడం జరిగిందని, రోగుల తాకిడిని దృష్టిలో పెట్టుకొని అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. నూతనంగా నిర్మిస్తున్న ఆసుపత్రిలోనే డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని, ఆ పనుల్లో వేగం పెంచి పూర్తి చేయాలని సూచించారు. పట్టణంలో ఉన్న పాత ఆసుపత్రి భవనాన్ని మరో సెంటర్‌గా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్, లింగారెడ్డిగూడ అశోక్, రమేష్ గౌడ్, సురేష్ గౌడ్, మల్లేష్ యాదవ్, శ్రీధర్ గౌడ్, ఫకీర్‌భాషా, లక్ష్మీ కాంత్‌రెడ్డి, మంగలి మల్లేష్, షాబాద్ శంకరయ్య, రాయికల్ శ్రీనివాస్, ముబారక్, శ్రీశైలం, శేఖర్, కిట్టు పాల్గొన్నారు.

# క్రీడ



# బంపర్ ఆఫర్..

## చాంపియన్స్ ట్రోఫీ ప్రైజ్‌మనీ ప్రకటించిన ఐసిసి

ప్రతిష్టాత్మక ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ మరో మూడు రోజుల్లో ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభం కానుంది. అయితే తాజాగా ఛాంపియన్స్ ట్రోఫీ ప్రైజ్ మనీ వివరాలను ఐసీసీ అధికారికంగా ప్రకటించింది. గతంలో పోలిస్తే ప్రస్తుతం దాదాపు 53 శాతం ప్రైజ్ మనీని పెంచినట్లు తెలిపింది. అత్యుత్తమ జట్లు మాత్రమే తలపడే ఛాంపియన్స్ ట్రోఫీ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ మెగా టోర్నీలో పోరు హోరాహోరీగా ఆసక్తికరంగా సాగుతుంటుంది. బౌలర్లపై పైచేయి సాధించేందుకు బ్యాటర్లు, బ్యాటర్లను బోల్తా కొట్టించేందుకు బౌలర్లు తీవ్రంగా కష్టపడుతుంటారు. మొత్తంగా 8 జట్లు పోటీ పడే ఈ మెగా ఈవెంట్‌లో ప్రతీ టీమ్ కూడా ఈ ట్రోఫీలో విజయం సాధించాలని తీవ్రంగా పోరాడుతుంటాయి. మరి ఈ ట్రోఫీ విజేతకు ఈ సారి ప్రైజ్ మని ఎంత ఇవ్వనున్నారో అధికారికంగా ప్రకటించింది ఐసీసీ.

**ప్రైజ్ మనీ వివరాలు :**

విజేత ప్రైజ్ మనీ : రూ.20.8 కోట్లు;
రన్నరప్ ప్రైజ్ మనీ : రూ.10.4 కోట్లు;
సెమీ ఫైనలిస్టు ప్రైజ్ మనీ: ఒక్కో జట్టుకు రూ. 5.2 కోట్లు
ఐదో స్థానం, ఆరో స్థానంలో ఉన్న జట్లకు : రూ.3 కోట్లు
ఏడు, ఎనిమిదో స్థానాల్లో ఉన్న జట్లకు : రూ.1.2 కోట్లు
ప్రతి మ్యాచ్ కు ప్రైజ్ మనీ : రూ.29 లక్షలు

**గతసీజన్‌లో ప్రైజ్ మనీ ఎంతంటే?**

2017 ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో విజేతగా నిలిచిన పాకిస్థాన్‌కు రూ. 14.18 కోట్లను ప్రైజ్ మనీగా ఇచ్చారు. రన్నరప్ భారత్‌కు రూ.7 కోట్లు అందింది. సెమీస్‌కు అర్హత సాధించిన ఇంగ్లాండ్ బంగ్లాదేశ్‌కు తలో రూ.3 కోట్లు, ఐదు, ఆరు స్థానాల్లో నిలిచిన ఆస్ట్రేలియా, సౌతాఫ్రికాకు చెరో రూ.58 లక్షలు, చివరి రెండు స్థానాల్లో నిలిచిన శ్రీలంక, న్యూజిలాండ్‌కు రూ.39 లక్షలు ఇచ్చారు.

# బోణీ కొట్టిన బెంగళూరు

## గుజరాత్‌పై విజయం



మహిళల ప్రీమియర్ లీగ్‌లో డిఫెండింగ్ ఛాంప్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు శుభారంభం చేసింది. శుక్రవారం గుజరాత్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆర్సీబీ 6 వికెట్ల తేడాతో నెగ్గింది. 202 పరుగుల భారీ లక్ష్యాన్ని ఆర్సీబీ 18.3 ఓవర్లలోనే ఛేదించింది. రిచా ఘోష్ (64* పరుగులు) సూపర్ ఇన్నింగ్స్‌తో రఫ్ఫాడించింది. కనికా అహుజ (30* పరుగులు) రాణించింది. కెప్టెన్ ఎల్లిస్ పెర్రీ (57 పరుగులు) హాఫ్ సెంచరీతో ఆకట్టుకుంది. గుజరాత్ బౌలర్లలో గార్డ్‌నర్ 2, డాటిన్, సట్గరె తలో 1 వికెట్ దక్కించుకున్నారు.

అంతకుముందు బ్యాటింగ్ చేసిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 201 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఇన్నింగ్స్ ప్రారంభం నుంచే ఓపెనర్ బెత్ మూనీ (56 పరుగులు) బౌండరీలతో స్కోర్ బోర్డును పరుగులు పెట్టించింది. మరో ఓపెనర్ లారా వాల్‌వార్ట్ (6 పరుగులు), హేమలత (4 పరుగులు) విఫలమయ్యారు. తర్వాత వచ్చిన కెప్టెన్ గార్డ్‌నర్ (79 పరుగులు, 37 బంతుల్లో; 3x4, 8x4) సిక్సర్ల వర్షం కురిపించింది. ఈ క్రమంలోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసింది.

ఇక చివర్లో డియేండ్ డాటిన్ (25 పరుగులు) 3 ఫోర్లు, 1 సిక్స్ కూడా ఆకట్టుకుంది. సిమ్రన్ (11 పరుగులు), హర్లీన్ (9 పరుగులు) ఫర్వాలేదనిపించారు. ఆర్సీబీ బౌలర్లలో రేణుకా సింగ్ 2, అహుజ, వేర్‌గమ్, ప్రేమ రావత్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు.



# ఆస్ట్రేలియాను చిత్తు చేసిన శ్రీలంక..

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ప్రారంభానికి ముందు వన్డే ప్రపంచకప్ ఛాంపియన్ ఆస్ట్రేలియాకు ఊహించని పరాజయం ఎదురైంది. శ్రీలంక పర్యటనలో రెండు వన్డేల సిరీస్‌లో ఆసీస్ 02తో క్లీన్ స్వీప్ అయ్యింది. శుక్రవారం జరిగిన రెండో వన్డేలో శ్రీలంక 174 పరుగుల భారీ తేడాతో ఆస్ట్రేలియాను చిత్తు చేసింది. ఈ గెలుపుతో రెండు వన్డేల సిరీస్‌ను శ్రీలంక కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్లకు 281 పరుగులు చేసింది. కుశాల్ మెండీస్(115 బంతుల్లో 11 ఫోర్లతో 101) సెంచరీతో చెలరేగగా.. చరిత్ అసలంక(66 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లతో 78 నాటౌట్), నిషాన్ మధుషంక(70 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 51) హాఫ్ సెంచరీలతో రాణించారు. ఆస్ట్రేలియా బౌలర్లలో బెన్, ఆరోన్ హార్డీ, సీన్ అబాట్, ఆడమ్ జంపా తలో వికెట్ తీసారు.

**రఫ్ఫాడించిన శ్రీలంక..**

అనంతరం లక్ష్యఛేధనకు దిగిన ఆస్ట్రేలియా 24.2 ఓవర్లలో 107 పరుగులకు కుప్పకూలింది. కెప్టెన్ స్టీవ్ స్మిత్(34 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 29), జోష్ ఇంగ్లీస్(27 బంతుల్లో 4 ఫోర్లతో 22) టాప్ స్కోరర్లుగా నిలవగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. ట్రావిస్ హెడ్18), గ్లేన్ మ్యాక్స్‌వెల్(1) తీవ్రంగా నిరాశపరిచారు. శ్రీలంక బౌలర్లలో దునిత్ వెల్లలగే(4/35) నాలుగు వికెట్లు తీయగా.. వానిందు హసరంగా, అసితా ఫెర్నాండో మూడేసి వికెట్లు పడగొట్టారు.

# 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' ట్రైలర్ రిలీజ్..



దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమలో ప్రముఖ నిర్మాణ సంస్థల్లో ఒకటైన ఎజిఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ వరుసగా హిట్ చిత్రాలను నిర్మిస్తోంది. ఎజిఎస్ ఎంటర్‌టైన్‌మెంట్, ప్రదీప్ రంగనాథన్ కాంబోలో బ్లాక్ బస్టర్ 'లవ్ టుడే' చిత్రం వచ్చింది. ఇప్పుడు మళ్లీ ఈ కాంబో 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' ఆడియెన్స్ ముందుకు రాబోతోంది. ఈ చిత్రాన్ని కల్పాతి ఎస్. అఘోరం, కల్పాతి ఎస్. గణేష్, కల్పాతి ఎస్. సురేష్ నిర్మించారు. ఒరి దేవుడా సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహించారు. ఈ మూవీ ఫిబ్రవరి 21న రాబోతోంది. ఈ క్రమంలో తాజాగా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈ ట్రైలర్‌లో అన్ని రకాల అంశాలను జోడించారు. యూత్‌కి కావాల్సినంత వినోదం, ప్రేమ, రొమాన్స్, ఫ్యామిలీ ఎమోషన్స్ ఇలా అన్నింటినీ జోడించారు. ఇంజనీరింగ్‌లో 48 బ్యాక్‌లాగ్‌లు పెట్టుకున్న హీరో.. కాలేజీలో పనీ పాటా లేనీ గాలికి తిరిగే ఓ కుర్రాడిగా కనిపించాడు. ప్రేమ, బ్రేకప్, లైఫ్‌లో సెటిల్ అవ్వడం కోసం కష్టపడే తీరు ఇలా అన్నీ చూపించారు. ఫ్యామిలీ ఎమోషన్‌ను కూడా ట్రైలర్‌లో చూపించారు. బాధ్యతారాహిత్యంగా ఉండే కుర్రాడి జీవితంలో వచ్చే సమస్యలు, సవాళ్లను చూపిస్తూ.. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఓ ఎంటర్టైనర్ మూవీ అవుతుందని ట్రైలర్ చూస్తేనే తెలుస్తోంది.

# లీల

## భాగ్యశ్రీ భోర్సే.. ఫస్ట్ లుక్ రిలీజ్



మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్, దగ్గుబాటి రానా మల్టీస్టారర్‌గా వస్తున్న చిత్రం 'కాంత'. ఈ సినిమాకు తమిళ దర్శకుడు సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహిస్తుండగా.. మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుంది. స్పిరిట్ మీడియా, వేఫేరర్ ఫిలమ్స్ పతాకాలపై రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ ఈ సినిమాను సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 1950 మద్రాస్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రాబోతుండగా.. ఈ చిత్రం మానవ బంధాలు, సామాజిక మార్పులతో గొప్ప అనుభూతిని పంచేలా ఉంటుందని దర్శకుడు ఇప్పటికే ప్రకటించాడు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి మేకర్స్ ఇప్పటికే దుల్కర్ ఫస్ట్‌లుక్‌ని పంచుకోగా.. దుల్కర్ రెట్రో స్టైల్‌లో అలరిస్తున్నాడు. అయితే వాలంటైన్స్ కానుకగా తాజాగా భాగ్యశ్రీ బోర్సే ఫస్ట్ లుక్‌ని విడుదల చేసింది చిత్రబృందం. తెలుగు, మలయాళం, తమిళం, కన్నడ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.

# కథ బాగుంటే బామ్మ పాత్ర కూడా..

**రష్మిక మందన్న**



అగ్రహీరోల సరసన నటిస్తూ వరుస విజయాలను తన ఖాతాలో వేసుకుంటున్నారు నటి రష్మిక. తాజాగా 'ఛావా'తో ప్రేక్షకులను పలకరించి మెప్పించారు. ఈ సినిమా విడుదల నేపథ్యంలో ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడుతూ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తాను జీవితాన్ని సీరియస్‌గా తీసుకోనని.. ఏదో శక్తి తనను నడిపిస్తుందని నమ్ముతానని చెప్పారు. 'ప్రతి దాని గురించి ఆలోచించడం ప్రారంభిస్తే జీవితం చాలా కష్టతరమవుతుంది. అందుకే నేను దేన్నీ సీరియస్‌గా తీసుకోను. కాలంతోపాటు ముందుకు సాగుతాను. నిజాయతీగా నా పని చేసుకుంటూ పోతాను. ఎవరైనా సినిమా కోసం సంప్రదించినప్పుడు కథకు ప్రాధాన్యమిస్తా. కథ బాగుంటే నలుగురు పిల్లల తల్లిగానైనా నటిస్తాను. బామ్మ పాత్ర చేయడానికి కూడా వెనుకాడను. కథ నచ్చి అందులో నేను భాగం కావాలనుకున్నప్పుడు ఇలాంటి పట్టింపులు ఉండవు. నా సినిమాల విజయం వెనక ఎలాంటి ప్రణాళికలు లేవు. అదృష్టవశాత్తూ అవి ప్రేక్షకాదరణ పొందుతున్నాయంతే. అలాంటి గొప్ప కథల్లో భాగం కావడం నా అదృష్టం. ప్రేక్షకులు ఆ పాత్రల్లో నన్ను ఇష్టపడుతున్నందుకు ఆనందంగా ఉంది. సినిమాల విజయం మన చేతిలో ఉండదు'' అని చెప్పారు. ఇక తన తాజా చిత్రం 'ఛావా' గురించి రష్మిక మాట్లాడుతూ.. ''హీరోలందరూ ఇలాంటి కథలో భాగం కావాలని కోరుకుంటారు. ఛత్రపతి శివాజీ మహారాజ్, ఆయన కుమారుడు శంభాజీ మహరాజ్ గురించి మనం పుస్తకాల్లో చదివినప్పుడు భావోద్వేగాలు తెలియవు. వారి జీవితాలను తెరపై చూస్తున్నప్పుడు కళ్లకు కట్టినట్లు అనిపిస్తాయి. అలాంటి గొప్ప వారి వల్లే మనం ఈరోజు దేశంలో ఉండగలుగుతున్నాం. 'ఛావా'లో యేసుబాయిగా నటించే అవకాశం వచ్చినందుకు నిజంగా గర్వపడుతున్నాను. ఇలాంటి మహారాణి పాత్రలో నటిస్తానని ఎప్పుడూ అనుకోలేదు. చాలా సంతోషంగా ఉంది'' అని అన్నారు.

# టాలీవుడ్‌లో విషాదం





టాలీవుడ్‌లో వరుస విషాదాలు చోటు చేసుకున్నాయి. తనదైన వెర్సటైల్ డైరెక్టర్‌గా పేరుతెచ్చుకున్న దర్శకుడు చంద్రశేఖర్ ఏలేటి తండ్రి కన్నుమూశారు. ఏలేటి సుబ్బారావు(75) గత కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. తూర్పు గోదావరి జిల్లా తుని మండలం రేఖవానిపాలెంలో నివాసముంటున్న ఆయన అక్కడే తుదిశ్వాస విడిచినట్లు తెలుస్తోంది. మరో విషాదం హీరో కమ్ డైరెక్టర్ రాహుల్ రవీంద్రన్ ఇంట్లో చోటు చేసుకుంది. రాహుల్ రవీంద్రన్ తండ్రి గారు రవీంద్రన్ నరసింహన్ కన్నుమూశారు. ఈ విషయాన్ని రాహుల్ స్వయంగా తన ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. తన తండ్రితో తనకు ఉన్న అనుబంధాన్ని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇలా టాలీవుడ్‌కి చెందిన ఓ యాక్టర్, ఓ డైరెక్టర్ తండ్రులను కోల్పోవడంతో అభిమానులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. పలువురు టాలీవుడ్ ప్రముఖులు వారికి తమ సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

# లంచం తీసుకుంటూ.. ఎసిబికి పట్టుబడ్డ సర్వేయర్ రవి



**ప్రజాపక్షం /మిర్యాలగూడ :** తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు కార్యాలయంలో సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న రవి నాయక్ సరంపేట గ్రామానికి చెందిన ఓ రైతు వద్ద నుండి 12 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండుగా ఏసీబీ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. అయితే రవిపై ఏసీబీ అధికారులు గత కొంతకాలం నుండి నిగా పెట్టడం జరిగింది అయితే ఆయన అవినీతి పరుడు కావడంతో ఏసిబి అధికారులు రెండు బృందాలుగా విడిపోయి తాను విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ కార్యాలయంతో పాటు మిర్యాలగూడ లోని ఇంటి వద్ద ఒకే సారి సోదాలు చేపట్టారు ఇంట్లో ఉన్న విలువైన పత్రాలను నల్లగొండ డిఎస్‌పి ఎం జగదీష్ చంద్ర, సిఐలు వెంకట్రావు, రామారావు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పగడ్బందీగా సోదాలు నిర్వహిస్తున్నారు.

# గచ్చిబౌలిలో పట్టుబడిన ట్రాన్స్ కో ఎడిఇ



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** గచ్చిబౌలి ట్రాన్స్ కో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఆపరేషన్స్(టిజిఎస్‌పిడిసిఎల్ ఎడిఇ)కె. సతీష్ కుమార్ రూ.50వేలు లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు పట్టుబడ్డాడు. అపార్ట్‌మెంట్‌లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ తోపాటు సిటి మీటర్‌ను ఇన్‌స్టాల్ చేయడానికి రూ.75వేలు లంచంకు డిమాండ్ చేశాడు. వినియోగదారు నుంచి ఇప్పటికే రూ.25 వేలు తీసుకున్నాడు. శుక్రవారం రూ.50వేలు తీసుకుంటుండగా ఎసిబి అధికారులు పట్టుకున్నారు.

# కులగణన సర్వే దేశానికే ఆదర్శం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే దేశానికే ఆదర్శమని, దీనిని గ్రామ స్థాయిలో విస్తృతంగా ప్రజలకు తెలియజేయాలని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. టిపిసిసి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లోని ప్రకాశం హాల్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులకు ''కులగణన, ఎస్‌సి వర్గీకరణ''పై శుక్రవారం పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. కులగణనపై డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, ఎస్‌సి వర్గీకరణపై మంత్రి దామోదర రాజనర్సింహ పవర్ పాయింట్ ఇచ్చారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కులగణన సర్వేను మొదటి సారి దేశంలోనే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందని, దీనిని చూసి కొందరు ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం శాస్త్రీయ బద్ధంగా చేపట్టిన సర్వేను, ఎస్‌సి వర్గీకరణ అమలు విషయాన్ని కూడా గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యకర్తలకు అనుకున్న స్థాయిలో న్యాయం చేయలేదని, రాబోయే రోజులు కాంగ్రెస్ కార్యకర్తలవేనని అన్నారు. ప్రభుత్వ పరంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ప్రజల నుండి అనుకున్న స్థాయిలో సానుకూలత రావడం లేదన్నారు.

**నచ్చనివాళ్లే ఆరోపిస్తున్నారు..: భట్టి విక్రమార్క**



బిసి కులగణనపై భట్టి విక్రమార్క మల్లు పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్యులకు కాంగ్రెస్ ప్రభుత్వం మేలు చేయడం నచ్చని వాళ్లు రాష్ట్ర ప్రభుత్వంపైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. కులగణన సర్వేలో ఎటువంటి పొరపాటు జరగలేదని స్పష్టం చేశారు. బిసిలకు మేలు జరగకుండా రాజకీయ కారణాలతో బిఆర్‌ఎస్ పలు అభియోగాలు మోపుతోందని ఆరోపించారు. సర్వేలో కెసిఆర్,కెటిఆర్‌లాంటి వాళ్లు పాల్గొనలేదన్నారు.

**త్వరలోనే అమలులోనికి ఎస్‌సి వర్గీకరణ : దామోదర్ రాజనర్సింహ**



అనంతరం మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ త్వరలోనే ఎస్‌సి వర్గీకరణ అమల్లోకి వస్తుందని, ఆ తర్వాత ఉద్యోగాల నోటిఫికేషన్లు వస్తాయని వెల్లడించారు. వర్గీకరణ ప్రకారమే ఉద్యోగాల భర్తీ, రిజర్వేషన్ల అమలు జరుగుతుందన్నారు. వన్ మ్యాన్ జ్యుడీషియల్ కమిషన్ ఇచ్చిన నివేదికలో 0.01 శాతం కూడా మార్చాల్సిన అవసరం లేదని, యథావిధిగా వర్గీకరణను అమలు చేస్తామని, సుప్రీంకోర్టు పేర్కొన్న ఎంపిరికల్ డేటాతో పాటు ఇతర అన్ని ప్రమాణాలనూ పరిగణలోకి తీసుకుంటామని, ప్రతి వర్గానికీ న్యాయం చేసేలా కమిషన్ నివేదిక ఇచ్చిందన్నారు. క్రీమీలేయర్ మినహా కమిషన్ నివేదికను యథావిధిగా కేబినెట్ ఆమోదించిందని దామోదర రాజనర్సింహ తెలిపారు.



# మాజీ సిఎం దామోదరం సంజీవయ్యకు నివాళి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా సంజీవయ్య పార్క్‌లో ఉన్న ఆయన విగ్రహానికి అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, మాజీ ఎంపి వి.హనుమంతరావు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. స్పీకర్ ప్రసాద్ కుమార్ ఈ సందర్భంతా మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా ఎఐసిసి అధ్యక్షునిగా చిన్నవయసులోనే దామోదరం సంజీవయ్య మహోన్నత పదవులను అలంకరించినారని తెలిపారు. హనుమంతరావు మాట్లాడుతూ సిఎంగా ఎఐసిసి అధ్యక్షునిగా పనిచేసిన సంజీవయ్యకు సొంత ఇల్లు కూడా లేదు ఇలాంటి నాయకులు చరిత్రలో నిలిచి పోతారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ఆర్.లక్ష్మణ్‌యాదవ్, బొల్లు కిషన్, యాదగిరి గౌడ్ అఫ్సర్ యూసుఫ్, జాయి శంభుల, శ్రీకాంత్ గౌడ్, గరిగంటి రమేష్, దిండి రాంబాబు, పులి జగన్, ఎస్‌సి సెల్ చైర్మన్ రమేష్ బాబు శంభుల, మహిళా కాంగ్రెస్ నాయకులు విజితా రెడ్డి, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు

# రైతులతో కేంద్రం చర్చలు

(మొదటి పేజీ తరువాయి)



గుర్మీత్ సింగ్ ఖుద్దియన్, ఆహార పౌర సరఫరాల మంత్రి లాల్ చంద్ కతరుచక్, ఇతర అధికారులు హాజరయ్యారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి సాయంత్రం 5గంటలకు సమావేశ ప్రాంతానికి చేరుకున్నారు. కనౌరి సరిహద్దు వద్ద నిరాహార దీక్ష చేస్తున్న రైతు సంఘం మాజీ నాయకుడు జగ్జిత్ సింగ్ దల్లెవాల్ కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఆయనను సరిహద్దునుంచి అంబులెన్స్‌లో సమావేశ ప్రాంతానికి తీసుకువచ్చారు. ఇందుకు నాలుగు గంటల సమయం పట్టిందని రైతు నాయకుడు కాకా సింగ్ కోత్రా తెలిపారు. పలు రైతు సమస్యలతోపాటు కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ ఇవ్వాలన్న డిమాండ్‌తో దల్లెవాల్ నవంబర్ 26నుంచి నిరాహార దీక్ష చేస్తున్నారు. కనీస మద్దతు ధరపై ఒక చట్టం తీసుకురావాలని మరో రైతు నాయకుడు అభిమన్యు కోహర్ తెలిపారు. సమావేశంలో దీనిపై కేంద్రంపై వత్తిడి తీసుకువస్తామన్నారు. కనీస మద్దతు ధరపై చట్టబద్ధమైన హామీ లభిస్తే అది దేశంలోని అన్ని వర్గాలకు లాభిస్తుందన్నారు. వివిధ రైతు సంఘాల నాయకులు శర్వణ్ సింగ్ పాంధర్, అభిమన్యు కోహర్, కాకా సింగ్ కోత్రా, సుఖ్‌జిత్ సింగ్. పి.ఆర్.పాండియన్, అరుణ్ సిన్హా, లఖ్వీందర్ సింగ్, జస్వీందర్ లాంగోవాల్, ఎం.ఎస్.రాయ్, నంద కుమార్, బల్వంత్ సింగ్ బెహ్రంకె, ఇందర్‌జిత్ సింగ్ కోట్బుధ రైతు ప్రతినిధుల బృందంలో ఉన్నారు.

జనవరి 18న కేంద్ర వ్యవసాయ శాఖ సంయుక్త కార్యదర్శి ప్రియా రంజన్ నేతృత్వంలోని ఉన్నతాధికారుల బృందం చర్చలకు రావాల్సిందిగా సంయుక్త కిసాన్ మోర్చా(నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా సంఘాలను ఆహ్వానించింది. దీనితో దల్లెవాల్ వైద్య సహాయం పొందేందుకు అంగీకరించారు. కానీ నిరాహార దీక్షను నిలిపేందుకు నిరాకరించారు. 2024 ఫిబ్రవరిలో కేంద్ర మంత్రులు, రైలు సంఘాలతో నాలుగు విడతలుగా చర్చలు జరిగినా అపరిష్కృతంగానే ముగిసాయి. గత యేడాది ఫిబ్రవరి 18న కేంద్ర మంత్రులు అర్జున్ ముండా, పియుష్ ఘోయల్, నిత్యానంద రాయ్‌ల సమక్షంలో జరిగిన సమావేశంకూడా అసంపూర్తిగానే ముగిసింది. కనీస మద్దతు ధరకు అయిదేళ్లపాటు జొన్నలు, పత్తి, తృణ ధాన్యాలను కొనుగోలు చేస్తామన్న కేంద్రం ప్రతిపాదనను రైలు సంఘాలు తిరస్కరించాయి. గత యేడాది ఫిబ్రవరి 13న తమ సమస్యలను వినిపించేందుకు ఢిల్లీకి వస్తున్న రైతు బృందాలను కేంద్ర బలగాలు అడ్డకున్నాయి. అప్పటినుంచి పంజాబ్, హర్యానా సరిహద్దులలోని షంభు, కనౌరి ప్రాంతాలలో రైతులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం, రుణ మాఫీ, రైతులకు, వ్యవసాయ కార్మికులకు పెన్షన్, విద్యుత్ బిల్లుల పెంపుదల నిలిపివేత, 2021లో లఖింపూర్ ఖేరి అల్లర్ల బాధితులకు నష్టపరిహారం, 2020–21 ఆందోళనలో చనిపోయిన రైతు కుటుంబాలను ఆదుకోవడం, 2013 భూసేకరణ చట్టాన్ని పునరుద్ధరించడం రైతుల ప్రధాన డిమాండ్లు.

# కోర్టులు ఆదేశించలేవ్

(మొదటి పేజీ తరువాయి)

ఈ వ్యాఖ్యలు చేసింది. 'పార్లమెంట్ ప్రతీ అంశాన్ని పరిగణనలోనికి తీసుకున్న తర్వాత ఒక చట్టం రూపొందించబడింది. రిట్ అధికార పరిధిలో, హైకోర్టు కానీ లేదా సుప్రీంకోర్టు కానీ ఒక ప్రత్యేక విధానంలోనే చట్టాలు చేయాలని చట్టసభను ఆదేశించలేదు' అని బెంచ్ పేర్కొంది.అదే సమయంలో అభ్యర్థనను వినడానికి నిరాకరించింది. ఫిర్యాదుదారు లేదా బాధితులకు ఉచితం గా ఛార్జిషీట్‌ను అందజేసేలా జిల్లా కోర్టులు లేదా పోలీసులకు మార్గనిర్దేశనం చేయాలని ప్రజాప్రయోజనాల వ్యాజ్యం కోరింది.కేంద్రం తరపున వాదిస్తున్న న్యాయవాది 2023 భారతీయ నాగరిక్ సురక్ష సంహిత సెక్షన్ 230ను సూచిస్తూ ఈ పిటిషన్ పనికిరానిదని అన్నారు. పిటిషన్ తరపు న్యాయవాది భారతీయ నాగరిక్ సురక్ష సంహిత( బిఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ 230 ప్రకారం..ఒక ఫిర్యాదుదారు లేదా బాధితుడు అతడు ప్రీ ట్రయల్ క్రిమినల్ ప్రొసీడింగ్స్‌లో పాల్గొనే హక్కును కలిగి ఉంటాడన్నారు. విచారణకు ముందు జరిగే క్రిమినల్ ప్రొసీడింగ్స్‌లో తన వాదనలు వినిపించే హక్కును, వినియోగించుకోవడానికి పాల్గొనేందుకు వీలుగా పాల్గొనేందుకు కాగ్నిజెన్స్ తీసుకునే సమయంలో ఫిర్యాదు దారులు లేదా బాధితులకు అన్ని జిల్లా కోర్టులు మార్గనిర్దేశం చేయాలని కూడా ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం కోరింది. అత్యున్నత న్యాయస్థానం తీర్పు, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సవరణలను ప్రస్తావిస్తూ ఒకవేళ వారు ఎన్నుకోబడినట్లయితే, ముందస్తు విచారణ లేదా విచారణ ప్రక్రియలలో సమర్థవంతంగా పాల్గొనడానికి బాధితులు లేదా ఫిర్యాదుదారులకు సరిపోను హక్కులు ఇవ్వబడినట్లు హైకోర్టు పేర్కొంది. ఇది ఢిల్లీ హైకోర్టు నిబంధనలను కూడా ప్రస్తావించింది. క్రిమినల్ కేసులో ఒక పక్షానికి సంబంధించిన కాపీలను పొందే అర్హత ఉందని కూడా స్పష్టం చేసింది. మహిళలు, పిల్లలపై జరిగే లైంగిక నేరాలకు వ్యతిరేకంగా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఒపి)ని అమలు చేయాలని 2020అక్టోబరులో కేంద్ర హోంమంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఆదేశాలు జారీచేసిందని హైకోర్టు తెలిపింది.

# నియామకాలు

(మొదటి పేజీ తరువాయి)

చేసుకున్నారు. అయితే డెమో నిర్వహించకుండానే వారికి అనుకూలంగా ఉన్న వారిని షార్ట్ లిస్ట్ చేసి హైదరాబాద్ ప్రధాన కార్యాలయానికి పంపారు. అక్కడ డెమోలు సైతం నిర్వహించి, విషయం తెలుసుకున్న నిరుద్యోగ బాధితులు అసలు సమాచారం ఇవ్వకుండా, జిల్లా కేంద్రంలో డెమో నిర్వహించకుండా ఏ ప్రాతిపదికన షార్ట్ లిస్టు చేశారంటూ కనిపించిన వారి కల్లా చెబుతూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అసలు నిబంధనలు ఇవే**

మైనారిటీ వెల్ఫేర్ కళాశాలలో పీజీ సిఆర్టి,టీజీటీ పోస్టులకు పలు నిబంధనలను పెట్టారు.వాటిలో ముఖ్యంగా అకాడమిక్ ఇయర్ పూర్తయ్యే వరకు సదరు ఉద్యోగి కళాశాలలోని పనిచేయాలని, దానికి అంగీకరిస్తూ తన ఒరిజినల్ ధ్రువ పత్రాలను కళాశాలకు అందజేయాలని నిబంధన.దానికి అంగీకరించిన వారు ఏజెన్సీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.దరఖాస్తూ తేదీ ముగిసిన తర్వాత జిల్లాలోని త్రీ మెన్ కమిటీ జిల్లా కేంద్రంలో ఒక్కో ఉద్యోగానికి 1:5 చొప్పున ఎంపిక చేయడానికి డెమో నిర్వహించాలి. డెమో లో ప్రావీణ్యత చూపెట్టిన వారిని షార్ట్ లిస్ట్ చేసి హైదరాబాద్ కేంద్రానికి పంపాలి. డెమోలో సెలెక్ట్ అయిన వారికి ముందుగానే సమాచారం ఇవ్వాలి. హైదరాబాద్ డెమోకు హాజరుకావాలని తేదీ సమయం చెప్పాలి. అక్కడ డెమోలో ఎంపికైన వారిని ఉద్యోగిగా ఎంపిక చేయాలి.

**నిబంధనలకు తూట్లు..**

కానీ నిబంధనలకు తూట్లు పొడుస్తూ జిల్లా కేంద్రంలో ఆర్‌ఎల్సి నిబంధనలను పాటించకుండానే కేవలం కొంతమందిని మాత్రమే కమిటీ ద్వారా డెమో ఉంటుంది అని హాజరుకావాలని చెప్పి చేతులు దులుపుకున్నారు. కేవలం తనకు అనుకూలంగా ఉన్నవారికి మాత్రమే సమాచారం ఇచ్చి హైదరాబాద్ డెమోకు పంపినట్లు దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**ఆర్‌ఎల్సి ఆగ్రహం...**

కాగా ఈ విషయమై సంబంధిత ఆర్‌ఎల్సిని ఫోన్ ద్వారా సమాచారం అడగగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు ఏమైనా కళాశాల అభివృద్ధి కోసం పది అడ్మిషన్లు ఇచ్చారా...? అని ఎదురు ప్రశ్నలు వేశారు. పారదర్శకంగా ఎంపిక చేశామని చెబుతున్నారు. పారదర్శకత అంటే ఏంటి అని ప్రశ్నించగా దరఖాస్తు చేసుకున్న వారిలో మెరిట్ లిస్టును ఆధారంగా చేసుకుని డెమోకు పంపినట్లు తెలిపారు. అసలు నిబంధనలలో మెరిట్ అనే అంశమే లేనప్పుడు మెరిట్‌ను ఏ విధంగా ప్రాతిపాదికన ఎంచుకున్నారు అనే విషయానికి సమాధానం లేదు. సమయం లేకపోవడంతోనే జిల్లా స్థాయిలో డెమో నిర్వహించలేదని చెబుతున్నారు. తప్పునంత ఏజెన్సీ వారి మీద ఎత్తేస్తున్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తిరిగి జిల్లాస్థాయిలో డెమో నిర్వహించి, అర్హులైన వారికి ఉద్యోగాలు ఇవ్వాలని దరఖాస్తు దారులు కోరుతున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com